క్రాంతి 30 యేళ్ల ప్రత్యేక సంచిక

# క్రాంతి

లోపలి పేజీల్లో

ఎన్.టి మహాసభ రిపోర్టు.......................7
పాలకవర్గ పార్టీలపై.......................8
అణు ఒప్పందం.......................15
వాకాడు ప్రతిఘటన.......................18
'వికాస్ పరిషత్'.......................19
మూస పద్ధతి రచనలు........మధ్య పేజీ
అమరవీరులకు జోహార్లు.......................30
హైదరాబాద్ బాంబు పేలుళ్లు...........40
ఎ.ఓ.బి పోరాట వార్తలు.......................41

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎన్.టి, ఎ.ఓ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 31 సంచిక :5 సెప్టెంబర్ – అక్టోబర్ 2007 వెల: ఐదు రూపాయలు

## ఉద్యమ కరదీపిక 'క్రాంతి'కి 30 యేళ్లు!

## నిర్బంధాలూ, నిషేధాలు 'క్రాంతి' బాటనాపలేవు!!

'క్రాంతి'కి 30 సంవత్సరాలు నిండాయి. ఒక పత్రికకు 30 యేళ్లు నిండడం పెద్ద విశేషమేమీ కాదు. కానీ 'క్రాంతి' నిత్య నిర్బంధం మధ్య, నిషేధాల మధ్య కొనసాగుతున్న పత్రిక. ఆ నిర్బంధం, నిషేధాల మూలంగా అనేక కష్ట నష్టాలను ఎదుర్కొంటున్న పత్రిక. ఈ కష్టనష్టాలన్నింటినీ భరిస్తూనే 'క్రాంతి' గత 30 యేళ్లుగా కార్మికవర్గ రాజకీయ ప్రచారకురాలిగా దృఢంగా కొనసాగుతున్నది.

'క్రాంతి' ఆవిర్భవించిన నేపథ్యాన్నీ, అది ఎదుర్కొన్న నిర్బంధం, దాని యంత్రాంగం, ప్రచురణలు మొదలైన విషయాలను, 25వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 'క్రాంతి' ఈ కింది విధంగా చెప్పుకుంది.

### "విప్లవకర ప్రజా పంథాలో 'క్రాంతి' ఆవిర్భావం!

భారతదేశంపై 'వసంత మేఘ గర్జన'గా అభివర్ణించబడిన మహత్తర నక్సల్‌బరి సాయుధ రైతాంగ తిరుగుబాటు అనేది భారతదేశ కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ఒక కీలకమైన మలుపనే చెప్పాలి. 'ఒక చిన్న నిప్పురవ్వ దావానలంగా రగులుతుంది' అనే మావో బోధనని అక్షరాలా రుజువు చేస్తూ నక్సల్‌బరి నిప్పురవ్వ అనతికాలంలోనే శ్రీకాకుళ గిరిజన రైతాంగ సాయుధ పోరాట జ్వాలగా రగిలింది. ఈ నేపథ్యంలోనే 'విప్లవకర పార్టీ లేనిదే విప్లవం లేదు' అనే లెనిన్ సూక్తిని అనుసరిస్తూ, నక్సల్‌బరి నిర్మాత కామ్రేడ్ చారుమజుందార్ నేతృత్వంలో 22-04-1969న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) ఆవిర్భవించింది. చైనాలానే మన దేశ సామాజిక వ్యవస్థ అర్ధవలస అర్ధఫ్యూడల్ స్వభావంతో కూడినదనే సరైన విశ్లేషణ ప్రాతిపదికగా ఇక్కడ సైతం అనుసరించాల్సిన వ్యూహం దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహంగా వుంటుందని; ఆ వ్యూహాన్ని అమలు చేయడానికి సాయుధ పోరాట ఎత్తుగడల పంథానే తప్ప పార్లమెంటరీ ఎన్నికల పంథా మార్గం కాదని 1970ల నాటి తన ప్రథమ కాంగ్రెస్‌లో భా.క.పా (మా-లె) తీర్మానించింది. 1970ల నాటి పార్టీ ఎత్తుగడల పంథా (దీన్నే సాధారణంగా పార్టీ పంథా అని వ్యవహరిస్తుంటాం) అంటే సాయుధ పోరాట పంథా, మౌలికంగానూ ప్రధానంగాను సరైందే అయినప్పటికీ అందులో ప్రజాయుద్ధానికి ప్రాణం వంటి ప్రజాపంథా (మాస్‌లైన్) లోపించిన కారణంగా పార్టీ నేతృత్వంలోని రైతాంగ విప్లవోద్యమం వెనుకడుగేసింది. ఉద్యమం వెనుకపట్టు పట్టడంతో పార్టీ చీలికలకు గురై పార్టీలో విచ్ఛిన్నకర శక్తులు విజృంభించి పార్టీ నాయకత్వంపైనా, ఉద్యమ పంథాపైన అవకాశవాద దాడులకి దిగారు. ఒక పక్క ఈ దాడుల్ని తిప్పికొడుతూ ఇంకో పక్క పార్టీ ఉద్యమాలని అతివాద ఒంటెత్తు పెడధోరణి నుంచి బయటపడవేసి, విప్లవకర ప్రజాపంథా పునాదిపై వాటిని పునర్నిర్మించే కర్తవ్యం ఆనాడు ప్రధానంగా ముందుకొచ్చింది. ఈ కర్తవ్య నిర్వహణకు సంబంధించిన కృషి దేశంలో ఇంకెక్కడి కంటే కూడా ఆంధ్రప్రదేశ్‌లో మరింత చురుగ్గాను నిర్మాణయుతంగానూ జరిగిందని చెప్పాలి. కామ్రేడ్ కె.ఎస్ నాయకత్వంలోని అప్పటి ఆంధ్రప్రదేశ్ పార్టీ ఎం.ఎల్ పార్టీ ఉద్యమాలని; వాటికి నాయకత్వం వహించిన కామ్రేడ్ చారుమజుందార్ నాయకత్వ పాత్రని స్వంతం చేసుకుంటూ; వాటి విప్లవాంశను గొప్ప వారసత్వ సంపదగా స్వీకరిస్తూ; అదే సమయంలో పార్టీ, ఉద్యమాలని అతివాద ఒంటెత్తు పెడధోరణి నుంచి బయటపడవేయాల్సిన అవసరాన్ని కూడా స్పష్టంగానే గుర్తిస్తూ తదనుగుణమైన కార్యాచరణ ప్రణాళిక గూర్చి నిశితంగా ఆలోచిస్తూ వచ్చింది. పార్టీ పంథాపై తిరోగమనవాదులు, రివిజనిస్టులు, విచ్ఛిన్నకులు చేస్తుండిన అవకాశవాద దాడుల్ని తిప్పికొడుతూ; సాయుధ పోరాట మౌలిక పంథాని ఎత్తిపడుతూ 'పిలుపు' పక్షపత్రిక ద్వారా సునిశిత సిద్ధాంత రాజకీయ పోరాటం నిర్వహించింది.

ఇలాంటి కృషి ఒక రూపం తీసుకుంటున్న సమయంలో ఎమర్జెన్సీ చీకటి పాలన విధించబడింది **(1975 జూన్ 26)**. దేశ ప్రజలంతా ముక్త కంఠంతో ఎమర్జెన్సీ పాలనని ఛీకొట్టిన ఫలితంగా జరిగిన ఎన్నికలలో ఇందిరా నియంతృత్వ కాంగ్రెస్ ఓడి కలగూర గంప జనతా ప్రభుత్వం ఏర్పడింది. ఇది ఎమర్జెన్సీ దుష్పరిపాలనే ప్రధాన ప్రచారాస్త్రంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అయినందున పరిస్థితిలో కొంత వెసులుబాటు ఏర్పడింది. ఈ తాత్కాలిక వెసులుబాటు స్థితిని సాధ్యమైనంతగా విప్లవోద్యమ పునర్నిర్మాణానికి వినియోగించుకోవాలని నాటి పార్టీ ఆంధ్రరాష్ట్ర కమిటీ భావించింది. ఈ ఆలోచనకి ప్రతిబింబమే **1977** నాటి తెలంగాణ రీజినల్ కాన్ఫరెన్స్ తీర్మానం. ఇది ప్రముఖంగా 'సాయుధ పోరాట విరమణ తీర్మానం'గా పిలవబడినప్పటికీ ఆచరణలోను, అంతఃసారంలోనూ అది సాయుధ పోరాటాన్ని మరింత సరిగాను, సమర్ధవంతంగానూ నిర్వహించడానికి వీలుగా పార్టీ ఎత్తుగడల పంథా అయిన సాయుధ పోరాట పంథాని, ప్రజా పంథా పునాదిపై నిలబెట్టనుద్దేశించిందేనని చెప్పాలి! ఇదే నిజమని తదనంతర మన ఆచరణే రుజువు చేసింది. విప్లవకర ప్రజాపంథా పునాదిపై పార్టీ ఉద్యమాల పునర్నిర్మాణ కృషిని ముందుకు తీసుకుపోవడానికి తనది అయిన ఒక కేంద్ర పత్రిక కలిగి వుండటం అవసరమని పార్టీ భావించింది. అలాంటి అవసరంలోంచి ఆలోచనలోంచి పుట్టుకొచ్చినదే 'క్రాంతి'! ఇదీ క్లుప్తంగా, 'క్రాంతి' ఆవిర్భావం వెనకుండిన నేపథ్యం! ఈ నేపథ్యంతో **1977** అక్టోబర్ నెలలో మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, అంతర్జాతీయ కమ్యూనిస్టు విప్లవనేత అయిన కామ్రేడ్ మావో స్మృత్యర్థ సంచికగా మహత్తర అక్టోబర్ విప్లవ జ్ఞాపకార్థ సంచికగా 'క్రాంతి' తొలిసంచిక వెలువడటం కేవలం యాదృచ్ఛికం కాదు. మా-లె-మాను మార్గదర్శక సిద్ధాంత ఆయుధంగా స్వీకరించి, బోల్షివిక్ స్ఫూర్తితో పార్టీ ఉద్యమాల్ని పునర్నిర్మించే బృహత్తర కర్తవ్యాన్ని భుజానెత్తుకున్న పార్టీ అధికార పత్రికకు అది సముచితమూ, సందర్భోచితమూ అయిన ప్రారంభమే!

ప్రారంభించినది మొదలు నిత్య నిర్బంధాల మధ్యనే ప్రయాణం చేస్తూ, ప్రజల పోరాటాల దర్పణంగా నిలుస్తూ, శత్రు అణచివేతని అధిగమిస్తూ పురోగమిస్తూనే వచ్చింది 'క్రాంతి'! విప్లవకర ప్రజాపంథాకి ప్రాతినిధ్యం వహించే ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో కూడిన సమరశీల ప్రజాపోరాటాలకి దర్పణంగా పని చేస్తూ వచ్చింది 'క్రాంతి'! గతంలో పార్టీ అనుసరిస్తుండిన అతివాద ఒంటెత్తు పెడధోరణి నుంచి పార్టీ ఉద్యమాలు బయటపడగలిగాయి అనేదానికి నిదర్శనంగా రంగం మీదికొచ్చిన కరీంనగర్ (జగిత్యాల) ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల వాణిగా పని చేసింది 'క్రాంతి'! ఆ పోరాటాల క్రమంలో రంగం మీదికొచ్చిన 'సాంఘిక బహిష్కరణ' లాంటి నూతన పోరాట రూపాలకి విస్తృత ప్రాచుర్యాన్ని కల్పిస్తూ వచ్చింది. 'నూతన ప్రాంతాలకి పోరాటాల్ని విస్తరింపచేయాలి' అనే పార్టీ విధాన నిర్ణయానికి అనుగుణంగా పార్టీ నిర్మాణ ఉద్యమాలులేని కొత్త ప్రాంతాలలో ఏ చిన్న ప్రజాందోళన జరిగినా దానికి ప్రాచుర్యాన్ని యిస్తూ ఆ రకంగా కొత్త ప్రాంతాలకి పార్టీ నిర్మాణ ఉద్యమాలు విస్తరించడానికి పార్టీ, అక్కడి ప్రజా సమస్యపై చేపట్టిన అనేక పోరాటాలకి గొప్ప ప్రచారవాహికగా పని చేసింది 'క్రాంతి'. ఈ క్రమంలోనే ఉత్తర తెలంగాణలో సమరశీల భూ పోరాటాలు ఊపందుకున్నాయి. వందల వేల ఎకరాలను రైతాంగ పేదలు స్వాధీన పరుచుకున్నారు. దోపిడీ దొరలను గ్రామాల నుంచి తరిమేసారు. పార్టీ ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రం అయిన నేపథ్యంలో సహజంగానే రంగంమీదికి వచ్చిన 'కిడ్నాపింగ్', 'ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం' లాంటి పోరాట రూపాలను విస్తృతంగా ప్రచారం చేసింది 'క్రాంతి'. ఈ తీరులో పార్టీ నాయకత్వం కింద రైతాంగ పోరాటాలు క్రమంగా విస్తరిస్తూ బలం పుంజుకొంటున్నకొద్దీ పార్టీ యంత్రాంగంపై అందులో భాగంగా 'క్రాంతి' యంత్రాంగంపై ప్రభుత్వ నిర్బంధం తీవ్రమైంది. ఇలాంటి నిర్బంధకాండ మధ్యనే నిలదొక్కుకుంటూ ఎదుగుతూ వచ్చిన తన ప్రయాణ క్రమాన్ని **1987** అక్టోబర్ నాటి దశాబ్ది సంచికలో 'క్రాంతి' ఈ కింది విధంగా సమీక్షించుకుంది.

## దశాబ్ది సమీక్ష

'గ్రామసీమలలో కేంద్రీకరించి కామ్రేడ్ మావో బోధించిన ప్రజాపంథాలో ప్రజా సమస్యలను పరిష్కరించి, వారిని పోరాటానికి ఉత్తేజపరిచి, గ్రామీణ పీడిత ప్రజలపై పార్టీ నాయకత్వాన్ని నెలకొల్పాలి. ఇంతవరకూ మనకు గ్రామాలతో అలాంటి సజీవ సంబంధాలు లేకపోవడమూ, గ్రామాలలో తగిన ప్రజాపునాది లేకపోవడమూ మన పార్టీ అభివృద్ధికి పెద్ద అవరోధంగా వుంది. కేవలం ప్రజల అభిమానమే చాలదు. పీడిత ప్రజలపై పార్టీ నాయకత్వాన్ని నెలకొల్పాలి' అంటూ పార్టీ చేపట్టిన ఆ కర్తవ్య నిర్వహణలో 'క్రాంతి' తన వంతు పాత్ర పోషిస్తూ 'ఉద్యమ అవసరాల రీత్యా సమన్వయాన్ని సాధించే పోరాట వేదికగా విప్లవ పత్రికను స్థాపించడం తక్షణ అవసరంగా ముందుకురాగా' అలాంటి అవసరాన్ని తీరుస్తూ రంగం మీదికొచ్చిన క్రాంతి పత్రికను తమదిగా స్వీకరించిన ప్రజలు అది నిలదొక్కుకోవడానికి వీలుగా ఎంతో చైతన్యంతో ముందుకు వచ్చి చందాలు కట్టారు. ఆర్థిక వనరులు సేకరించడంలో ఎంతో మంది కామ్రేడ్స్ కృషి చేసారు. రచనా వ్యాసంగాల ద్వారా పత్రిక కొనసాగడానికి మేధావులు తోడ్పడ్డారు..... ఆ విధంగా క్రాంతి పత్రిక మనుగడ ఒక సమిష్టి కృషిగా కొనసాగింది. ఎందరో ఎన్నో విధాలుగా నిమగ్నమైన కారణంగా క్రాంతి ఆవిర్భవించింది. అశేష పీడిత ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించగలుగుతోంది. ఒకటి, రెండు వేలతో ప్రారంభమైన దాని సర్క్యులేషన్ కొద్ది సంవత్సరాలలోనే ఆరు వేలకు చేరుకుంది.... పోరాట నివేదికలు పంపేవారు, క్రమం తప్పకుండా పత్రికను చదివి సలహాలు, సహాయ సహకారాలు అందించేవారు, వ్యాసాలు రాసేవారు, సంపాదకవర్గం, నిర్వాహకులు, పత్రిక ముద్రణ, పంపిణీలకు బాధ్యత వహించేవారు, దాన్ని ప్రజల్లోకి తీసుకుపోయే వారు - వీరందరి వెచ్చటి పొత్తిళ్లలోనే క్రాంతి రూపురేఖలు దిద్దుకుని, శ్రామికుల పోరాట సంస్థగా పెంపొందింది.

సునిశిత సిద్ధాంత రాజకీయ పోరాట నిర్వహణలో 'క్రాంతి' పోషిస్తూ వచ్చిన పాత్రని గూర్చి దశాబ్ది సమీక్ష ఏమని చెప్పిందంటే 'భారత విప్లవోద్యమంలో సరైన సిద్ధాంత రాజకీయ పోరాటానికి ఒరవడి దిద్దిన ఆనాటి 'పిలుపు' పత్రిక సంప్రదాయాన్ని ఎమర్జెన్సీ తరువాత 'క్రాంతి'

జయప్రదంగా కొనసాగించింది. క్రాంతిలో ప్రచురితమైన వ్యాసాలు పార్టీ శ్రేణుల్లోను, పీడిత ప్రజానీకంలోనూ మార్క్సిజం-లెనినిజం పట్ల లోతైన అవగాహనను పెంపొందించాయి. విభిన్న ఆంతరంగిక పోరాటాల ద్వారానే పీపుల్స్‌వార్ పార్టీ అభివృద్ధి అయి నేటి స్థితికి చేరుకుంది.... ఆ అభివృద్ధి క్రమంతో క్రాంతి సహజంగానే విడదీయరాని విధంగా పెనవేసుకుపోయింది'. పత్రికపై విరుచుకుపడిన నిర్బంధం, దాన్ని అధిగమిస్తూ క్రాంతి నిలదొక్కుకొచ్చిన తీరు గూర్చి దశాబ్ది సమీక్ష ఏం చెప్పిందంటే 'ప్రజాస్వామిక హక్కులన్నింటినీ కాలరాచి వేసినట్లే పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తూ ఎన్.టి.ఆర్ ప్రభుత్వ పోలీసులు 1985 నవంబర్ 16 రాత్రి దొంగల్లా క్రాంతి కార్యాలయంపై దాడిచేసి విప్లవ సాహిత్యాన్ని, పత్రికా ప్రతులను, పత్రిక రికార్డులను ఎత్తుకుపోయారు. పత్రిక ప్రచురణపై నిఘా పెంచారు. దీనితో క్రాంతి పత్రికను రహస్యంగా నిర్వహిస్తే తప్ప అది నిలవలేని పరిస్థితి ఏర్పడింది. తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో పార్టీ ప్రచార యంత్రాంగాన్ని రహస్యంగా నిర్వహించడం విప్లవోద్యమ క్రమంలో ఒక ఆవశ్యకమైన అవసరంగానే రూపొందుతుంది. నానాటికీ తీవ్రమవుతున్న నేటి ఫాసిస్టు నిర్బంధ పరిస్థితుల్లో పీడిత ప్రజానీకానికీ - పత్రికకూ బలమైన సంబంధాలు ఏర్పడి పత్రిక కొనసాగడానికి ప్రజల సహకారం, అండదండలు ఇంకా ఎంతో అవసరం. ఎంతటి నిర్బంధ పరిస్థితులలో కూడా ప్రజలకు పత్రికను అందించడం ధ్యేయంగా పెట్టుకునే కృషి కొనసాగాలి.

'గ్రామీణ పీడిత రైతాంగంలో విప్లవ చైతన్యాన్ని రగిలించి, పోరాట పథంలో వారిని సంఘటితపరిచి నడిపించాలనే లక్ష్యంతో ఆరంభమైన విప్లవ కృషి తొలి దినాలలో పుట్టింది 'క్రాంతి'! ఆ పోరాట తరంగాలలోనే ఎదిగింది 'క్రాంతి' అంటూ పది సంవత్సరాలపాటు' విప్లవ పోరుబాటలో 'క్రాంతికి ఊపిరీ, ఉత్తేజమూ పీడిత ప్రజల పోరాటాలే! ఈనాటి జనం పోరు రేపటి ఉజ్వల భవిష్యత్తుకు నాంది... పీడిత ప్రజల జీవితాన్నీ, పోరాటాన్నీ, ఆకాంక్షల్నీ ప్రతిబింబించిన 'క్రాంతి' నాడు సాధించిన ఎన్నో విజయాలను రికార్డు చేసింది. దోపిడీ పీడనలను భూస్థాపితం చేయడానికి కొనసాగే మహాప్రస్థానంలో పీడిత ప్రజల పరంపర విజయాల గీతికగా 'క్రాంతి' ఆలాపన మారుమోగాలి. అదే మా ఆకాంక్ష! అదే మా ఆరాటం! - అంతిమ విజయం మనదే' అంటూ అచంచల ఆత్మవిశ్వాసంతో విప్లవదీక్షా సంకల్పాన్ని ప్రకటించింది దశాబ్ది సమీక్ష!

### అజ్ఞాతవాసం

1987 అక్టోబర్ అనంతర కాలంలో, అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ 13వ కాన్ఫరెన్స్ అనంతర కాలంలో 'క్రాంతి' ప్రయాణం గూర్చి చెప్పాల్సి వస్తే దశాబ్ది సమీక్షలో అది ప్రకటించుకున్న ఆత్మ విశ్వాసం, సంకల్పానికి అనుగుణంగానే అది సాగుతూ వచ్చినప్పటికీ సంస్థాపరంగా కొన్ని సమస్యలు, లోపాలు పరిమితులతో అది కొనసాగుతూ వచ్చిందని చెప్పాలి. అయినా పత్రిక అవిచ్ఛిన్నంగా ప్రచురించబడుతూ రావడం అనేది తక్కువ ప్రాధాన్యతగల విషయం కాదని కూడా గుర్తించాలి. 1985లో 'క్రాంతి' కార్యాలయంపై జరిగిన దాడి తరువాత ఇక పత్రికను రహస్యంగా ప్రచురించడం అనివార్యమైందనే విషయం ముందే చెప్పుకున్నాం. ఈ నిర్బంధం మధ్యనే 87 తరువాత మిలిటెంట్ ప్రజాపోరాటాలు బద్దలయ్యాయి. ఈ పోరాటాల సందర్భంగా 'కిడ్నాపింగ్', 'ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం' లాంటి నూతన పోరాటాలు రంగం మీదికి వచ్చాయి. వీటికి 'క్రాంతి' తగిన ప్రాచుర్యాన్ని కల్పిస్తూ ఉద్యమ వ్యాప్తికి దోహదపడింది. ఆ తరువాత జరిగిన అనేక భూపోరాటాలకి 'క్రాంతి' దర్పణంగా పనిచేస్తూ వచ్చింది. 1990లలో చెన్నారెడ్డి హయాంలో పార్టీపై నిషేధం తొలగింపుతోపాటు నిర్బంధం సడలడంతో కొంత తాత్కాలిక వెసులుబాటు పరిస్థితి ఏర్పడింది. వచ్చిన లీగల్ అవకాశాలని సాధ్యమైనంతగా వినియోగించుకోవాలే తప్ప అలా పార్టీ యంత్రాంగాన్ని పత్రికా యంత్రాంగాన్నీ లీగలైజ్ చేయరాదనే పార్టీ నిర్ణయానికనుగుణంగా 'క్రాంతి' అజ్ఞాత పత్రికగానే కొనసాగింది. లీగల్ అవకాశాలను నేర్పుగా ఉపయోగించుకుంటూ పార్టీ నిర్మించిన ప్రజాపోరాటాల, భూపోరాటాల వెల్లువకి 'క్రాంతి' ఒక వేదికగా పని చేసింది.

### 'క్రాంతి' యంత్రాంగం

వ్యాసాల ఎంపిక, తయారీ; పోరాట నివేదికల సంకలనం, సంపాదకత్వం; ఇతర రచనా వ్యాసంగానికి సంబంధించిన బాధ్యతలు నిర్వహించే కామ్రేడ్స్; పత్రిక, ప్రచురణలు ముద్రణకి పోయేముందు టైపింగ్, మేకప్, ప్రూఫ్ రీడింగ్ పనులు నిర్వహిస్తూ ముద్రణకి వీలుగా వాటికి తుది రూపమిచ్చే బాధ్యతలు చూసే కామ్రేడ్స్; పత్రిక ఇతర ప్రచురణల ముద్రణ బాధ్యతలు నిర్వహించే కామ్రేడ్స్; పార్టీ శ్రేణులకి ప్రజలకి పత్రికని, వివిధ ప్రచురణలని సరఫరా చేసే బాధ్యతలు నిర్వహించే కామ్రేడ్స్ - ఇలా వేరు వేరుగా వుంటూనే పరస్పర సమన్వయంతో పని చేసే నాలుగు విభాగాలతో కూడినదిగా 'క్రాంతి' యంత్రాంగం వుంటోంది. పత్రిక ప్రారంభమైన '77 నుండి పార్టీకి చెందిన అనేకమంది కామ్రేడ్స్ 'క్రాంతి', ఇతర ప్రచురణల నిర్వహణలో తమ శ్రమ, ప్రతిభ, శక్తిసామర్థ్యాలు, అంకిత భావంతో అందిస్తూ, 'క్రాంతి' విజయయాత్రలో విడదీయరాని భాగస్వాములవుతూ వచ్చారు, వస్తున్నారు.

పత్రిక, ప్రచురణ యంత్రాంగం, కొన్ని సమస్యలూ, కొన్ని లోపాలతో తీసుకుంటూ నడుస్తూ వస్తోందని ముందొక సందర్భంలో చెప్పుకున్నాం. పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ తన 1995 నాటి రాజకీయ నిర్మాణ సమీక్షలో వీటిని ఈ కింది విధంగా గుర్తించింది. 'పార్టీలో కొనసాగిన వ్యక్తిగత ఫంక్షనింగ్ ప్రభావం ఎ.పి.సి (ఏజిటేషన్ అండ్ ప్రోపగాండా కమిటీ)లోనూ, ప్రెస్ యూనిట్‌లోనూ మరింత కొట్టొచ్చినట్టు ప్రతిబింబించి.... ఈ యూనిట్ల నిర్వహణను చెక్ చేయడంలో రాష్ట్ర కమిటీ ఒక కమిటీగా పెద్దగా పట్టించుకోకపోవడం... ఇవన్నీ ఈ శాఖను నిర్వహించడంలో గతంలో మన లోపాలనీ, వైఫల్యాలనీ చాటిచెబుతున్నాయి. ఈ లోపాల పట్ల రాష్ట్ర కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలి'. ఇలా సమీక్షించుకున్న తరువాత కూడా 'ప్రత్యేక శ్రద్ధ' అనేది అనుకున్నంతగా పెట్టలేదని రాష్ట్ర కమిటీ యొక్క 2001 నాటి రాజకీయ నిర్మాణ సమీక్ష తెలియజేస్తోంది. ఈ సమీక్షలోని సంబంధిత వ్యాఖ్యల్ని చూద్దాం! '1995 సమీక్షలో తీసుకున్న అంశాలు

# 'క్రాంతి'కారుడికి 'క్రాంతి' నివాళి

పత్రికా ప్రచురణ రంగంలో కామ్రేడ్ ప్రకాశ్ మాస్టారు నిర్వహించిన పాత్ర కొంత ప్రత్యేక ప్రశంసకి అర్హమైందనే చెప్పాలి. 'క్రాంతి' ప్రారంభానికి ముందు నడుస్తుండిన 'పిలుపు' పత్రిక నిర్వహణలో సైతం కా. కె.ఎస్‌కి చేదోడువాదోడుగా పనిచేస్తూ వచ్చిన కామ్రేడ్ ప్రకాశ్ మాస్టారు గట్టి పునాదిపై క్రాంతి పత్రికను స్థాపించే విషయంలోనూ, అచిర కాలంలోనే అది పార్టీ శ్రేణుల్లోకి ప్రజల్లోకి దూసుకుపోయే విధంగా దాన్ని తీర్చిదిద్దడంలోనూ కీలకమైన పాత్రనే పోషించారు. 'క్రాంతి' నిర్వహణా బాధ్యతలతో ప్రత్యక్ష సంబంధం లేని కాలంలో కూడా 'క్రాంతి', 'క్రాంతి' ప్రచురణల విషయంలో కామ్రేడ్ ప్రకాశ్ మాస్టారి పాత్ర ప్రభావాలు ప్రశంసనీయమైనవిగా వుంటూ వచ్చాయని చెప్పాలి (సుమారు '80-88' మధ్యకాలం). '88 నుంచి తిరిగి 'క్రాంతి' నిర్వహణ ప్రధాన బాధ్యత కామ్రేడ్ ప్రకాశ్ మాస్టారే చేపట్టారు. 1991లో పార్టీలో తలెత్తిన రెండవ ఆంతరంగిక సంక్షోభం, కొన్ని మాసాలపాటే అయినా, ప్రెస్ యూనిట్‌పైనా, 'క్రాంతి' నిర్వహణపైనా తన దుష్ప్రభావాన్ని వేసి గందరగోళ పరచిందనే చెప్పాలి. ఆ సమయంలో పార్టీతో సంబంధాలు తెగిపోయి వుండిన ఆ యూనిట్‌తో తిరిగి సంబంధాలు పునరుద్ధరించుకున్న కామ్రేడ్ ప్రకాశ్ మాస్టారు సంక్షోభ దుష్ప్రభావం నుంచి ఆ కామ్రేడ్స్‌ని పూర్తిగా బైటపడవేసి, వారి నైతిక ధృతిని నిలబెట్టి, వారిలో రెట్టించిన ఉత్సాహ, ఉత్తేజాలని కల్పించడంలో కీలకపాత్ర నిర్వహించారు. సమాచార సాంకేతిక రంగాలలో వస్తుండిన అభివృద్ధిని, దాని ప్రాముఖ్యతని ఆకళింపు చేసుకుంటూ, మన అవసరాలకి తగ్గట్టుగా దాన్ని వినియోగించుకునే ప్రణాళికలు రూపొందిస్తూ, తదనుగుణంగా సంబంధిత కామ్రేడ్స్‌ని తర్ఫీదు చేయడంలో కూడా కా. ప్రకాశ్ మాస్టారు ప్రశంసనీయమైన కృషి చేసారు. సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల కొరత కారణంగా శ్రమ, కాలం వెచ్చిస్తున్నా, మందకొడిగానే నడుస్తుండిన ప్రెస్ పనిలో చురుకుదనాన్ని తీసుకొచ్చి దానికి నూతన జవసత్వాలందించిన కృషి కా. ప్రకాశ్ మాస్టారిదే! తీవ్ర నిర్బంధం ఒకపక్క, తీవ్ర అనారోగ్యం మరోపక్క - అయినా అనుకున్నదే తడవుగా అతి తక్కువ వ్యవధిలో అఖిల భారత స్పెషల్ కాన్ఫరెన్స్‌కి సంబంధించిన (1995) స్పెషల్ బులెటిన్‌ని ఇంగ్లీషు, తెలుగుల్లో ఏకకాలంలోనే ప్రచురించి పంపిణీ చేయించడంలోనూ; 'దండకారణ్య అమరవీరుల జీవిత చరిత్రలు' అలానే 'జాతుల సమస్య' అనే ప్రచురణలను ఇంగ్లీషు, తెలుగుల్లో ప్రచురించి అందించడంలో ప్రకాశ్ మాస్టారు కనబరిచిన శ్రద్ధాశక్తులు, బాధ్యతాయుత వైఖరి, నిర్వహించిన ప్రత్యక్ష పాత్ర అనేవి శ్లాఘనీయం! పార్టీ పంథా, కార్యక్రమాలు; పార్టీ విధాన నిర్ణయాలు, పార్టీ ఆధ్వర్యంలోని విప్లవోద్యమ క్రమాభివృద్ధి - వీటన్నింటికి 'క్రాంతి'ని ఒక నిలువుటద్దంగా తీర్చిదిద్దడంలో కా. ప్రకాశ్ మాస్టారు పోషించిన పాత్ర ఎంతో ప్రశంసనీయమైనదనే చెప్పాలి. దారుణ నిర్బంధం మధ్య అజ్ఞాతంలో వుంటూ, ప్రాణాంతక కేన్సర్ వ్యాధి బారిన పడి మరణశయ్యపై వుంటూ కూడా తన తుదిశ్వాస వరకూ 'క్రాంతి'కి శ్వాసగా పని చేస్తూ తన శ్వాసని 'క్రాంతి'కి అర్పణ చేసిన కా. ప్రకాశ్ మాస్టారు అమరస్మృతికి, 30 సంవత్సరాలు నిండిన 'క్రాంతి' తన అక్షర నివాళినర్పిస్తోంది.



ఏవీ ఈ మధ్య కాలంలో అమలు కాలేదు.... ఈ విషయాలను సీరియస్‌గా తీసుకుని మన కమిటీలు పని చేస్తే పత్రికలపై అభిప్రాయాలు పంపడంగానీ, పంపిణీ పరిస్థితిని చక్కదిద్దుకోవడంగానీ సాధ్యపడేది'. 'పత్రికకు రిపోర్టులు పంపడం, ఈ మధ్య కాలంలో మనం సాధించిన అభివృద్ధి. ఇది మంచి పరిణామమే! అయితే రిపోర్టులలోని విషయాలలో సమగ్రత వుండటం లేదు.... ఆయా రీజియన్‌లలోని ఉద్యమాభివృద్ధిని, ఆటుపోట్లనూ మరింత నిర్దిష్టంగా, సమగ్రంగా రాయడంలో ఇంకా పరిణతి సాధించాల్సి వుంది'. 'ఈ మధ్యకాలంలో ఏడు రాజకీయ ప్రచార బుక్‌లెట్లు, నాలుగు కాన్ఫరెన్సుల కవితా సంపుటాలు, మూడు ఇతర పుస్తకాలు ప్రచురించాం. 1995 కాన్ఫరెన్స్‌ల సందర్భంగా వెలువడిన 25 వివిధ రకాల డాక్యుమెంట్లను, పుస్తకాలను తెచ్చాం!.... నిజానికి ఈ ప్రచురణలు మన రాజకీయ అవసరాలను ఏమాత్రం తీర్చలేవు. రాసేవారి కొరత, అనువాదాల సమస్య మనం ఎదుర్కొంటున్నాం'. 'పత్రిక, ప్రచురణల డబ్బులు ప్రజల నుండి మనం వసూలు చేస్తున్నట్టు ఎక్కడా రిపోర్టులు వుండటం లేదు'. 'ఈ మధ్య కాలంలో క్రాంతిని మనం రెగ్యులర్‌గా తేగలిగాం. పత్రిక పేజీలు పెంచి అనేక రాజకీయ, ఆర్థిక వ్యాసాలు, సిద్ధాంత రాజకీయ చర్చా వ్యాసాలు అందించగలిగాం'. 'రాష్ట్ర, రీజినల్ కమిటీ సభ్యులు నిర్దిష్ట సమస్యలపైనా, ఉద్యమ రాజకీయ కర్తవ్యాలపైనా, సిద్ధాంత రాజకీయ చర్చా వ్యాసాలను క్రాంతికి పంపాలి'.

### ప్రచురణలు

పత్రిక ప్రారంభకాలం నుంచే అనేక విప్లవ సిద్ధాంత రాజకీయ గ్రంథాలను, ఉద్యమ సాహితీ సాంస్కృతిక గ్రంథాలను 'క్రాంతి ప్రచురణలు'గా తీసుకొస్తుండేవాళ్లం! అయితే 'క్రాంతి' యంత్రాంగంపై ప్రారంభం నుండి సాగుతూ వచ్చిన నిఘా, నిర్బంధాల కారణంగాను, ప్రత్యేకించి '85 తరువాత 'క్రాంతి'ని అజ్ఞాత పత్రికగానే నడపాల్సి వచ్చిన పరిస్థితుల్లోనూ 'క్రాంతి ప్రచురణల' వరుస క్రమాన్ని పాటించడంగానీ, పాటించిన మేరకు ప్రచురణల సంఖ్యను నిర్దిష్టంగా తేల్చడంగానీ సుమారుగా అసాధ్యమైపోయిన పరిస్థితి నెలకొంది. అసమగ్రంగా అందుబాటులో వున్న సమాచారం మేరకే 1977 నుండి సంవత్సరానికి

సగటున పదికి తక్కువకాకుండానే క్రాంతి ప్రచురణలు వెలువడుతుండేవని చెప్పవచ్చు. 1979 నాటికి 29గా వుండిన క్రాంతి ప్రచురణల సంఖ్య '83 నాటికి 60గాను, '84 నాటికి 70గాను, '85 నాటికి 77 గాను తేలాయి. '85 నుండి ప్రచురణ సంఖ్యలేని అనేక పుస్తకాలు విడుదల అయ్యాయి.

పార్టీ మౌలిక పంథాకి సంబంధించి - 'వ్యవసాయిక విప్లవం భారత ఆర్థిక వ్యవస్థ-అర్ధవలస అర్ధభూస్వామ్య విధానం', చారుమజుందార్ రచనలు' 'చారుమజుందార్‌పై విచ్ఛిన్నకుల విమర్శ-ఒక మార్క్సిస్టు లెనినిస్టు విశ్లేషణ' అనేవి ముఖ్యమైన ప్రచురణలు. మార్క్సిస్టు సిద్ధాంత రాజకీయ ప్రామాణిక గ్రంథాల విషయానికి వస్తే 'అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమం-ప్రపంచ సోషలిస్టు విప్లవ పథం', 'తత్వశాస్త్రం మాయాజాలం కాదు', 'చైనా తాత్వికరంగాన మూడు ప్రధాన పోరాటాలు', 'సోవియట్ ఆర్థికం-విమర్శనాత్మక పరిశీలన', 'గోథా కార్యక్రమం', 'లుడ్విగ్ ఫ్యూయర్‌బా', 'ఏం చేయాలి?' 'ప్రతిపక్షం' అనేవి ముఖ్యమైన ప్రచురణలు. సోవియట్ రివిజనిజాన్ని ఎండగడుతూ - 'పెరిస్త్రోయికా, గ్లాస్‌నాస్థ్ అంటే కృశ్చేవ్ యొక్క మూడు శాంతి సూత్రాల చరమదశే', 'నూతన జారుల పరిపాలనలో సోవియట్ రష్యా', 'నిరంకుశ రివిజనిస్టు పాలనకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున చెలరేగుతున్న తూర్పు యూరప్ ప్రజా ఉద్యమాలు', 'సోవియట్‌లో పెట్టుబడిదారీ పునరుద్ధరణ' అనేవి ముఖ్య ప్రచురణలుగా వచ్చాయి. కళాసాహిత్య రంగాలకి సంబంధించి - 'కళలు, సారస్వతం ఎవరికోసం?', 'నాట్యాలు-నాట్య రూపాలు' (జె.ఎన్.ఎం), 'జె.ఎన్.ఎం. పాటలు', 'పంట' (చైనా కథలు), 'లాంగ్ మార్చ్ కథలు', 'ఎర్రమందారాలు' (చైనా నవల), ముఖ్యమైన ప్రచురణలు. అలానే చరిత్రకు సంబంధించి - 'ఆధునిక ప్రపంచ చరిత్ర', 'బోల్షివిక్ పార్టీ చరిత్ర'; దేశంలో జాతుల పోరాటాలపై 'కేంద్ర, రాష్ట్ర అసమ సంబంధాల సమస్య జాతుల సమస్యలో అంతర్భాగమే', 'కాశ్మీర్ సమస్య-బొమ్మా, బొరుసూ', 'రగులుకొనే రాక్షసి బొగ్గు'; విప్లవోద్యమంపైని ఉద్యమంపైని దమనకాండలని వివరించే 'మునుముందుకు సాగుతున్న రైతాంగ పోరాటాలు - చుట్టుముడుతున్న ప్రభుత్వ దమనకాండ'; దేశంలోని అవకాశవాద రివిజనిస్టు పంథాలను ఎండగడుతూ వచ్చిన 'పాలకవర్గాల పాదసేవలో పైలా ముఠా ప్రజాపంథా', 'విమోచన దివాళాకోరుతనం'; పార్టీ ఉద్యమాలలోని అతివాద ఒంటెత్తు పెడధోరణిని విమర్శిస్తూ వచ్చిన 'ప్రజాపోరాటాలకి మద్దతునివ్వనివారు పీడిత ప్రజలకు మిత్రులు కాజాలరు' అనేవి ముఖ్యమైన క్రాంతి ప్రచురణలు. అలానే 'మహిళా ఉద్యమం' (లెనిన్), 'అమరవీరుల జీవిత చరిత్రలు - 1,2,3, భాగాలు' అనేవి మరికొన్ని ముఖ్యమైన క్రాంతి ప్రచురణలు.

## మా-లె-మా బావుటాని ఎత్తిపడుతూ!

ఇవన్నీ ఒకెత్తుకాగా, మావో రచనలన్నింటినీ ఇంగ్లీషు, తెలుగుల్లో ప్రచురించే బృహత్తర కర్తవ్యాన్ని 'క్రాంతి' విజయవంతంగా నెరవేర్చడమనేది గొప్ప విషయంగా చెప్పాలి. విశేష ప్రాముఖ్యతని సంతరించుకున్న గొప్ప కృషి ఇది అనవచ్చు. ఇంగ్లీషులో అన్ని సంపుటాలు ఇప్పటికే వెలువడగా, తెలుగు అనువాదాలు 8 సంపుటాలు విడుదల అయ్యాయి. 9వ సంపుటి అనువాదం పూర్తయి అచ్చులో వుంది. 'క్రాంతి' 25వ వార్షికోత్సవంలో అడుగిడుతున్న సందర్భంగా అది విడుదల కాబోవడమనేది ఒక విశేషంగానే వుండగలదు.''

25వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా 'క్రాంతి' తన ప్రయాణం గురించి చెప్పుకున్న విషయం ఇది. ఈ సందర్భంగా 'క్రాంతి'లో వస్తున్న వ్యాసాల గురించి ఇలా సమీక్షించుకుంది.

"ఈ విషయానికి సంబంధించినంత వరకు, నూటికి నూరుపాళ్లు తాను సవ్యంగానే వున్నాననే స్వోత్కర్షకు, అతిశయానికి 'క్రాంతి' ఎన్నడూ గురి కాలేదు. గురి కాదు కూడా. 'ప్రజలకు, లేదా పాఠకులకు నేర్పాలంటే వార్తా పత్రిక సిబ్బంది ముందుగా తాము ప్రజల నుండి నేర్చుకోవాలి' అనే మావో సూక్తి క్రాంతికి ఎప్పటికీ మార్గదర్శకమే. వ్యాసాలను నిర్దిష్టంగానూ, స్పష్టంగానూ జీవం వుట్టిపడే విధంగానూ రాయటం, రాయటానికి ప్రయత్నించటం 'క్రాంతి' కర్తవ్యం, బాధ్యత కూడా. ఈ విషయంలో, మూడో ఇంటర్నేషనల్ తరపున కా. డిమిట్రావ్ కాని, పలు సందర్భాల్లో కా. మావో కాని పత్రికా రచన, శైలి, వస్తువుకి సంబంధించి పేర్కొన్న పలు అంశాలను, సూచనలను 'క్రాంతి' పూరించుకోవాల్సిందీ, పట్టించుకుని మెరుగుపర్చుకోవాల్సిందీ చాలానే వుంది. పత్రికను సాపు చేయటంలో, నిర్దిష్ట కాల వ్యవధిలో, (అంటే రెండు నెలల కొకసారైనా) రచనలు పూర్తి చేసి ప్రచురించటంలో జరుగుతున్న లోపాలకు, ఒక సుదీర్ఘమైన, తీవ్రమైన నిర్బంధపు అడ్డంకులనే సాకులుగా చూపించి తప్పుకునే యోచన 'క్రాంతి'కి లేదు. స్పష్టంగానే తన లోపాలపట్ల, సవరించుకోవాల్సిన, మెరుగు పర్చుకోవాల్సిన అంశాల పట్ల తనదైన అంతర్మధనం 'క్రాంతి'కి వుంది. నిర్దిష్టత, స్పష్టత, సజీవతలను రచనలలో పాటించటం, అర్థవంతమైన సులువైన రచనా శైలిని పెంపొందించుకోవటం, రాతలో ప్రజాపంథాను అమలుపర్చడం వంటి పలు అంశాలలో దొర్లుతున్న లోపాలను 'క్రాంతి' గుర్తించటమేగాక, ఆ లోపాలను చిత్తశుద్ధితో సవరించుకోవాలని భావిస్తోంది.''

ఇలా 25 సంవత్సరాల సందర్భంగా తన గతాన్ని సమీక్షించుకొని నూతనోత్సాహంతో ముందుకు సాగాల్సిన 'క్రాంతి' ప్రయాణం ఈ అయిదేళ్లలో మరిన్ని ఒడిదుడుకులతోనే సాగింది. ఈ అయిదేళ్లలో తీవ్ర నిర్బంధకాండ మూలంగా ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం ఎదుర్కొన్న ఒడిదుడుకుల ప్రభావం 'క్రాంతి' పైనా పడింది. 2002లో 'క్రాంతి' యంత్రాంగంలోని కొందరు వ్యక్తులు శత్రువుకు లొంగిపోవడం వల్ల 2002 నుండీ 2003 వరకూ 'క్రాంతి' ఆగిపోయింది. 2003లో 'క్రాంతి'ని పునరుద్ధరించడం కొరకు పార్టీ కొన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అవి ఫలించలేదు. ఆ తర్వాత 2004లో ఆంధ్రప్రదేశ్‌లో చర్చల ప్రక్రియ మొదలైన తర్వాత, ఆ వెసులుబాటు కాలంలో 2004 జూలైలో అమరవీరుల ప్రత్యేక సంచికగా 'క్రాంతి' పునఃప్రారంభమై 2005 ఫిబ్రవరి వరకూ కొనసాగింది. అయితే 'క్రాంతి' బాధ్యతలు నిర్వహిస్తోన్న కామ్రేడ్ అరెస్టు కావడంతో పత్రిక మళ్లీ ఆగిపోయింది. ఆ తర్వాత 2006 నుంచి 'క్రాంతి' తిరిగి ప్రచురితమవుతోంది.

## 'ప్రజావిముక్తి'నీ 'విముక్తి పథం'నూ సంలీనం చేసుకున్న 'క్రాంతి'

1995లో ఉత్తర తెలంగాణా ప్రాంతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ నుండి విడిపోయి ప్రత్యేక జోన్‌గా ఏర్పడ్డ తర్వాత, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ తన అధికార పత్రికగా 'ప్రజావిముక్తి'ని ప్రచురించింది.

1996లో ప్రారంభమైన 'ప్రజావిముక్తి' 2005 వరకూ నడిచింది. తీవ్ర నిర్బంధం నడుమనే కండ్లు తెరిచిన 'ప్రజావిముక్తి' ఆ నిర్బంధం నడుమనే అనేక కష్టాలూ నష్టాలను ఎదుర్కొంటూనే పదేళ్లపాటు కొనసాగింది. ఆనాటి ఉద్యమానికవసరమైన రాజకీయ, సైద్ధాంతిక వ్యాసాలను ప్రచురిస్తూ క్యాడర్‌కూ, ప్రజలకూ కరదీపిక అయింది. విప్లవోద్యమాన్ని అణచడంలో భాగంగా ప్రభుత్వం ప్రయోగిస్తున్న నిర్బంధాన్ని, విప్లవోద్యమాన్ని బలహీనపర్చడానికి అది తెచ్చిన పథకాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతులను చేసింది. విప్లవోద్యమ ప్రతిఘటననూ, ప్రజాపోరాటాలనూ, అమరుల చరిత్రలను ప్రచురించి పాఠకులను ఉత్తేజితులను చేసింది.

'ప్రజావిముక్తి' కృషిలో విశేషంగా చెప్పుకోవాల్సినది - అనేక మంది అమరుల చరిత్రలను అది పలు సంపుటాలుగా నిక్షిప్తం చేసింది.

2000 ఆఖరులో 'ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ప్రాంతం' ఒక ప్రత్యేక జోన్‌గా ఏర్పడిన తర్వాత ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు ప్రాంత కమిటీ తన అధికార పత్రికగా 'విముక్తి పథం'ను ప్రచురించాలని నిర్ణయించుకుంది. అందుకు తగిన సంపాదకవర్గాన్ని ఏర్పర్చుకున్నప్పటికీ ప్రచురణా విభాగాన్ని ఏర్పర్చుకోలేని కారణంగా 'విముక్తిపథం' ప్రచురణలో ప్రారంభం నుండీ అనేక అవాంతరాలు ఏర్పడ్డాయి. ఈ అవాంతరాల నడుమ 'విముక్తిపథం' రెండు, మూడు సంచికలుగా మాత్రమే వెలువడింది.

ఈ విధంగా 2005 నాటికి 'క్రాంతి', 'ప్రజావిముక్తి', 'విముక్తిపథం' పత్రికలు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిలో మూడు పత్రికలను విడివిడిగా నడపడం కష్టమని భావించిన పార్టీ 'క్రాంతి'నే మూడు జోన్ల అధికార పత్రికగా వెలువరించాలని నిర్ణయించింది. మూడు జోన్లకు నడుమ వున్న అనేక సారూప్యతల వల్ల కూడా 'క్రాంతి' మూడు జోన్ల పత్రికగా న్యాయం చేయగలదని పార్టీ భావించింది.

## మూడు జోన్ల అధికార పత్రికగా 'క్రాంతి'

పార్టీ నిర్ణయం మేరకు 2006 జనవరి-ఫిబ్రవరి సంచికతో పునః ప్రారంభమయిన 'క్రాంతి' మూడు జోన్ల అధికార పత్రికగా ప్రస్తుతం వెలువడుతోంది. అయితే తీవ్ర నిర్బంధం మూలంగా 'క్రాంతి' ఇప్పటికీ విషయసేకరణ, ప్రచురణ, పంపిణీలలో తీవ్ర సమస్యను ఎదుర్కొంటూనే వుంది. దీని మూలంగా పత్రిక కొంత ఆలస్యంగా వెలువడుతోంది.

ఈ సమస్యలేకాక సారంలో మరింత మెరుగుదల సాధించవల్సిన అవసరం 'క్రాంతి' ముందుంది. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలలో చెలరేగుతున్న అనేక పోరాటాలనూ, అలాగే ఈ పోరాటాలను పక్కదారి పట్టించడానికి ప్రపంచబ్యాంకు కనుసన్నలలో ప్రభుత్వాలు అమలుచేస్తోన్న పథకాలను మరింత ఎక్కువగా, విశ్లేషణాత్మకంగా పత్రిక చర్చించవల్సిన అవసరం వుంది. అదే సమయంలో ఇతర రాష్ట్రాల, దేశాల సమస్యలూ, పోరాటాలను విశ్లేషిస్తూ వ్యాసాలను అందించవల్సి వుంది. ఈ సమస్యలన్నింటినీ 'క్రాంతి' అధిగమించవల్సి వుంది.

గత 30 యేళ్లుగా నిర్బంధం, నిషేధాల వంటి బాహిర సమస్యలను ఎన్నింటినో ఎదుర్కుంటున్నప్పటికీ, సంక్షోభాలు, లొంగుబాట్లు వంటి అంతర్గత సమస్యలనూ ఎదుర్కున్నప్పటికీ 'క్రాంతి' దృఢ దీక్ష ఏమాత్రం సడలలేదు. ముప్పయ్యేళ్లకు పూర్వం ఏ కర్తవ్య సాధనకు తన పయనాన్ని మొదలుపెట్టిందో, ఆ కర్తవ్య సాధనకు ఎటువంటి శషభిషలు లేకుండ నేటికీ కట్టుబడి వుంది. సామ్రాజ్యవాదానికి భారత పాలకవర్గాలు రోజు రోజుకూ మరింతగా దాసోహం అంటోన్న నేటి పరిస్థితుల్లో, నయావలస తరహా దోపిడీ దేశంలో రాజ్యమేలుతోంది. ఆ దోపిడీ కింద నలిగిపోతూ, ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు తప్పనిసరై పోరుబాట పడుతున్నారు. ఇటువంటి పరిస్థితిలో మరింత శక్తివంతమై, విప్లవ ప్రజల, పార్టీ శ్రేణుల చేతిలో రాజకీయ, సైద్ధాంతిక ఆయుధంగా మరింతగా పదునెక్కవల్సిన కర్తవ్యం 'క్రాంతి' ముందుంది. ఈ చారిత్రక కర్తవ్యాన్ని తప్పక నెరవేర్చుతానని 30 సంవత్సరాల 'క్రాంతి' శపథం చేస్తోంది. ★

---

*(....39వ పేజీ తరువాయి)*

దెబ్బ తగిలింది. దెబ్బ చాలా తీవ్రంగా వుండడంతో నడవడం కష్టమైంది. ఆ తర్వాత కా. రాజన్న తాను పోలీసులకు లొంగిపోననీ వేరే చోటకుపోయి బతుకుతాననీ, కాలు బాగయితే మళ్లీ పార్టీలోకి వస్తానని ప్రతిపాదన పెట్టాడు. ఈ ప్రతిపాదనకు ఆమోదించిన దళం కొంత ఆర్థిక సహాయం చేయడంతో ముంబయికి వెళ్లి కాలు బాగుచేయించుకుంటూనే జీవనోపాధికోసం కూలి పనులు చేస్తూ వచ్చాడు. ముంబయిలో కా. రాజన్న వుంటున్న విషయం కా. రాజన్న కుటుంబ సభ్యుల నుండి గ్రామ ఇన్‌ఫార్మర్ మోసపూరితంగా రాబట్టి పోలీసులకు సమాచారం చేర వేశాడు. దానితో ఎల్లారెడ్డిపేట పోలీసులు కా. రాజన్నను ముంబయి నుంచి తీసుకొచ్చి చిత్రహింసలతో అతి కిరాతకంగా 2006లో హతమార్చి ఎన్‌కౌంటర్ కట్టు కథను అల్లారు. ★

**"పార్టీ పత్రిక సమిష్టి ప్రచారం, సమిష్టి ఆందోళనతోనే సంతృప్తి పడకుండా సమిష్టి ఆర్గనైజర్‌గా కూడా అది పని చేస్తుంది"**

**- లెనిన్**

# 3వ మహాసభను విజయవంతం చేసుకున్న ఉత్తర తెలంగాణ ఉద్యమానికి విప్లవ జేజేలు

ఒక సురక్షిత ప్రాంతంలో అమరులు కామ్రేడ్స్ కరంసింగ్, బాలక్రిష్ణ ప్రసాద్‌ల కమ్యూన్ సుందరంగా అడవిలో నిర్మించబడింది. అక్కడికి ముందుగానే చేరిన పి.ఎల్.జి.ఎ సభ్యులు, ప్రతినిధులంతా మహాసభ సన్నాహాలలో చురుకుగా పాల్గొన్నారు. అమరుల కమ్యూన్ మధ్యలో ఎ.పి అమరుల మిలటరీ గ్రౌండ్‌లో కామ్రేడ్స్ సోమన్న, పద్మ, రామక్రిష్ణ, సుధాకర్, యాదన్నల కాన్ఫరెన్స్ హాల్ నిర్మించబడింది. ఆ కమ్యూన్‌లో నిర్మించబడిన అనేక హాల్స్‌కు, ప్లాటూన్స్‌కు, కిచెన్, మెడికల్ హాల్‌కు విప్లవోద్యమ కర్తవ్య నిర్వహణలో అసువులు బాసిన అమరుల పేర్లు పెట్టడం జరిగింది.

ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 27 రోజులు జరిగిన ఎన్.టి పార్టీ మహాసభను విజయవంతం చేయడానికి శత్రువుకు ఎలాంటి సమాచారం అందకుండా వీర ప్రజానీకం జాగ్రత్తలు తీసుకున్నారు. విస్తృతమైన ప్రజల మద్దతు, స్థానిక మిలీషియా అండదండలు లేకుండా ఇది సాధ్యమయ్యేది కాదు.

కమ్యూన్ అంతా పోస్టర్లు, ఎర్ర బ్యానర్లు, ఎర్రెర్రని తోరణాలతో నిండిపోయింది. ఆ పచ్చటి అడవిలో మిలటరీ గ్రౌండ్‌లో అందంగా నిర్మించిన అమరుల స్థూపం. ముంగిట పర్చుకున్న అమరుల గత స్మృతులు వర్తమానంలో నిలువెత్తు ఎర్రని స్థూపమై, సుత్తీ కొడవలితో దర్శనమిచ్చాయి. ఉదయం 8 గంటలకు ఎ.పి అమరుల మిలటరీ గ్రౌండ్ నుండి హోరెత్తిన నినాదాలతో విప్లవ గీతాలతో, ప్లకార్డులతో, బ్యానర్లతో కమ్యూన్ అంతా ఊరేగింపు సాగింది.

ఎన్.టి పార్టీ 3వ మహాసభను ప్రారంభిస్తూ ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి కా. జంపన్న ఎర్రజెండాను ఆవిష్కరించగా, కమ్యూన్‌లో మొత్తం పి.ఎల్.జి.ఎ సాంస్కృతిక కళాకారులు, ప్రతినిధులు ఫార్మేషన్లలో నిలబడ్డారు. అందరూ అంతర్జాతీయ గీతాన్ని ఆలపించారు.

ఈ భూమండలంపై కమ్యూనిజం స్థాపన కోసం, దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం ప్రాణాలర్పించిన అమరుల స్థూపాన్ని కా. పున్నం ఆవిష్కరించాడు. ఆ తర్వాత అమరులను స్మరిస్తూ స్థూపం ముందు సావధాన్‌లో నిలిచిన కామ్రేడ్స్ రెండు నిముషాలు మౌనం పాటించారు. సాంస్కృతిక కళాకారుల పాటలతో పేరు పేరునా అమరుల నినాదాలతో ఆ కమ్యూన్ అంతా మారుమోగింది. అనంతరం ప్రతినిధులంతా ఉత్తర తెలంగాణ అమరుల ద్వారం గుండా కామ్రేడ్స్ సోమన్న, పద్మ, రామక్రిష్ణ, సుధాకర్, యాదన్నల కాన్ఫరెన్స్ హాల్‌లోకి ప్రవేశించారు. ప్రతినిధులంతా హాల్‌లో తమ తమ స్థానాలలో కూర్చోగా కా. చంద్రన్న వేదిక పైకి వచ్చి ప్రతినిధులకు ఆహ్వానం పలికాడు. తరువాత పేరు పేరునా ప్రతినిధులను వేదిక మీదికి ఆహ్వానించి కామ్రేడ్స్ జంపన్న, చంద్రన్నలు వారికి బ్యాడ్జిలను అలంకరించారు. ఎస్.జడ్.సి కార్యదర్శి మహాసభను సజావుగా నడిపించడానికిగానూ ముగ్గురితో కూడిన అధ్యక్షవర్గాన్ని ప్రతిపాదించగా, హాల్ ఎన్నుకొన్నది. స్టీరింగ్ కమిటీగా ఎస్.జడ్.సి వ్యవహరించింది. ఆ తర్వాత భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం అసువులు బాసిన సమస్త అమరులకు లాల్‌సలామ్ తెలుపుతూ ఒక తీర్మానం, జైలు కామ్రేడ్ల గురించి మరో తీర్మానాన్ని కాన్ఫరెన్స్ ఆమోదించటం జరిగింది.

కేంద్ర కమిటీ తరపున ఎన్.టి పార్టీ 3వ మహాసభకు వచ్చిన సి.సి సభ్యుడు, సి.సి సందేశాన్ని వినిపించారు. అందులో ఆయన అంతర్జాతీయ దేశీయ రాజకీయ పరిస్థితిని తెలియజేశాడు. తాత్కాలిక సెట్‌బ్యాక్‌కు గురైన ఎన్.టి ఉద్యమాన్ని నిలబెట్టడానికి కృషి చేయాలని ప్రతినిధులను కోరాడు. రాజకీయ నిర్మాణ సమీక్షను లోతుగా చర్చించి మన ఆచరణలోగల బలహీనతలను లోపాలను గుర్తించిన పిదప తగిన నిర్ణయాలు తీసుకోవాల్సిందిగా ప్రతినిధులను కోరాడు.

ఆ తర్వాత మహాసభలో గడిచిన ఆరున్నర సంవత్సరాల ఉత్తర తెలంగాణా ఉద్యమ, రాజకీయ, నిర్మాణ సమీక్షను సంక్షిప్తంగా కార్యదర్శి జంపన్న హాల్‌లో ప్రవేశపెట్టాడు. పార్టీ గత ఆచరణకు సంబంధించిన సమీక్షపై మహాసభ దృష్టిని సారించింది. విస్తృత చర్చలు, సవరణలతో ఎన్.టి రాజకీయ నిర్మాణ సమీక్షను బలోపేతం చేస్తూ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది.

మహాసభ ఎజెండా ఆఖరులో సి.సి ప్రతినిధులూ, ఎస్.జడ్.సి సభ్యులూ తమ స్వయం విమర్శలను హాల్‌లో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ప్రతినిధుల నుండి విమర్శలను ఆహ్వానించారు. అనంతరం నూతన ఎస్.జడ్.సి ఎన్నికైంది. కామ్రేడ్ చంద్రన్న ఈ కమిటీకి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. మరో సి.సి.ఎం మహాసభను ముగిస్తూ ఉపన్యసించాడు. చివరిగా ప్రతినిధులందరూ విప్లవానికి, నవసమాజమైన కమ్యూనిజానికి అంకితమవుతామని ఉమ్మడిగా ప్రతిజ్ఞ చేసారు.

ఈ మహాసభ "ఫాసిస్టు వై.ఎస్.ఆర్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంక్ ఆదేశిత విధానాలకు వ్యతిరేకంగా విశాల ప్రజారాశులను ఐక్యం చేసి ఉద్యమిద్దాం. భూమి, స్వావలంబన, ప్రజాస్వామ్యం కోసం పోరాడుదాం'' అని తన కేంద్ర రాజకీయ నినాదాన్ని రూపొందించుకొంది.

"దెబ్బతింటున్న ప్రజా పునాదిని తిరిగి అభివృద్ధి చేసుకుందాం. శత్రువు బహుముఖ దాడిని శక్తి మేరకు ప్రతిఘటిస్తు, స్వీయాత్మక శక్తులను రక్షించుకుందాం. ఎన్.టి నిర్దిష్ట పరిస్థితులకు తగిన విధంగా గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేద్దాం. ఎన్.టిని విముక్తి ప్రాంతంగా నిర్మించే లక్ష్యంతో పని చేద్దాం'' అనే కేంద్ర కర్తవ్యాన్ని చేపట్టింది. మరికొన్ని తక్షణ కర్తవ్యాలనూ చేపట్టింది.

*(మిగతాది ...29వ పేజీలో.....)*

# కాంగ్రెస్, టి.డి.పి, బి.జె.పి తదితర పాలక, ప్రతిపక్ష పార్టీల వైఖరిని ఎండగట్టి, సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలి!

రాష్ట్రంలో కాంగ్రెస్ మూడేళ్ల పాలన సందర్భంగా పునరంకిత సభను ఆర్భాటంగా నిర్వహించింది. ప్రతిపక్షంగా మారిన మూడేళ్లలో తెలుగుదేశం పార్టీ గత రెండు మహానాడు సభల కంటే ఈసారి అట్టహాసంగా నిర్వహించింది. ఇక బి.జె.పి కూడా తన శక్తుల్ని కూడదీసుకోవడానికి రాష్ట్ర మహాసభల్ని గుంటూరులో కోలాహలంగానే నిర్వహించింది. ఈ ఆర్భాటాలూ, అట్టహాసాలూ మరో రెండేళ్లల్లో రానున్న శాసనసభ ఎన్నికలూ, ఇంకా ముందుగానే వచ్చే అవకాశమున్న మధ్యంతర ఎన్నికల కోసమేననేది స్పష్టమే. టి.ఆర్.ఎస్, వామపక్షాలూ తదితర పార్టీల ఎన్నికల ప్రయత్నాలు కూడా ఊపందుకుంటున్నాయి. ఓట్లేసి గెలిపించిన ప్రజల నోట్లో మట్టికొట్టి, అందిన కాడికి దండుకోవడానికి ఈ మూడేళ్ళు రాజకీయ వ్యాపారం సాగించి, ఇకిప్పుడు ప్రజల సమస్యల గురించి ఎన్నికల నాటకాలు మొదలుపెట్టారు. వాస్తవానికి ఈ మూడేళ్లలో అధికార, ప్రతిపక్ష తదితర పాలకవర్గ పార్టీలు ప్రజలపట్ల అవలంభిస్తున్న వైఖరీ, ఈ రోజున ప్రజల సమస్యల గురించి చేస్తున్న ఆర్భాటం వెనక వున్న ఉద్దేశాలు పరిశీలించ వలసిన అవసరం వుంది.

అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్ళలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రకరకాల పథకాలతో ప్రజల్ని ఉద్ధరిస్తామంటూ భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తున్నది. ఆచరణలో ఇవి ఎవరికి ఉపయోగపడుతున్నాయో పరిశీలిస్తే వీటి ఉద్దేశమేమిటనేది స్పష్టమవుతుంది.

52 భారీ మధ్య తరహా ప్రాజెక్టుల ద్వారా లక్ష కోట్ల రూపాయలతో కోటి ఎకరాలకు సాగునీరందిస్తామని చేపట్టిన 'జలయజ్ఞం' వాస్తవానికి కాంగ్రెస్ పాలిట 'ధనయజ్ఞం'. ఇందులో పెట్టిన పోలవరం ప్రాజెక్టుకు అనేక అడ్డంకులున్నా కాలువ పనులు మాత్రం వేగంగా జరిపిస్తున్నారు. అదే సమయంలో గోదావరి జలాలను తెలంగాణకు అందించే ప్రాజెక్టుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజలను అనేక రకాలుగా ప్రలోభపెట్టి, భయపెట్టి తరలిస్తున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల తమ జీవనాధారాన్ని కోల్పోతున్న నిర్వాసితులు భద్రాచలంలో నిర్వహించిన పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక ర్యాలీపై ప్రభుత్వం పోలీసుల్ని ఉసిగొల్పి ప్రజల రక్తాన్ని కళ్ల జూసింది. ఎంతటి వ్యతిరేకమైనా, పర్యావరణ, అటవీ సంపద, ఆదివాసుల ఉనికీ, సంస్కృతుల వినాశనానికైనా వెనుదీయక తెలంగాణ గొంతెండబెట్టి, గోదావరి జలాలను తరలించి సామ్రాజ్యవాద, కార్పోరేట్ సంస్థల, కోస్తా భూస్వాముల ప్రయోజనాలు నెరవేర్చడానికి వై.యస్.ఆర్ ప్రభుత్వం కంకణం కట్టుకున్నది.

నీటి ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు పెద్ద పీట వేస్తున్నామంటున్న రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 45 లక్షల ఎకరాలకు సూక్ష్మ సేద్యం ద్వారానే నీళ్లు ఇవ్వాలంటూ మోసపూరితంగా జీ.వో నం:34 తీసుకొచ్చింది. ఎత్తిపోతల పథకాల కింద కాలువల ద్వారా కాకుండా, సంపులు నిర్మించి, అక్కడి నుంచి సూక్ష్మ సేద్యం ద్వారా రైతులకు నీరిస్తామంటున్నారు. ఎత్తిపోతల కింద చేపట్టిన కాలువ పనులను ఆపేయాలని ప్రభుత్వం కాంట్రాక్టర్లను ఆదేశించింది. సూక్ష్మ సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ భూమికి నీరందించవచ్చంటూ, ప్రజల కళ్లకు గంతలు కట్టి తెలంగాణకు ఇచ్చే మొత్తం 250 టి.ఎం.సిల నీటిని 150 టి.ఎం.సిలకు తగ్గించాలని కుట్ర పన్నుతున్నది. విభేదాలకు తావులేని విధంగా రాయలసీమ ప్రజల నీటి అవసరాలను తీర్చాల్సిందిపోయి, శ్రీశైలం రిజర్వాయర్ నుంచి వరద జలాలకు బదులు నికర జలాలను తరలించే అత్యంత వివాదాస్పదమైన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణతో ప్రాంతాల మధ్య విభేదాలకు తెరలేపాడు రాజశేఖర్ రెడ్డి. అదే విధంగా కేంద్ర అనుమతులూ, అవసరమైన నీటి కేటాయింపులూ లేని నెట్టెంపాడు, కల్వకుర్తి, ఎస్.ఎల్.బి.సి సొరంగం మొదలైన ప్రాజెక్టులను బడా కాంట్రాక్టర్లను మేపడానికి జలయజ్ఞం కింద వై.ఎస్.ఆర్ ప్రభుత్వం చేపట్టింది. కానీ, ఏళ్ల తరబడి అసంపూర్తిగా పడివున్న జూరాల రెండవ దశ, ఆర్.డి.ఎస్ పథకాలను పూర్తిచేసి కృష్ణా జలాలను తెలంగాణకు అందించటం లేదు. పోలవరం, పులిచింతల, దుమ్ముగూడెం, పోతిరెడ్డిపాడు, కె.సి.కెనాల్, వెలిగొండ, సుంకేశుల, తోటపల్లి తదితర ప్రాజెక్టుల ద్వారా కోస్తా, రాయలసీమ ప్రాంతాలకు 685.37 టి.ఎం.సిల నీటిని అందించే పనులు చేస్తున్న ప్రభుత్వం తెలంగాణకు మాత్రం కేవలం 250 టి.ఎం.సిల నీటిని అందించే పనులనే చేస్తున్నది. ఇప్పుడు ఈ నీటిని మరింత తగ్గించేందుకు జీ.వో 34 తెచ్చింది.

రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే చిత్తశుద్ధే వుంటే కృష్ణా, గోదావరి జిల్లాల్లో తెలంగాణ పట్ల వివక్షలేని న్యాయమైన వాటా లభించే జల విధానం అమలుచేయాలి. తెలంగాణను సస్యశ్యామలం చేసే ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలి. ఇవేవీ లేకుండా అమలుకు సాధ్యంకాని జలవిధానంతో ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటూ, శంఖుస్థాపనలూ, నిర్మాణాలూ చేస్తున్న ప్రాజెక్టులన్నీ జలయజ్ఞం పేరిట కాంగ్రెస్ నాయకులూ, కాంట్రాక్టర్లూ ప్రజాధనాన్ని కొల్లగొట్టే 'ధనయజ్ఞం' తప్ప మరొకటి కాదు. 2009 నాటికి పూర్తి చేస్తామంటున్న జలయజ్ఞంలో ఎక్కువ భాగం పెండింగ్ ప్రాజెక్టులుగా మిగలటం తథ్యం. అందువల్ల రాబోయే ఎన్నికల్లో జలయజ్ఞం పూర్తి కావటం ఎన్నికల వాగ్దానం అయినా ఆశ్చర్యంలేదు. జలయజ్ఞం పూర్తి కావాలంటే మరోసారి తనకు అవకాశం యివ్వాలని కోరగలడు వై.యస్.ఆర్. అంటే వైఫల్యాన్ని కూడా అవకాశంగా మార్చుకునే ఎన్నికల ఎత్తుగడ ఇది.

గ్రామాలకు, పట్టణాలకు మౌలిక వసతులు కల్పించి, ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దాలని తలపెట్టిన 'ఇందిరమ్మ' పథకం అడుగడుగునా అవకతవకలమయం. ఇందులో అనర్హులకు, కాంగ్రెస్ పార్టీ

అనుకూలురకూ, ఇళ్లున్న వాళ్లకే ఇళ్లూ, ఇళ్ల పట్టాలు ఇస్తున్నారు. అర్హులైన వారి జాబితా తయారు చేయటం లేదు. రాజకీయ నాయకుల ఒత్తిళ్ల మేరకు వాళ్లు చెప్పిన వాళ్లకే అధికారులు ఇళ్లు ఇస్తున్నారు. ఇంటికి అయ్యే వ్యయం కింద ప్రభుత్వం మంజూరు చేసే సొమ్ము సరిపోయేదికాదు. అందులో కూడా నాసిరకం సిమెంటు వాడి, నాణ్యతలేని నిర్మాణాలు చేసి, 40 నుండి 50 శాతం ఇళ్లు కట్టకుండానే, 40 శాతం పాత ఇళ్లకే కొత్త రంగులేసి ప్రజాధనాన్ని కాజేస్తున్నారు. అసలు ఇందిరమ్మ పథకం మొత్తం కాంగ్రెస్‌కు కాసులుదండుకునే పెద్ద కుంభకోణంగా తయారైంది. ఒకపక్క రాష్ట్రంలో అనేక ప్రాజెక్టుల కింద లక్షలాది ప్రజల్ని నిర్వాసితుల్ని చేస్తూ, ఇందిరమ్మ పథకం కింద పేదలకు ఇళ్లు కట్టిస్తామంటున్నది వై.యస్.ఆర్ ప్రభుత్వం.

రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందించేందుకు ఆరోగ్య శ్రీ పేరిట రూపొందించిన ఈ పథకం కార్పోరేట్ ఆసుపత్రులను, ముడుపులు ముట్టజెప్పే బీమా కంపెనీలను పోషించే కార్యక్రమంగా తయారైంది. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలల్లో డాక్టర్లను, వైద్య సిబ్బందిని భర్తీ చేయకుండా యూజర్ ఛార్జీలు వసూలు చేస్తూ, ప్రజారోగ్య వ్యవస్థను ఊపిరాడకుండా గొంతు పిసికి చంపేసి, సర్కారు దవాఖాన అంటేనే మృత్యువు నోట్లోకి వెళ్లటమనేంతగా ప్రజలు భయపడేటట్లు చేసిన ప్రభుత్వం ఇప్పుడు తక్కువ ఖర్చుతో పేదలకు కార్పోరేట్ వైద్యం చేయిస్తానంటున్నది.

అధికారంలోకి వచ్చి మొట్టమొదట ఉచిత విద్యుత్తు బిల్లు పైనే సంతకం చేసిన వై.ఎస్.ఆర్ ఈ సదుపాయం అందరికీ కాదని ప్లేటు ఫిరాయించాడు. ఆ తర్వాత ఇది ప్రచారానికే పరిమితమై ఆచరణలో అటకెక్కింది. జల విద్యుత్తు పూర్తి స్థాయిలో ఉత్పత్తి అయ్యే సీజన్‌లో కూడా రైతులకు 9 గంటలు నిరంతరాయంగా కరెంటు ఇవ్వకుండ, బడా బాబుల పరిశ్రమలకు అడిగినంత కరెంటు ఇస్తున్నారు. రైతులకిచ్చే కరెంటుకు కెపాసిటర్లనీ, అవీ ఇవీ అని మెలికలు వేసి చివరికి 9 గంటల కరెంటుకు కోతపెట్టి, 7 గంటల కంటే ఎక్కువిచ్చేది లేదు పొమ్మంటున్నాడు. దీనికి కూడా రైతులు నిద్రాహారాలు మాని పడిగాపులు పడుతూ ఎంతో మంది కరెంటు షాకులకు బలైపోతుంటే, నాణ్యమైన కరెంటు ఇస్తున్నామని వై.ఎస్.ఆర్ ప్రభుత్వం డబ్బాకొట్టుకుంటున్నది.

మహిళా సంక్షేమాన్ని, మహిళలకు ఉపాధి కల్పనను ప్రభుత్వం గాలికొదిలేసి, స్వయం సహాయక బృందాలలోని మహిళలకు పావలా వడ్డీకి రుణాలు ఇచ్చే 'ఇందిరా క్రాంతి పథం' అనే ముసుగు తగిలించింది. ఆచరణలో కొచ్చేసరికి పావలావడ్డీ అనేది ఇదివరకు తీసుకున్న రుణాలకు వర్తించదని చెపుతున్నది. ఈ సంవత్సరం 7 వేల కోట్లు, వచ్చే సంవత్సరం 10 వేల కోట్లు పావలా వడ్డీకి రుణాలు ఇస్తామంటున్న ప్రభుత్వం, అప్పులిచ్చిన ప్రయివేటు మైక్రో ఫైనాన్స్ సంస్థల చేతుల్లో మహిళలు అవమానాల పాలై ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ఆ సంస్థలపైన ఎటువంటి చర్యలూ తీసుకున్న దాఖలాల్లేవు. మహిళల ఉపాధిపట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే, వారి ప్రాణాల్ని మైక్రో ఫైనాన్స్ సంస్థలకెందుకు బలి చేస్తుంది? 2008 నాటికి 40 లక్షల కుటుంబాలకు ఆహార భద్రత కల్పిస్తామని, ఆ కుటుంబాలకు మహిళా సంఘాల ద్వారా నిత్యావసరాల పంపిణీ చేయిస్తామని చెప్పే ప్రభుత్వం, పోషకాహార లోపంతో రోగాలకూ, ఆకలి చావులకూ బలి అవుతున్న వేలాది మంది బాలికలనూ, మహిళలనూ పట్టించుకోదు.

అసలు మహిళల జీవితాలతో చెలగాటమాడుతూ, సంసారాల్ని ధ్వంసం చేస్తున్న మద్యం అమ్మకాల నిషేధాన్ని మహిళలు డిమాండ్ చేయకుండా వుండడానికి బూటకపు మహిళా పథకాలను ముందుకు తెస్తున్నది. సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని దశల వారీగా అమలుచేస్తామని ప్రకటించి, నిషేధాన్ని వదిలేసి, బెల్టు షాపుల ద్వారా మద్యపానాన్ని మాత్రం జోరుగా అమలు చేస్తున్నది. తాగు నీళ్లు దొరకని గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో అసంఖ్యాకం గానీ, మద్యం దొరకని గ్రామం మచ్చుకొక్కటి కూడా లేదు. టూరిజం అభివృద్ధి పేరిట సెక్సు వ్యాపారాన్ని, మద్యపానాన్ని పెంచి పోషిస్తున్నది. మహిళల శరీరాలతో వ్యాపారం చేసేందుకు వివిధ రకాల పేర్లతో ప్రభుత్వం అనుమతులిస్తున్నది. వీటివల్ల మహిళలపై వరకట్న హత్యలూ, లైంగిక హింస, దోపిడీ విపరీతంగా పెరుగుతున్నాయి.

ఇవేవీ అరికట్టని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ప్రపంచ బ్యాంకు పథకం అయిన పావలా వడ్డీ రుణాల ఇందిరా క్రాంతి పథం ద్వారా మహిళల్ని ఉద్ధరిస్తామని, పురుషులతో సమానంగా మహిళా శ్రామికులకు వేతనం, మహిళా పారిశ్రామిక వేత్తలకు 5 శాతం సబ్సిడీ కల్పిస్తున్నామనీ, మహిళల సంక్షేమమే తమ ధ్యేయమని బాకాలూది ప్రచారం చేసుకుంటున్నది. ఈ ప్రచారానికీ, ప్రపంచబ్యాంకు పథకం పట్ల భ్రమలు పెంచి పోషించడానికీ డ్వాక్రా పొదుపు సంఘాలను ఉపయోగించుకుంటున్నది. పేద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చే 'దీపం' పథకం పేరున కాంగ్రెస్ పార్టీకి కావలసిన వారికీ, రేపు ఇంటింటికీ తిరిగి తన ఓట్ల ప్రయోజనాలు నెరవేర్చే వారికీ లబ్దిదారులంటూ గ్యాస్ డీలర్ షిప్‌లు ఇస్తున్నది. వీటన్నింటి ద్వారా అసలైన సమస్యలపై మహిళలు పోరాటాల బాట పట్టకుండా, మరో దూబగుంట తయారుకాకుండా మహిళలను పక్కదారి పట్టిస్తున్నది. చాలీ చాలని జీతాలతో బతుకులీడుస్తున్న అంగన్‌వాడి టీచర్లు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లెక్కితే తలలు పగలకొట్టించి రక్తాన్ని కళ్ల జూసింది రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం.

బడికి దూరంగా వున్న 4 లక్షల 23 వేల మంది పిల్లల్ని 'బడి బాట' పట్టించాలని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం గత సంవత్సరం 1022 పాఠశాలలు మూసివేసి, ఈ సంవత్సరం 6 వేలకు పైగా మూసివేయాలనుకుంటున్నది. ఉన్న పాఠశాలలు మూసివేసి పేద విద్యార్థులను ఏ బడిలో చేరుస్తారు? ఖాళీగా వున్న లక్ష ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఉపాధ్యాయులులేని పాఠశాలలతో, ఎప్పుడు కూలిపోతాయో తెలియని భవనాలతో, ఉన్న పాఠశాలలకు కనీసం మంచి నీళ్ల వసతి కూడా కల్పించకుండా నిర్లక్ష్యం చేస్తూ, ప్రభుత్వ పాఠశాలలంటేనే విద్యార్థుల తల్లిదండ్రులకు విముఖత కలిగేలా చేస్తున్నది. ఇది ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసే ఆలోచనే. కూలిపోవడానికి సిద్ధంగా వున్న ప్రభుత్వ

స్కూళ్లను బాగు చేయడానికి ప్రభుత్వానికి చేతులు రావటం లేదుగాని, కాన్వెంట్ స్కూళ్ల పేరుతో కోట్ల రూపాయలు ప్రయివేట్ సంస్థలకు ధారాపోయడానికి ఆరాటపడుతోంది. యూనివర్సిటీలు తమ నైపుణ్యాన్ని వ్యాపారం చేయడానికి ఉపయోగించాలని ముఖ్యమంత్రి విశ్వవిద్యాలయాలకు బోధిస్తున్నాడు. విద్యను వ్యాపారం చేసి, పేదలకూ, ధనికులకూ సమాన విద్యావకాశాలను సమాధి చేయాలనేదే ప్రభుత్వ ఉద్దేశం.

రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చిందన్న ఖ్యాతి కోసం, దాని ద్వారా లభించే ఓట్ల కోసం వై.ఎస్.ఆర్ ప్రభుత్వం ముస్లింలకు 5 శాతం రిజర్వేషన్ ఇవ్వజూపుతున్నది. భూ సంస్కరణల కింద భూస్వాముల మిగులు భూములను కదలనీయకుండా, పనికిరాని బంజరు భూములు పేదలకు పంచి, ఆ భూముల్ని అభివృద్ధి చేయడానికని, 'ఇందిరప్రభ' కంచాన్ని మోగిస్తున్న ప్రభుత్వానికి కంచంలో అన్నం పెట్టే ఆలోచన లేదు. ఇందుకు కేటాయించిన 500 కోట్ల రూపాయల నిధుల్లో గడువు ముగిసే సమయం దగ్గర పడుతున్నా 50 శాతం కూడా ఖర్చు చేయలేదు. ఆయకట్టు కల్పనకు ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చు చేసే ప్రభుత్వానికి బడుగుల భూమికి 10 వేలు ఖర్చు చేయడానికి చేతులు రావటంలేదు.

గ్రామీణ ప్రాంతాల నిరుపేదలకు ఒక్కొక్కరికి ఏటా కనీసం 100 రోజుల పని దినాలతో శ్రామిక ఉపాధిని కల్పించడానికి ఉద్దేశించిన 'ఉపాధి హామీ పథకం' వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ నాయకులకూ, అధికారులకూ, ఉపాధి కల్పించే పథకంగా మారింది. అనేక చోట్ల పనులు చేయించకుండా బిల్లులు డ్రా చేసుకొని డబ్బు కాజేస్తున్నారు. అరకొర పనులు చేయించిన చోట నెలల తరబడి కూలీలకు డబ్బులివ్వకుండ ఇబ్బందులకు గురిచేస్తూ, కాంట్రాక్టర్లను మేపటానికి యంత్రాలతో పనులు చేయిస్తున్నారు. 'రాజీవ్ పల్లెబాట', 'రాజీవ్ నగరబాట', 'ప్రజాపథం' కార్యక్రమాలు ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కాక ఎన్నికల ప్రచారానికీ, రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ పథకాల ప్రచారానికే ఉపయోగపడుతున్నాయి. దేవాలయాల సమస్యల పరిష్కారం పేరుతో ఇప్పుడు గుళ్లో లింగాలను మింగటానికి 'గుడిబాట' అంటూ మొదలుపెట్టాడు. ప్రతిదానికి ఒకబాట, ఒక పథకం. పేర్లు పెట్టటంలో ఎన్.టి.రామారావును, చంద్రబాబును మించిపోయాడు రాజశేఖర్ రెడ్డి.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి) పిచ్చి ముదిరిన చంద్రబాబు హైటెక్ సిటీ, ఐ.టి పార్క్‌లు నిర్మించి, సామ్రాజ్యవాద ఐ.టి. కంపెనీలకు ఎర్ర తివాచీ పరిస్తే, చంద్రబాబుకు తానేమీ తీసిపోనంటూ వై.ఎస్.ఆర్ కూడా ఫ్యాబ్ సిటీ, సిలికాన్ వ్యాలీలు, ఐ.ఐ.టి కాలేజీలు నిర్మించి ఇవ్వడానికి ఉవ్విళ్లూరుతున్నాడు. ఐ.టి కంపెనీలకు వల్లమాలిన రాయితీలు, సబ్సిడీలు కట్టబెడుతున్నాడు. హైదరాబాద్ చుట్టూ వేల ఎకరాల పేదల భూములు గుంజి ఐ.టి కంపెనీలకు, సెజ్‌లకూ ధారాదత్తం చేస్తున్నాడు. వ్యవసాయ రంగాన్ని మాత్రం సర్వనాశనం చేయడానికి సిద్ధమయ్యాడు. సామాజిక శాస్త్రాలను పనిగట్టుకుని నిర్వీర్యం చేస్తూ, సామ్రాజ్యవాద కంపెనీలకు కూలీలను తయారుచేసే ఐ.టి విద్యను ఆకాశానికెత్తుతున్నాడు.

ఎస్.సి, ఎస్.టి, బి.సిలకు చెందిన 3,14,685 మంది నిరుపేదలకు 4,37,019 ఎకరాల భూమిని పంపిణీ చేశామని ప్రభుత్వం చెపుతున్నది. కానీ, ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలు ఆక్రమించిన భూములు లక్షల ఎకరాలున్నాయి. ప్రభుత్వ మిగులు, దేవాదాయ భూములు 1 కోటి 20 లక్షల ఎకరాల పంపిణీకి అవకాశం వుంది. అయినా వీటి గురించి మాట్లాడకుండా, భూస్వాముల చేతుల్లోని భూములను కదలనీయకుండా భూముల పంపిణీ, భూ సంస్కరణల అమలుపూర్తి అయినట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ఆచరణలో అస్మదీయులకే భూ పంపిణీ అనేది తేలిపోయింది. పేదల ఆక్రమణలోని భూములకూ, పంపిణీ చేసిన భూములకు పట్టాలు కూడా సరిగా ఇవ్వలేదు. రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చి భూ సంస్కరణలు అంటూ బాకాలూదిన భూముల పంపిణీ భూస్థాపితమైపోయి, నేడు కార్పోరేట్ కంపెనీలకూ, తన కుటుంబ హస్తమున్న బ్రహ్మణి లాంటి పరిశ్రమలకు, సెజ్‌లకూ, రియల్ ఎస్టేట్ సంస్థలకూ వేల ఎకరాల అప్పగింత కార్యక్రమం ప్రధానమైంది. పేదల పట్టా భూములూ, అసైన్డ్ భూములూ, ఒకటేమిటి బడా బాబుల కన్నుపడిన భూములన్నీ స్వాహా అయిపోతున్నాయి. దీనికి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వమే దళారీగా వ్యవహరిస్తున్నది.

రాష్ట్రంలో 24 శాతంగా వున్న దళితుల, ఆదివాసీల స్థితిగతులను మార్చే పథకాలను ప్రవేశపెట్టలేదు గానీ, ప్రాజెక్టుల నిర్మాణం, గనుల తవ్వకం పేరుతో అడవితో జీవితాలు పెనవేసుకుపోయిన ఆదివాసీలను అడవుల నుండి తరిమివేసే పథకాలు పెద్దయెత్తున సాగుతున్నాయి. ఆదివాసీల భూములు ఆదివాసులకే దక్కాలనే 1/70 చట్టానికి ఏదో విధంగా తూట్లు పొడిచే కుట్రలు పన్నుతున్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో బినామీ పేర్లతో ఆదివాసీలకు దక్కవలసిన అనేక వనరులను దోచుకుంటున్న ఆదివాసేతరులకు ప్రభుత్వం కొమ్ముగాస్తున్నది. కంటి తుడుపుగా దళితులకు, ఆదివాసీలకు, బహుజన కులాలవారికి లేదా భూమిలేని పేదలకు ప్రభుత్వం పంచియిచ్చిన భూములకు సంబంధించి, అసైన్డ్ భూముల చట్టానికి సవరణలు తెచ్చి, వారికి భూములు దక్కకుండ చేయటానికి ప్రభుత్వం పూనుకుంది.

ఇలాంటి పథకాల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకుపోతామని వై.ఎస్.ఆర్ ప్రభుత్వం చెపుతున్న పథకాలన్నీ వాస్తవానికి ప్రపంచబ్యాంకు చేతిలో రూపుదిద్దుకున్నవే. తొమ్మిదేళ్ల పాలనలో చంద్రబాబు స్వర్ణాంధ్రప్రదేశ్ అంటూ ప్రపంచబ్యాంకు పథకాలతో రాష్ట్రాన్ని శ్మశానాంధ్రగా, రుణాంధ్రప్రదేశ్‌గా మార్చాడు. బాబును మించిన బంటుగా ప్రపంచబ్యాంకుకూ, సామ్రాజ్యవాదానికి సేవచేస్తున్న రాజశేఖర్ రెడ్డి అదే బాటలో నడుస్తూ, పేర్లు మార్చిన ప్రపంచబ్యాంకు పథకాలను కొనసాగిస్తూ, అదే బూటకపు అభివృద్ధి మంత్రాన్ని జపిస్తున్నాడు. 'ప్రపంచబ్యాంకు జీతగాడు - చంద్రబాబు మోసగాడు' అని దుయ్యబట్టిన వై.ఎస్.ఆర్, అభివృద్ధి కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయిస్తే తప్పేమిటని ఇప్పుడు ఎదురు ప్రశ్న వేస్తున్నాడు.

ఈ ప్రజా వ్యతిరేక అభివృద్ధి వెనక రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే వుంది. చంద్రబాబు తొమ్మిదేళ్ల పాలనలో 1600 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా రాజశేఖర్ రెడ్డి మూడేళ్ల పాలనలో ఆ సంఖ్య 4700కు చేరింది. ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు మొదట నామమాత్రపు నష్టపరిహారం ఇచ్చి, ఇప్పుడు ఆత్మహత్యలకూ వ్యవసాయానికీ సంబంధం లేదని బుకాయిస్తున్నారు. లక్షరూపాయల పరిహారం కూడా అధికారులకు ముడుపులు ముట్టజెప్పితేనే అందుతుంది తప్ప, లేకుంటే వేరే కారణాల వల్ల ఆత్మహత్యలు చేసుకున్నారని ఎగనామం పెడుతున్నారు. వ్యవసాయ సంక్షోభం మూలంగా బతుకుదెరువు కోసం వలసలు పెరిగాయి. వ్యవసాయ కూలీలు, గ్రామీణ వృత్తుల వారు పస్తులతో అలమటిస్తున్నారు. అనేక మంది ఆకలి చావులకు బలి అవుతున్నారు. ప్రయివేటీకరణ ఫలితంగా ఉద్యోగులు ఉద్వాసనకు గురవుతూనే వున్నారు. కార్మికుల బతుకులు బజారు పాలవుతూనే వున్నాయి. నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు రోజు రోజుకూ పెరుగుతూనే వున్నాయి. సామ్రాజ్యవాద బహుళజాతి కార్పోరేట్ సంస్థల ప్రయోజనాలను నెరవేర్చే రకరకాల ప్రాజెక్టులూ, గనులూ, సెజ్‌లూ లక్షలాది ప్రజల్ని నిర్వాసితుల్ని చేస్తున్నాయి. అభివృద్ధి (పాలకవర్గాల)కి పేదరికం అడ్డు వస్తోందన్న వాదనతో పేదల్ని నిర్దాక్షిణ్యంగా తరిమివేసే పథకాలు రూపొందిస్తున్నారు. ఇక తెలంగాణ సమస్యను నీరుగార్చడానికి వై.ఎస్.ఆర్ ప్రభుత్వం ఎన్నో విధాలుగా కుట్రలు పన్నుతూ, 610 జీ.వో అమలుకు అనేక రకాల అడ్డంకులు కల్పిస్తున్నది.

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రపంచబ్యాంకు అనుకూల విధానాలతో జీవనాధారం కోల్పోయి, బతుకులు దుర్భరంగా మారుతున్న పేద, మధ్యతరగతి ప్రజానీకం, రైతాంగం, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు తదితర అనేక సెక్షన్ల ప్రజలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. సమస్యలు పరిష్కారమయ్యే దారిలేక గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలకు దిగుతున్నారు. ఈ ఆందోళనల్ని అణచివేయడానికి ప్రభుత్వం తీవ్రమైన హింసా విధానాలు అమలుచేస్తున్నది. ఈ నిరసనలూ, ఆందోళనలకు స్ఫూర్తిగా, వెన్నుదన్నుగా నిలుస్తున్న మావోయిస్టు విప్లవోద్యమాన్ని అణచివేయడానికి క్రూర నిర్బంధాన్ని అమలుచేస్తున్నది. ఫాసిస్టు చంద్రబాబును మించిపోయి విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేసి, రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో రక్తపుటేరులు పారిస్తున్నది. వామపక్ష తీవ్రవాదం అన్నిటికంటే ప్రమాదకరమైనదని మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించడానికి కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మావోయిస్టు ఉద్యమం మీద యుద్ధం ప్రకటించింది. ఉద్యమం కొనసాగుతున్న రాష్ట్రాలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మార్గదర్శకంగా తీసుకోవాలని, వందల కోట్ల రూపాయల నిధులు, అత్యాధునిక ఆయుధాలు సమకూర్చుతున్నది.

నానాటికీ దుర్భరమవుతున్న జీవన పరిస్థితుల నుంచి సహజంగానే పెల్లుబుకుతున్న నిరసనలు మావోయిస్టు ఉద్యమ ప్రభావం లేని చోట్ల

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న అమరవీరుల చరిత్రలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక మీరు అమరవీరుల చరిత్రలు రాసేటప్పుడు కింది అంశాలు దృష్టిలో పెట్టుకోగలరు.

అమరుల సొంత పేరు, పార్టీ పేరు; వయసు; జిల్లా, గ్రామం, గ్రామ, ప్రాంత రాజకీయ నేపథ్యం; కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యం; చదువు, వృత్తి; పార్టీకి పరిచయమైన, రిక్రూట్ అయిన సంవత్సరం; రిక్రూట్ అయిన రంగం; ఉద్యమంలోకి రావడానికి పని చేసిన నేపథ్యం; పార్టీ సభ్యత్వం పొందిన సంవత్సరం; ఏయే సంవత్సరం, ఏయే దళాల్లో, ప్రాంతంలో, బాధ్యతల్లో, స్థాయిల్లో పని చేసినది; పోరాటాలూ, ప్రతిఘటన, ఎన్‌కౌంటర్లలో నిర్వహించిన పాత్ర; రాజకీయ రంగంలో కృషి; అధ్యయనం, బోధన వంటి అంశాల్లో వున్న సామర్థ్యాలు; కళా, సాహితీ, టెక్నికల్ వంటి రంగాల్లో అభిరుచీ, కృషి; వ్యక్తిగత జీవితం, స్వభావం; అమరత్వపు తేదీ, నెల, సంవత్సరం; అమరత్వపు ఘటన వివరాలు వంటి అంశాలు వచ్చే విధంగా క్లుప్తంగా రాయగలరు.

అమరుల చరిత్రతో పాటు ఫోటో(వుంటే) తప్పక జత చేయండి. ఫోటో వెనుక పేరు రాయాలి.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

కూడా తీవ్రమైన ప్రజా పోరాటాలుగా బద్దలవుతున్నాయి. ప్రాజెక్టుల నిర్వాసితుల ఆందోళనలూ, విద్యుత్తు, విత్తనాలు, గిట్టుబాటు ధరల కోసం రైతుల ఆందోళనలూ, ఉపాధ్యాయులూ, విద్యార్థులూ, అంగన్‌వాడీ టీచర్ల ఆందోళనలూ ఇలాంటివే. ఇవికాక తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గంగవరం పోర్టు నిర్వాసితులూ, బాక్సైట్ గనుల వ్యతిరేక మన్యం ఆదివాసులూ మిలిటెంట్ పోరాటాలు బద్దలయ్యాయి.

అతిచిన్న నిరసనను కూడా సహించలేని ప్రభుత్వం ఈ ప్రజా ఆందోళనలను కాల్పులతో రక్తపుటేరులు పారించి అణచివేయబూనుకున్నది. విద్యుత్ ఉద్యమంపై బషీర్‌బాగ్ కాల్పుల్లో ముగ్గుర్ని బలితీసుకున్న చంద్రబాబును తలదన్ని గంగవరంలో, ముదిగొండలో ఆందోళనాకారుల్ని పిట్టల్లా కాల్చివేయించింది రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం. బూటకపు ఎన్‌కౌంటర్ హత్యల్లో రాటు దేలిపోయి, రక్తం రుచి మరిగిన తోడేళ్లలాంటి ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రభుత్వ అండతో ప్రజల మీదికి కూడా ఎ.కె-47 తుపాకులు ప్రయోగించి ప్రాణాలు బలితీసుకుంటున్నారు. ముదిగొండ కాల్పులపై సర్వత్రా ఖండనలు, నిరసనలు వెల్లువెత్తుతుండగానే వాకపల్లిలో 11 మంది ఆదివాసీ మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు పశువుల్లా అత్యాచారానికి పాల్పడ్డారు.

ఏడుగురి ప్రాణాల్ని బలితీసుకుని, కనీసమైన మానవత్వాన్ని మరిచి ముదిగొండ ఆందోళనలో నక్సలైట్లున్నారని ఎలాంటి నదురు బెదురూ లేకుండా ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించేంత దుర్మార్గానికి సిద్ధమయ్యాడు. ఇక కూంబింగ్‌ను అడ్డుకోవడానికి ఆదివాసీ మహిళలతో నక్సలైట్లు అత్యాచార ఆరోపణలు చేయిస్తున్నారని ప్రకటించేటంత నీచానికి డి.జి.పి దిగజారాడు. ముదిగొండ కాల్పులూ, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉద్రిక్తత, తెలంగాణ పల్లెల్లో అల్లకల్లోలం, వాకపల్లిలో సామూహిక అత్యాచారం..... ఇలా ప్రతి సంఘటన వెనుక నక్సలైట్ల ప్రమేయమున్నట్లు పోలీసులు సమర్థించుకుంటున్నారు. దీనికి రాజశేఖర్ రెడ్డి వత్తాసు పలుకుతున్నాడు. బషీర్‌బాగ్ కాల్పుల సందర్భంగా 'రాక్షస రాజ్యం' అని గొంతు చించుకున్న ఇదే వై.ఎస్.ఆర్ ఇప్పుడు మాట్లాడుతున్న మాటలివి. అంటే, ఇప్పుడు నక్సలైట్లు ప్రతి విషయానికి ప్రజల రూపంలో ముందుకువచ్చి రాజ్య వ్యతిరేక పోరాటాన్ని చేస్తున్నట్లుగా చిత్రించి, ప్రజల్ని కూడా నిర్దాక్షిణ్యంగా చంపగలిగే, మహిళపై అత్యాచారం చేయగలిగే 'ప్రజాస్వామ్యాన్ని' అమలు చేయదలుచుకున్నది ఫాసిస్టు రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం.

ప్రజల్లో పెరుగుతున్న ఈ వ్యతిరేకతను సొమ్ము చేసుకుని రాబోయే ఎన్నికల్లో ఓట్లుగా మలుచుకోవడానికి ప్రతిపక్షాలు పావులు కదుపుతున్నాయి. అందులో భాగంగా టి.డి.పి అట్టహాసంగా మహానాడు నిర్వహించి కార్యక్రమాలు ఉధృతం చేసింది. తెలంగాణ ప్రజల ఓట్ల కోసం బాబ్లీ ప్రాజెక్టు వ్యతిరేక ఆందోళన చేపట్టి టి.డి.పి నానాహంగామా చేసింది. తెలంగాణ జిల్లాల్లో చంద్రబాబు పర్యటనలతో ర్యాలీలు, సభలు

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న పోరాట/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాల నివేదికలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక ఒక్కోసారి అవి ప్రచురణ సాధ్యం కావడం లేదు.

కనుక నివేదికలలో పోరాటం/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం; జిల్లా, గ్రామాల పేర్లు; ఏ దళ ఆధ్వర్యంలో జరిగినదీ రాయాలి (దళ, ప్రాంతాల పేర్లు పొడి అక్షరాల్లో రాయవద్దు). ఈ పోరాటాల సందర్భంగా చేపట్టిన కరపత్రాలూ, పోస్టర్లూ, పత్రికా ప్రకటనలు వంటి ప్రచార రూపాలను కూడా పేర్కొనాలి. వీటిల్లో పాల్గొన్న ప్రజల సంఖ్యానూ, వారిలోనూ మహిళల సంఖ్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రజల పాత్రను నిర్దిష్టంగా పేర్కొనాలి. ప్రజా వ్యతిరేకులపై భౌతిక చర్యలు తీసుకున్న నివేదికలు రాస్తున్నప్పుడు, ఆ చర్యలకంటే ముందు వారిపై చేసిన హెచ్చరికల వంటి పోరాట రూపాలను పేర్కొనాలి. వీటిలోనూ ప్రజల పాత్రను పేర్కొనాలి.

నివేదికలతో పాటు ఫోటోలు(వుంటే) తప్పక జత చేయగలరు. ఫోటో వెనుక వివరాలు రాయగలరు.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

నిర్వహించింది. గత కొంత కాలంగా తెలంగాణ ప్రాంత తెలుగుదేశం ఎం.ఎల్.ఎలు తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదనీ, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వివక్ష చూపుతున్నారని, మేము అధికారంలోకి వస్తే తెలంగాణను అభివృద్ధి చేస్తామని హామీలు, వాగ్దానాలు గుప్పిస్తున్నారు. తాము అధికారం చెలాయించిన తొమ్మిదేళ్ళూ తెలంగాణకు అణువణువునా వెన్నుపోటు పొడిచారు వాళ్ళు. ఇప్పుడు తెలంగాణ మీద టి.డి.పికి ఎక్కడలేని ప్రేమ పొంగుకొస్తున్నది. ప్రచారంలో ఆరితేరిన చంద్రబాబు 'పల్లె పల్లెకూ తెలుగుదేశం' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఎన్నికల ప్రచారాన్ని ఇప్పటి నుండే సాగించే కార్యక్రమాన్ని మొదలుపెట్టాడు. అమలులో వున్న మద్య నిషేధాన్ని ఎత్తివేసి, మద్యాన్ని ఏరులుగా పారించిన చంద్రబాబు ఇప్పుడు బెల్టు షాపులకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టాలని పిలుపునిస్తున్నాడు.

రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం చంద్రబాబు పొత్తుల బేరాలు మొదలుపెట్టి మూడో ఫ్రంటు (యు.ఎన్.పి.ఎ) కుంపటి అయితే పెట్టాడుగానీ, జయలలిత వైఖరితో అది ముడిపడేట్టు లేదు. సంస్కరణలూ నూతన ఆర్థిక విధానాల అభివృద్ధి ఫలాల్ని సామాన్య ప్రజలకు అందిస్తామని చెపుతున్న మూడో ఫ్రంటు వైఖరి యు.పి.ఎ, ఎన్.డి.ఎలకు భిన్నమైనదేమీ కాదు. ప్రపంచబ్యాంకు విధానాలను రాష్ట్రాల్లో తు.చ తప్పకుండ అమలు చేసిన మూడో ఫ్రంటు భాగస్వామ్య పార్టీలూ, ముఖ్యంగా స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్రాన్ని స్మశానాంధ్రగా, రుణాంధ్రప్రదేశ్‌గా మార్చిన ప్రపంచ బ్యాంకు ఏజెంట్ చంద్రబాబూ ఆ విధానాలను విడనాడకుండ, వాటి ఫలాల్ని ప్రజలకు అందేటట్లు చేస్తామంటున్నారంటే, సామ్రాజ్యవాదుల, బహుళజాతి కంపెనీల దోపిడీ మరింత యధేచ్ఛగా సాగించడానికి దేశాన్నీ, రాష్ట్రాన్నీ అప్పజెపుతారనటంలో సందేహం లేదు.

ఇక పచ్చి అమెరికా సామ్రాజ్యవాద అనుకూల పార్టీగా పేరుమోసిన బి.జె.పి అధికారంలోకి వచ్చే ఆశ లేకపోయినా హిందూత్వ ఎజెండాకే కట్టుబడి వుంది. రథయాత్రలూ, రామ మందిరాలకు ఓట్లు రాలే అవకాశంలేక తాజాగా సేతు సముద్రం ప్రాజెక్టు వ్యతిరేకతను రంగం మీదికి తీసుకొచ్చి, సెంటిమెంట్లు రెచ్చగొట్టి ఓట్ల పాచికగా వాడుకోజూస్తున్నది. వి.హెచ్.పి, హిందూ వాహినీలతో కలిసి సెప్టెంబర్ 9న బంద్ నిర్వహించింది. ఉత్తరాది తరహాలో తమిళనాట పాచికలు పారే పరిస్థితి లేక, తనకంటే రెండాకులు ఎక్కువే చదివిన కరుణానిధి నిరాహార దీక్ష దెబ్బకి కళ్లు తేలేసి నిస్సహాయంగా నిరీక్షిస్తున్నది. ఒక ఓటు, రెండు రాష్ట్రాలు అని అధికారంలో వున్నన్నాళ్లు తెలంగాణను పక్కనబెట్టి, మళ్లీ ఇప్పుడు ఓట్ల కోసం తెలంగాణ పాట అందుకుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ఉద్దేశం బి.జె.పికి ఏ కోశానా లేకపోయినా, వున్న కొద్దిపాటి సీట్లను దక్కించుకోవటానికి తెలంగాణ పాటపాడక తప్పని స్థితిలో రాష్ట్రంలో అది వుంది. ప్రజా సమస్యలకంటే ఓట్ల కోసం ప్రజల్ని రెచ్చగొట్టే అంశాల మీదనే ఆందోళనలు చేపట్టే పథకాలు రూపొందించుకుంటున్నది.

వామపక్షాలు, యు.పి.ఎతో అంటకాగుతూనే అవకాశవాద రాజకీయాలతో ప్రపంచ బ్యాంకు విధానాల మీద సన్నాయి నొక్కులు నొక్కుతూ వచ్చాయి. మరోపక్క ప్రత్యేక ఆర్థిక మండలాల (సెజ్‌ల) విధానాన్ని సి.పి.ఎం నెత్తినెత్తుకుని మోస్తున్నది. అధికారంలో వున్న రాష్ట్రాల్లో సెజ్‌ల ఏర్పాటులో ముందుకురుకుతూ, ఇతర రాష్ట్రాల్లో వ్యతిరేక గళం వినిపిస్తున్నది. నందిగ్రామ్ మారణకాండతో ప్రపంచబ్యాంకు విధానాల అమలులో తానేమిటో స్పష్టం చేసిన సి.పి.ఎం బుద్ధదేవ్, సింగూర్‌ను మాత్రం వదిలేది లేదంటున్నాడు. 'నాదీ పెట్టుబడిదారీ మార్గమే' అంటూ, అదే సమయంలో మార్కెట్ ఆర్థిక విధానాల వల్ల పేదలు నష్టపోకుండా ఆదుకుంటామని, ఇదే తమ వామపక్ష ప్రత్యామ్నాయానికి అర్థమని చెపుతున్నాడు.

అమెరికాతో అణు ఒప్పందానికి వ్యతిరేకంగా యు.పి.ఎ కూటమి నుంచి వైదొలుగుతామని బెదిరిస్తున్న సి.పి.ఎం, పోతే పొమ్మన్న ప్రధాని సవాల్‌కు ఇరకాటంలో పడింది. వాస్తవానికి కూటమి నుంచి విడిపోవటం, విడిపోతే మధ్యంతర ఎన్నికలు జరగటం సి.పి.ఎంకు ఇష్టం లేదు. నందిగ్రామ్ సంఘటనతో సామాన్య ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన స్థితిలో, మధ్యంతర ఎన్నికలు జరిగితే తమకు నష్టం జరుగుతుందని వామపక్ష నేతలు ఒకవైపు అంగీకరిస్తూనే మరోవైపు తమకు నష్టం జరగటం కన్నా, అణు ఒప్పందం అమలులోకి రాకుండా వుండటమే తమకు ముఖ్యమని బింకాలు పోతున్నారు. ఏతావాతా కలహాల కాపురం కూలిపోయి, మధ్యంతర ఎన్నికలకు దారితీసే పరిస్థితి ముందుకొస్తున్నది.

నందిగ్రామ్‌లో నష్టపోయిన ప్రతిష్టను, నిలబెట్టుకోవడానికీ, మళ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం ఇప్పుడు వామపక్షాలు 'మూడో ప్రత్యామ్నాయం' రాగాన్ని ఆలపిస్తున్నాయి. బుద్ధదేవ్ చెప్పిన అర్థంలో పేదలు నష్టపోకుండా ఆదుకునే మానవీయ కోణంలో అమలు చేయటమే తప్ప, ప్రపంచబ్యాంకు విధానాలను విడిచిపెట్టటం 'మూడో ప్రత్యామ్నాయం' ఉద్దేశం కాదు. ఇక మానవీయ కోణమేమిటో నందిగ్రామ్‌లోనే స్పష్టమైపోయింది.

వామపక్షాలు అధికారంలో లేనిచోట ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు చేస్తున్నాయి. కార్యకర్తల్ని నిలబెట్టుకోవడానికీ, ఓట్ల కోసం రాష్ట్రంలో సి.పి.ఎం భూ పోరాటాలు చేస్తున్నది. జెండాలు పాతించి, గుడిసెలు వేయించి, ప్రజల పోరాట పటిమను సంస్కరణవాద పోరాటాలకు పరిమితం చేయటం తప్ప, పేదలకు భూములు దక్కేవరకు వామపక్షాలు భూపోరాటాన్ని ముందుకు తీసుకుపోయేవికావు. ఈ చట్టబద్ధ పోరాటాలపైన కూడా రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం కాల్పులు జరిపి ముదిగొండలో ఏడుగురి ప్రాణాలు బలితీసుకుంది. ఇక ఇక్కడి నుండి భూపోరాటాన్ని ముందుకు తీసుకుపోయే ఎజెండా వామపక్షాలకు లేదు. ప్రభుత్వం కంటే ముందుగానే మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇచ్చి వామపక్షాల కార్యకర్తల్ని తమ చేజారి పోకుండా వుంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. అణుఒప్పందాన్నీ, భారత్ - అమెరికా సంయుక్త సైనిక విన్యాసాల్ని వ్యతిరేకిస్తూ ప్రచార జాతా పేరుతో సి.పి.ఎం ర్యాలీలు

నిర్వహించి, విశాఖలో బహిరంగ సభ జరిపింది. ఇక తెలంగాణా ఓట్ల కోసం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేయాలని సి.పి.ఐ మాట్లాడుతుంటే, నిన్నటిదాకా విశాలాంధ్ర అన్న సి.సి.ఎం, కాంగ్రెస్ ఇస్తానంటే మాకేం అభ్యంతరం లేదని గొంతుమార్చింది.

ప్రత్యేక తెలంగాణపై పోరాటాలు చేస్తున్న సంస్థల మధ్య ఐక్యతలేక, బలమైన ప్రత్యామ్నాయం లేని స్థితిని ఆసరా చేసుకుని టి.ఆర్.ఎస్ తెలంగాణ సెంటిమెంటుతో, 'పల్లె నిద్ర' పేరున ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలతో మళ్లీ ఎన్నికలకు సమాయత్తం అవుతున్నది.

ఈ విధంగా గడచిన మూడేళ్ళలో అధికార, ప్రతిపక్ష పాలకవర్గ పార్టీలన్నీ ప్రజల సంక్షేమాన్ని మరిచి అందినకాడికి దండుకునే పద్ధతులను అవలంభిస్తున్నాయి. చట్ట సభల్లో ప్రజల సమస్యలు చర్చించడానికి కూడా అవినీతికి పాల్పడుతున్న అత్యంత హీనస్థితికి దిగజారిన పాలకవర్గ పార్టీలపై ప్రజలు భ్రమలు కోల్పోతున్న స్థితిలో ఏ ఒక్క పార్టీ తానుగా అధికారం సాధించలేక, తమ దోపిడీ కొనసాగించుకోవడానికి, తమ మధ్య ఎన్ని వైరుధ్యాలున్నప్పటికీ అధికారం, దోపిడీలే పరమావధిగా అవకాశవాద పొత్తులు ఏర్పాటు చేసుకుంటూ పార్లమెంటరీ రాజకీయాల రొంపిలో కుమ్ములాడుకుంటున్నాయి.

ఇప్పుడు ప్రజల సమస్యల గురించి మాట్లాడుతూ ఓట్ల కోసం నాటకాలు మొదలుపెట్టాయి. ఈ మోసాలను గ్రహించి, కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకువస్తున్న రకరకాల ప్రపంచబ్యాంకు నిర్దేశిత పథకాలను, బూటకపు సంస్కరణలనూ ప్రజలు తిప్పికొట్టి, ఓట్ల కోసం చేస్తున్న బూటకపు వాగ్దానాలు, హామీల బండారాన్ని బహిర్గతపరచాలి. సామ్రాజ్యవాదుల, దళారీల ప్రయోజనాలు నెరవేర్చడానికి, ప్రజల న్యాయమైన సమస్యలపై పెల్లుబుకుతున్న పోరాటాలనూ, విప్లవోద్యమాన్నీ క్రూరంగా అణచివేస్తున్న ఫాసిస్టు రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై దృఢంగా పోరాడాలి. దేశాన్ని, రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకు అప్పగించే ప్రపంచబ్యాంకు విధానాలను అడ్డుకోవడానికి మరింత తీవ్రమైన మిలిటెంటు పోరాటాల్లో ముందుకు కదలాలి. అధికారం, దోపిడీలే పరమావధిగా ప్రజల్లోని ప్రభుత్వ వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడానికి అవకాశవాద పొత్తులతో ఎన్నికలు రాగానే ప్రజల సమస్యలపై పోరాటం అంటూ ఆర్భాటం చేస్తున్న టి.డి.పి, బి.జె.పి, వామపక్షాల తదితర పాలకవర్గ ప్రతిపక్ష పార్టీల వైఖరిని ప్రజలు ఎండగట్టాలి. ఇటువంటి దళారీల పాలనలో ప్రజలకు న్యాయం ఎన్నటికీ సాధ్యం కాదు. దోపిడీ పీడనలు లేని నూతన ప్రజాస్వామిక సమాజంలోనే ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం, నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతాయి. ఇందుకోసం వ్యవసాయ విప్లవం ఇరుసుగా కొనసాగుతున్న భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో ప్రజలు భాగస్వాములు కావాలి.

★

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

**"ఎవరైనా రాయడానికి సాహసించకపోతే? తాము ప్రజలను నొప్పించి, విమర్శించబడతామేమోనని, తాము చెప్పాల్సింది వున్నప్పటికి తాము రాయడానికి సాహసించడం లేదని కొందరంటారు. అటువంటి చింతలను పక్కకు పెట్టెయ్యొచ్చునని నేననుకొంటున్నాను. జనతా ప్రజాస్వామ్య రాజ్యం మనది, ప్రజల సేవలో రాయడానికి అనువైన వాతావరణాన్ని అది సమకూరుస్తుంది. వంద పుష్పాలను వికసింపనీయండి, వేయి ఆలోచనా స్రవంతులను పోటీ పడనీయండి అనే విధానం విజ్ఞాన శాస్త్రం, కళలు వికసించడానికి అదనపు హామీని ఇస్తోంది. నీవు చెప్పేది సబబైనదే అయితే, నీవు మరింత విడమర్చి చెప్పవచ్చు. నీవు తప్పు చెబితే, నీ తప్పుల్ని సరిదిద్దుకోవడానికి విమర్శ సహాయపడగలదు. దాంట్లో చెడ్డేమీలేదు. మన సమాజంలో, వైరుధ్యాలను బైటపెట్టి పరిష్కరించడానికి, విజ్ఞాన శాస్త్రాన్ని, కళలను అభివృద్ధి చేయడానికి, మన పని అంతటిలోనూ విజయాన్ని ఖాయం చేసుకోవడానికి వాడబడిన ఒక మంచి పద్ధతి సమరశీల విప్లవాత్మక విమర్శ, ప్రతి విమర్శ."**

**– మావో**

# అమెరికా ప్రయోజనాల కోసమే అణుఒప్పందం

భారత్ - అమెరికా అణు ఇంధన సహకార ఒప్పందం ఇటీవలి కాలంలో తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. దేశ రాజకీయాలను ఒక కుదుపు కుదుపుతూ ఒక దశలో మధ్యంతర ఎన్నికలు తప్పవనే స్థితికి తీసుకువచ్చింది.

అణు ఒప్పందాన్ని అమల్లోకి తేవడానికి ఉద్దేశించిన ఒప్పందం '123'. అమెరికా అణు శక్తి చట్టంలోని సెక్షన్ 123 ప్రకారం ఏర్పడింది కనుక ఈ ఒప్పందానికి ఆ పేరు వచ్చింది. ఈ సెక్షన్ ప్రకారం పౌర ప్రయోజనాలకు ఉద్దేశించిన అణుశక్తి విషయంలో అమెరికా ప్రభుత్వం ఏ దేశంతోనైనా ఒప్పందం కుదుర్చుకోవచ్చు.

ఈ ఒప్పందం కోసం ఉద్దేశించినదే హైడ్ చట్టం. ఇది అమెరికా చట్టం. అమెరికా కాంగ్రెస్ సభ్యుడు హెన్రీ జె.హైడ్ ప్రతిపాదించిన కీలక సవరణను ఈ చట్టంలో చేర్చినందున ఈ చట్టాన్ని ఆ సభ్యుడి పేరుతోనే వ్యవహరిస్తున్నారు. అమెరికా, తన అణుశక్తి చట్టం ప్రకారం అణువ్యాప్త నిరోధక ఒప్పందం (ఎన్.పి.టి)పై సంతకం పెట్టని దేశాలతో అణు ఒప్పందం కుదుర్చుకోకూడదు. ఇప్పుడు భారత్‌తో అమెరికా ఒప్పందం కుదుర్చుకోవాలంటే ఈ నిబంధనకు మినహాయింపు నివ్వాలి. హైడ్ చట్టం అటువంటి మినహాయింపు ఇచ్చే అధికారాన్ని బుష్‌కు ఇస్తుంది.

అయితే 123 ఒప్పందమూ, హైడ్ చట్టమూ భారత్ ప్రయోజనాలను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి.

ఈ ఒప్పందం ప్రకారం మన దేశ అణు రియాక్టర్లను మిలటరీ, పౌర రియాక్టర్లుగా శాశ్వతంగా విభజించాలి. అంటే భవిష్యత్తులో దేశ అవసరాల రీత్యా పౌర రియాక్టర్లను, మిలటరీ రియాక్టర్లుగా గానీ మిలటరీ రియాక్టర్లను పౌర రియాక్టర్లుగా గానీ, ఉపయోగించుకునే వీలు వుండదు. అంతేకాదు పౌర రియాక్టర్లను అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐ.ఎ.ఇ.ఎ) పర్యవేక్షణ కిందికి తీసుకురావాలి. ఐ.ఎ.ఇ.ఎపై అమెరికా పెత్తనమే ఉంది కనుక భారత అణు కార్యక్రమంపై అమెరికా పర్యవేక్షణ ఉంటుందని అర్థం చేసుకోవచ్చు.

భారత్‌ను ఎన్.పి.టిపై సంతకం చేయమని అమెరికా ఎప్పటి నుంచో వత్తిడి చేస్తోంది. అయితే భారత్ సంతకం చేయడం లేదు. ఇదొక అసమ ఒప్పందం. అణుబాంబులను తయారు చేస్తూ, ఇతర దేశాలపై వాటిని ప్రయోగిస్తూ లక్షలాది ప్రజల ప్రాణాలను తీస్తున్న అమెరికా అణువ్యాప్తి నిరోధక ఒప్పందం అని మాట్లాడ్డం హాస్యాస్పదం. కనుక ఎన్.పి.టిపై భారత్ సంతకం పెట్టకపోవడాన్ని యావత్ దేశ ప్రజలు సమర్థిస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ ఒప్పందం ప్రకారం భారత్ ఎన్.పి.టిపై సంతకం చేయనప్పటికీ దాని నియమాలను ఆమోదించాలి. అంతేకాదు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధం కోసం అమెరికా చేపట్టే చర్యల్లో భారత్ భాగస్వామి కావాల్సిందే.

ఈ ఒప్పందం ప్రకారం భారత్ అణ్వస్త్ర పరీక్షలు చేయడానికి వీల్లేదు. నిజానికి భారతదేశమే కాదు ఏ దేశమైనా అణ్వస్త్ర పరీక్షలు చేయడాన్ని ఎవరూ సమర్థించక్కర్లేదు. 1998లో భారత్ అణ్వస్త్ర పరీక్షలు చేసినప్పుడు అత్యధిక ప్రజానీకం వ్యతిరేకించారు. అయితే పరీక్షలు చేయొద్దని చెప్పే అధికారం అమెరికాకు ఎంత మాత్రం లేదు. ఎందుకంటే అన్ని దేశాల వలెనే అమెరికా కూడా ఒక దేశం. ప్రపంచంపై దానికేమీ ఆధిపత్యం లేదు. అలాగే ప్రపంచ అణు కార్యక్రమాన్ని నియంత్రించే పెత్తనాన్ని దానికెవరూ ఇవ్వలేదు. కాబట్టి మన దేశపు అణు కార్యక్రమంలో జోక్యం చేసుకొనే హక్కు దానికి లేదు. ఏ అధికారం లేనప్పటికీ గతంలో పరీక్షలు చేసిన సందర్భంలో అమెరికా మన దేశంపై కఠినమైన ఆంక్షలను విధించింది.

అణు శక్తికి ఉపయోగించే యురేనియంను శుద్ధిచేసే హక్కును గానీ, ఒకసారి ఉపయోగించిన అణు ఇంధనాన్ని తిరిగి శుద్ధి చేసే హక్కునుగానీ ఈ ఒప్పందం ఇవ్వడం లేదు.

హైడ్ చట్టంలోని సెక్షన్ 109 అంతర్జాతీయ అణు శక్తి సంస్థ విధానాలను ఉల్లంఘిస్తోంది. ఈ సెక్షన్‌ను భారత ప్రభుత్వానికి తెలియకుండా చట్టంలో జొప్పించింది అమెరికా. ఈ చట్టం ప్రకారం అమెరికా అధ్యక్షుడు ప్రతి సంవత్సరం ఆ దేశపు కాంగ్రెస్‌కు ఓ నివేదికను సమర్పించవల్సి వుంటుంది. అణు సంబంధ విషయంలో ఇరాన్ పట్ల అమెరికా అనుసరిస్తోన్న వైఖరికి భారత్ మద్దతు కొనసాగిస్తున్నదా లేదా అనే విషయాన్ని ఆ నివేదికలో పేర్కొనవల్సి వుంటుంది. అంటే ఇరాన్ పట్ల అమెరికా కఠినమైన ఆంక్షలు విధించినా, దాడులకు దిగినా భారత్ అమెరికాకు మద్దతు ఇవ్వాల్సి వుంటుంది. ఒప్పందం పూర్తి రూపం దాల్చకముందే ఐ.ఎ.ఇ.ఎలో ఇరాన్‌కు వ్యతిరేకంగా మన్మోహన్ రెండుసార్లు ఓటు వేసిన విషయం తెల్సిందే. ఇలా ఓటు వేయడం వల్ల భారత్ ఒక ముఖ్యమైన ప్రయోజనాన్ని కోల్పోయింది. ఇరాన్ నుంచి పైప్‌లైన్ ద్వారా ఖనిజ వాయువును (గ్యాస్) దిగుమతి చేసుకునే ఒక ఒప్పందం అంతకు ముందు భారత్ ఇరాన్‌ల మధ్య వుండేది. ఖనిజ వాయువు ఉత్పత్తిలో అత్యంత వెనుకబడి వున్న భారత్‌కు ఈ ఒప్పందం ఎంతో ప్రయోజనకారిగా ఉంటుంది. ఇప్పుడు ఇరాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఓటు చేసినందువల్ల ఈ ఒప్పందం సందిగ్ధంలో పడింది. ఇలా అమెరికా ప్రయోజనాలను నెరవేర్చడం కోసం భారత్ తన ప్రయోజనాలను కూడా కాలదన్నుకుంది. అంటే భారత్ తన విదేశాంగ విధానాన్ని అమెరికాకు పాదాక్రాంతం చెయ్యడమే కాక అమెరికా విదేశాంగ విధానాన్ని పూర్తిగా సమర్థించాలి. అమెరికా విదేశాంగ విధానం ఎంత క్రూరమైనదో హిరోషిమా, నాగసాకి, వియత్నాం, పాలస్తీనా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ మొదలైన దేశాలలో పోయిన లక్షలాది ప్రాణాలు చెప్తాయి. ఆంక్షల మూలంగా ఆకలితో, రోగాలతో బతుకులీడ్చుతున్న కోట్లాది జీవచ్ఛవాలు చెప్తాయి. మరి దీన్ని సమర్థించడమంటే అది కేవలం భారత్‌కే కాదు పీడిత దేశాలన్నింటికీ ప్రమాదకరమైన విషయం. తన విదేశాంగ విధానాన్ని సమర్థించని పక్షంలో అమెరికా ఈ ఒప్పందాన్ని తుంగలో తొక్కుతుంది.

ఇలా హైడ్ చట్టంలో ఉన్న పలు అంశాలు 123 ఒప్పందాన్ని ప్రమాదకరమైన ఒప్పందంగా మార్చుతున్నాయి. మొత్తంగా ఈ ఒప్పందంపైన అమెరికా చట్టాల ఆధిపత్యమే ఉంటుంది.

ఈ ఒప్పందం ప్రకారం సి.ఐ.ఎ, ఎన్.ఎస్.ఎ వంటి అమెరికా భద్రతా ఏజెన్సీల మాదిరిగా నడిచే జాతీయ భద్రతా నిర్వహణా సంస్థ అనే అమెరికా భారీ ఏజెన్సీ కిందకు వస్తుంది భారతదేశం. అమెరికా అణు కార్యదర్శి భారత అణుశక్తి శాఖ కార్యకలాపాల్లో జోక్యం కలిగించుకోవచ్చు. కొద్ది సంవత్సరాల తర్వాత అణ్వస్త్రాలను రూపొందించే పదార్థాల ఉత్పత్తిని ఏక పక్షంగా నిలిపివేయాలని లేదా ఉత్పత్తిపై మారిటోరియం విధించాలని కూడా ఈ ఒప్పందం షరతును విధిస్తోంది.

భారత్ ఇంత లొంగుబాటును ప్రదర్శించినప్పటికీ, ఈ ఒప్పందం ద్వారా అది అమెరికా నుండి పొందే ప్రయోజనాలు ఏమీ లేవు. భారత్ అణుశక్తి అవసరాలకు సరిపడా సహకారాన్ని అమెరికా నిరాకరిస్తోంది. ఏ కారణం చూపైనా ఈ ఒప్పందం నుంచి వైదొలిగే వెసులుబాటును అమెరికాకు హైడ్ చట్టం ఇస్తున్నది కనుక అమెరికా ఆ పని ఎప్పుడైనా చేయవచ్చు. అమెరికా అలా వైదొలిగినప్పుడు తాను అణు ఇంధన సరఫరాలను నిలిపివేయడమే కాదు, మిగితా దేశాల నుండి కూడా సరఫరాలు నిలిచిపోయేలా చేస్తుంది. అట్లా అణు సరఫరాలు నిలిచిపోయినప్పుడు, మన దేశంలోని అణు రియాక్టర్లు వృధాగా మిగిలిపోయి ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతుంది.

ఇలా చెప్పుకుంటూ పోతే ఈ ఒప్పందం వల్ల భారత్‌కు కించిత్తు ప్రయోజనం లేకపోగా అమెరికాకు మాత్రం బోలెడు ప్రయోజనాలున్నాయి. ముఖ్యంగా తన వ్యూహాత్మక ప్రయోజనాన్ని నెరవేర్చుకోవడానికే అమెరికా ఈ ఒప్పందాన్ని ముందుకు తెస్తోంది. ఈ ఒప్పందం ఆశచూపి ఇరాన్ విషయంలో అమెరికా అప్పుడే పొందిన ప్రయోజనం మనకు నగ్నంగా కనిపిస్తూనే వుంది. అంతేకాదు దక్షిణాసియాపై అమెరికా అదుపు సంపాదించాలంటే అది భారత్‌ను తన కనుసన్నల్లో పెట్టుకోవడం అవసరం. ఈ ఒప్పందం ద్వారా అమెరికా ఆ పని చేయగలదు.

ముఖ్యంగా సైనికపరంగా శక్తివంతంగా ఉన్న చైనాను అమెరికా ఎప్పుడూ ముప్పుగానే భావిస్తుంది. కనుక భారత్‌ను చైనాకు వ్యతిరేకంగా నిలబెట్టే ప్రయత్నం చేస్తుంది. ఈ ఒప్పందాన్ని ఆశ పెట్టి గస్తీలో వున్న చైనా సబ్‌మెరైన్లను గుర్తించే యాంటీ సబ్‌మెరైన్ గస్తీ విమానాలనూ, వ్యూహాత్మక మలకా జలసంధి నుంచి చైనా సైనిక కార్యక్రమాలను గమనించేందుకు రాడార్ వ్యవస్థనూ అమెరికా తన వద్ద భారత్ చేత కొనిపిస్తోంది. అంటే చైనా సైనిక కార్యకలాపాలపై భారత్ పర్యవేక్షణను ఈ ఒప్పందం ద్వారా అమెరికా సాధించింది. ఇప్పటికే చైనాకు వ్యతిరేకంగా జపాన్, తైవాన్, దక్షిణ కొరియా, ఫిలిప్పైన్స్, భారత్‌లను తన వెనుక సమీకరించుకున్న అమెరికా ఇప్పుడు భారత్‌ను మరింతగా దాసోహం చేసుకుంటోంది. ఈ ఒప్పందాన్ని అడ్డం పెట్టుకొని అది మనదేశంలో రహస్య సైనిక బేసులను పెట్టుకొనే అవకాశం వుంది. ఈ మధ్య కాలంలో అమెరికా-భారత్‌లు సంయుక్తంగా వైమానిక నౌకా విన్యాసాలు చేస్తున్నాయి. ఇప్పటికి గ్వాలియర్, పశ్చిమ బెంగాల్‌లోని కలామ్‌కుండలో వైమానిక విన్యాసాలు చేసాయి. 2006 అక్టోబర్ నుంచి ఇటువంటి సంయుక్త విన్యాసాల కోసం మూడు సంవత్సరాల కార్యక్రమాన్ని రూపొందించుకున్నాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్‌లో బంగాళాఖాతంలో నౌకా విన్యాసాలు నిర్వహించాయి. గతంలోనూ మలబారు తీరంలో నిర్వహించాయి. ఇంకా అనేక రకాల సైనిక శిక్షణను సహితం అమెరికా భారత్‌కు అందిస్తోంది. డికెలోని మావోయిస్టు పార్టీని అణచడంకోసం గాను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సైతం సహాయం అందిస్తోంది. ఇదంతా అమెరికా తలపెట్టిన 'టెర్రరిజం'పై యుద్ధంలో భారత్‌ను కూడా భాగస్వామిని చేసే ఉద్దేశమే.

ఈ ఒప్పందం ద్వారా అమెరికా నెరవేర్చుకోగలిగే వ్యాపార ప్రయోజనాలూ ఉన్నాయి. ముఖ్యంగా అది ఇష్టం వచ్చిన ధరలకు భారత్‌కు భారీగా రియాక్టర్లను అమ్ముకుంటుంది. ఒకరకంగా అది మనపై అవసరానికి మించిన రియాక్టర్లను రుద్దుతుంది. అంతేకాక సహకారం పేరుతో అది మన శాస్త్రజ్ఞుల సేవలనూ వాడుకుంటుంది.

ఈవిధంగా అణు సహకార ఒప్పందం పేరుతో భారత రక్షణ, విదేశాంగ విధానాలను అమెరికా తన చెప్పుచేతల్లో పెట్టుకోవడం ద్వారా, భారత సార్వభౌమత్వాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది.

ఇంత ప్రమాదకరమైన ఒప్పందాన్ని తీసుకువచ్చే ప్రయత్నాలు రెండేళ్లకు ముందునుంచీ మొదలయ్యాయి. దీని గురించి 2005 జూలై 18న బుష్ - మన్మోహన్‌లు అమెరికాలో ఒక సంయుక్త ప్రకటన చేశారు. అప్పటి నుంచీ ఎన్నో కసరత్తులు జరిగి 2006 డిసెంబర్‌లో అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) దీన్ని ఆమోదించింది. ఈ సంవత్సరం జూలై 25న దీన్ని భారత రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ సంఘం ఆమోదించింది. ఆగస్టు 3న ఈ ఒప్పందం బాహ్య ప్రపంచానికి వెల్లడయింది.

అయితే ఈ ఒప్పందంపై ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తున్నారు. ముఖ్యంగా వామపక్షాలు, ప్రతిపక్షాలూ ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ ఒప్పందం దేశ విదేశాంగ విధానానికి తీవ్ర ముప్పని చెప్తూ ఈ ఒప్పందాన్ని అమలులోకి తీసికెళ్లకుండా, అమెరికాతో తిరిగి చర్చలు జరుపాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు మన్మోహన్ సింగ్ అమెరికాతో అంటకాగుతున్నాడని ఘాటుగా విమర్శిస్తూ, భారత్‌పై అమెరికా సామ్రాజ్యవాదపు పట్టును సహించబోమని వామపక్షాల నేతలు హెచ్చరిస్తున్నారు. వామపక్షాల మాటలూ, విమర్శలూ, విశ్లేషణలూ అన్నీ పైపైన చూడ్డానికి చాలా విప్లవాత్మకంగా ఉన్నాయి. కానీ వామపక్షాలు మొదటినుంచీ అమెరికా ఆర్థిక విధానాలను సమర్ధిస్తూ వస్తున్నాయి. అమెరికా ఆర్థిక విధానాన్ని తమ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయడానికి కంకణం కట్టుకున్నాయి. వాటిని అమలు చేయడంలో భాగంగా నందిగ్రామ్ వంటి మారణహోమాలను సహితం అలవోకగా సృష్టిస్తున్నాయి. ఒకవైపు అమెరికా ఎజెండాను తమ రాష్ట్రాల్లో ముందుకు తీసుకుపోవడానికి శక్తి

వంచనలేకుండా 'కృషి' చేస్తూ, మరోవైపు మన్మోహన్‌సింగ్‌ను విమర్శించడం వెనుక ఓట్ల రాజకీయం తప్ప మరేమీ లేదు.

తమ పాలనలో అమెరికా సామ్రాజ్యవాదానికి అన్ని రంగాల్లోనూ దాసోహం అన్న బి.జె.పికి అమెరికా ప్రయోజనాలకు కట్టుబడిన అణు ఒప్పందాన్ని విమర్శించే ధైర్యం ఎక్కడ నుండి వచ్చిందన్నది విశ్లేషకులను కొంచెం ఆశ్చర్యపరిచింది. అధికార పీఠం మీదనున్న మమకారం నుంచే ఈ 'ధైర్యం' వచ్చిందని చెప్పుకోకతప్పదు. నిజానికి ఈ ఒప్పందం మీద దానికి పెద్ద వ్యతిరేకత లేదు. అమెరికాలోని హైడ్ చట్టం లాగే భారత్‌లోనూ అణుశక్తి చట్టాన్ని సవరించుకొని, అణ్వాస్త్రాల తయారీలో భారత్‌కు అవరోధం లేకుండా చూసుకుంటే, అణు ఒప్పందం తమకు ఆమోదయోగ్యమేనని బి.జె.పి చెప్తోంది. అయినప్పటికీ ఈ ఒప్పందంపై వామపక్షాల వ్యతిరేకత వల్ల మధ్యంతర ఎన్నికల ఊహాగానాలు బయలుదేరేటప్పటికి ప్రతిపక్షంగా తమ అదృష్టాన్ని ఎన్నికల్లో పరీక్షించుకోవాలనుకున్నాయి. అందుకే తమ వ్యతిరేకతను ప్రకటించాయి.

వామపక్షాలూ, ప్రతిపక్షం వ్యతిరేకించినప్పటికీ ఈ ఒప్పందాన్ని ఆపలేవు. ఎందుకంటే ఈ ఒప్పందాన్ని ఆపే హక్కు పార్లమెంటుకు లేదు. రాజ్యాంగం ప్రకారం విదేశాలతో ఎటువంటి ఒప్పందం చేసుకునే హక్కయినా ప్రభుత్వానికి వుంది. కనుక ఈ విషయంపై పార్లమెంటులో ఉత్త చర్చే తప్ప ఓటింగ్ ఉండదు. అయితే ఒప్పందాన్ని ఆపాలని వామపక్షాలు గట్టిగా నిశ్చయించుకుంటే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడం ద్వారా ఆ పని చేయవచ్చు. కానీ మద్దతు ఉపసంహరించుకోవడానికి అవి సిద్ధపడలేదు. ఎందుకంటే మళ్లీ ఎన్నికల బరిలోకి వెళ్తే, ఇటీవల 'సింగూర్', 'నందిగ్రామ్'లతో బద్‌నామ్ అయివున్న సి.పి.ఎంకు ప్రస్తుతం వున్న సీట్లను కూడా దక్కించుకోగలను అనే నమ్మకం లేదు. కాబట్టి వామపక్షాలు తమ వ్యతిరేకతను కేవలం మాటలకే పరిమితం చేశాయి.

ఈ ఒప్పందాన్ని రాజకీయ పక్షాలే కాకుండా భారత శాస్త్రజ్ఞులు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఒప్పందం తమ స్వాతంత్ర్యాన్ని ఆటంకపరుస్తుందని వారు వాదిస్తున్నారు.

"ఇంతటి అసంబద్ధమైన, ప్రమాదకరమైన అంశాలను ఒప్పందంలో చేర్చడానికి ప్రధాని సహా భారత ప్రతినిధులంతా ఎలా అంగీకరించారో ఎవరికీ అర్థం కావడం లేదు'' అని బాబా అణుపరిశోధన కేంద్ర మాజీ డైరెక్టర్ అన్నారు.

'అత్యాధునిక సాంకేతికతను అందిస్తామనే హామీ నెరవేరుతుందనే ఆశ ఈ ఒప్పందంలోని ఏ నిబంధన వల్లా కలగడం లేదు. అమెరికా అణు పరిశ్రమ గత రెండు దశాబ్దాలలో ఒక్క అణు విద్యుత్కేంద్రాన్ని కూడా నిర్మించలేదు. వాస్తవానికి ఈ విషయంలో మనమే వారికి తోడ్పడగల స్థితిలో ఉన్నాం' అని అణుశక్తి కమీషన్ మాజీ ఛైర్మన్ అన్నారు.

వామపక్షాలూ, ప్రతిపక్షాలూ, శాస్త్రజ్ఞులు ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఈ ఒప్పందానికి బలంగా కట్టుబడి వుంది. అందుకే మన్మోహన్, వామపక్షాలను 'మద్దతు ఉపసంహరించుకుంటే ఉపసంహరించుకోండి' అనగలిగాడు. సోనియా సైతం మధ్యంతరానికి సిద్ధమని చెప్పింది. హర్యానాలోని జజ్జార్ జిల్లాలో ఆమె అణుశక్తి ఒప్పందం పట్ల తమ నిశ్చయాన్ని ప్రకటిస్తూ వామపక్షాలను దుమ్మెత్తి పోసింది. సోనియా వ్యాఖ్యలతో ఇక మధ్యంతర ఎన్నికలు తప్పవనే వాతావరణం వచ్చేసింది. అయితే అణు ఒప్పందానికి ఇంతగా కట్టుబడి వున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా లేదు. మధ్యంతరానికి సిద్ధమని పైకి ఎన్ని గాంభీర్య ప్రకటనలు చేసినా లోలోపల దానికి ఎన్నికలకు వెళ్లాలంటే భయంగా వుంది. ఎన్నికలు జరిగితే వామపక్షాలు నష్టపోతాయని కాంగ్రెస్ నష్టపోయేది ఏం లేదని చెప్తున్న సర్వేలేవీ దానికి ధైర్యాన్ని ఇవ్వడం లేదు. అందుకే అది ఒక అడుగు వెనక్కి వేయక తప్పలేదు. అందుకే తాజాగా అది అణు ఒప్పంద అమలును వాయిదా వేసుకుంది.

అయితే వాయిదా వేసినంత మాత్రాన కాంగ్రెస్ ఒప్పందం నుండి ఏమీ వెనక్కి పోవడంలేదు. ఒప్పందంపై ఏకాభిప్రాయ సాధనకై ప్రయత్నిస్తానని చెప్తోంది. అంటే ఇప్పటికీ కాంగ్రెస్ అణుఒప్పందానికి గట్టిగా కట్టుబడే వుంది. కాంగ్రెస్ పార్టీ అణు ఒప్పందానికి ఇంత గట్టిగా కట్టుబడడం వెనుక భారత పాలకవర్గాల ప్రయోజనాలు కూడా ఉన్నాయి. భారత పాలకవర్గాలు దేశంలో అధికార మార్పిడి జరిగినప్పటి నుండీ సామ్రాజ్యవాదానికి దళారులుగా వ్యవహరిస్తూ తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నాయి. రాజీవ్ గాంధీ పాలన నుండి భారత పాలకవర్గాలు అమెరికా సామ్రాజ్యవాదం వైపుకు మొగ్గు చూపనారంభించాయి. క్రమంగా రోజు రోజుకూ అవి మరింత దాసోహం అంటున్నాయి.

మన్మోహన్ పాలనలో వాటి దళారీ తనం మరింతగా పెరిగింది. అమెరికా కనుసన్నలలో మంత్రివర్గంలో మార్పులు చేసేంత ప్రమాదస్థాయికి పెరిగింది. ఇప్పుడీ అణు ఒప్పందానికి లోబడడం ద్వారా పాలకవర్గాల దాసోహ చర్య పరాకాష్టకు చేరింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా నుండి పొందే ప్రయోజనాలే కాక భారత పాలకవర్గాలకు మరికొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. భారత్ ఇప్పటికే తన విస్తరణ కాంక్షలో భాగంగా దక్షిణాసియా దేశాలపై ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇప్పుడు అణుశక్తి పేరుతో దాని ఆధిపత్యాన్ని మరింతగా పెంచుతుంది.

తమ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం అమెరికా సామ్రాజ్యవాదానికి రోజు రోజుకూ దాసోహం అంటున్న భారత పాలకవర్గాలకు వ్యతిరేకంగా పోరాడాలి. దేశ సార్వభౌమత్వానికి హానిచేసే అణు ఒప్పందం రద్దుకూ. భారత దేశంలోని అన్ని రంగాలను కబలించడమే గాక, అణు కార్యక్రమంలోనూ జోక్యం చేసుకుంటున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగానూ పోరాడాలి. ★

**"ఒక బలీయమైన రాజకీయ సంస్థకు చక్కని రాజకీయ శిక్షణ గరపాలంటే విస్తృతంగా వెలువడే, నిర్మాణయుతంగా పంచబడే మంచి పత్రిక ద్వారా తప్ప వేరే మార్గం లేదు." - లెనిన్**

# దోపిడీ వర్గాల్లో భయాందోళనలు నింపిన 'వాకాడు' ఘటన

ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్స్‌ను అణచివేశామని విర్రవీగిన రాష్ట్ర ప్రభుత్వమూ, ఆంధ్రప్రదేశ్‌ను నమూనాగా తీసుకొని దేశవ్యాప్తంగా నక్సల్స్‌ను అణచివేయగలమనే భరోసాతో వున్న కేంద్ర ప్రభుత్వమూ వాకాడు వద్ద పి.ఎల్.జి.ఎ కొట్టిన దెబ్బకు ఉలిక్కిపడ్డాయి.

సెప్టెంబర్ 7వ తేదీన నెల్లూరు జిల్లా వాకాడు సమీపంలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర మంత్రి రాజ్యలక్ష్మి ప్రయాణిస్తోన్న వాహనాన్ని పేల్చాలని పి.ఎల్.జి.ఎ సభ్యులు ప్రయత్నించారు. అయితే ఈ దాడి నుండి ఇద్దరూ తృటిలో తప్పించుకున్నారు.

నక్సలైట్లతో చర్చలు జరుపుతామనీ, రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పుతామనీ వాగ్దానం చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల బరిలోకి దిగి ఓట్లు అడుక్కున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చర్చల పేరిట ప్రజలను మోసం చేసింది. ప్రజల ఆకాంక్షలను పరిహసించింది. విప్లవోద్యమంపై తీవ్ర అణచివేతను ప్రయోగిస్తోంది. వై.ఎస్.ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండీ కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ బి.కె, ప్రసాద్‌లనూ, రాష్ట్ర కమిటీ సభ్యులైన కామ్రేడ్స్ మాధవ్, శ్రీధర్, సత్యం, రాఘవులు, గౌతం, సోమన్నలనూ, జిల్లా కమిటీ సభ్యులైన కడారి రాములూ, కరుణా, సురేష్, పద్మ మధులతో పాటు మరెందరో ఎ.సి స్థాయి కామ్రేడ్స్‌నూ, దళ సభ్యులనూ సానుభూతి పరులనూ, ఎ.పి ఎస్.ఐ.బి, ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు హత్య చేసాయి. వీరిలో అధికులను ప్రాణాలతో పట్టుకొని చిత్రహింసలు పెట్టి హత్య చేశారు. అంతేకాదు నల్లదండు ముఠాలతో పలువురు ప్రజా సంఘాల నాయకులను కూడా ఈ ప్రభుత్వం హత్య చేయించింది. మొత్తంగా రాష్ట్రంలో ఒక బీభత్స, భయానక వాతావరణాన్ని సృష్టించింది.

అమెరికా సామ్రాజ్యవాదానికి రోజు రోజుకూ మరింతగా ఊడిగం చేస్తూ, భారతపాలక వర్గాలు తమ ప్రయోజనాలను నెరవేర్చుకుంటున్నాయి. అందులో భాగంగా తమ ప్రయోజనాలకు ఆటంకంగా ఉన్న విప్లవోద్యమంపై, సామ్రాజ్యవాదపు సహకారంతో అమలు చేస్తున్న ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా బహుముఖ దాడికి పాల్పడుతున్నాయి. అందులో భాగంగానే ఎందరో విప్లవకారులపై హత్యాకాండకు పాల్పడుతున్నాయి.

ఇలా ఆంధ్రప్రదేశ్‌లో పాశవిక హత్యాకాండకు పాల్పడుతున్న ప్రభుత్వం తాను సమర్థవంతంగా మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేశానని విర్రవీగుతోంది. విప్లవోద్యమం బలంగా ఉన్న అన్ని రాష్ట్రాలకూ తమ నమూనా ఆచరణీయమని గొప్పలు చెప్పుకుంటోంది. అంతేగాక జె.ఒ.సిలో చురుకైన పాత్ర వహిస్తోంది.

ఇలా దాని అణచివేత విధానాల వల్ల కాంగ్రెస్ పార్టీ విప్లవోద్యమానికి టార్గెట్‌గా ఉంది. అందులో భాగంగానే కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు కూడా అయిన జనార్దన్ రెడ్డినీ, ఆయన భార్య రాష్ట్ర మంత్రి కూడా అయిన రాజ్యలక్ష్మినీ పి.ఎల్.జి.ఎ లక్ష్యంగా ఎంచుకుంది.

జనార్దన్ రెడ్డి అత్యంత క్రూరుడు. చెన్నారెడ్డిని పదవి నుంచి దించి తాను అధికారంలోకి రావడం కోసం హైదరాబాద్‌లో మత కల్లోహాలను సృష్టించి వందలాది అమాయక ప్రజల మరణాలకు కారకుడయ్యాడు. ఆ సందర్భంగా కొద్ది రోజుల పాటు రాష్ట్రంలో, ముఖ్యంగా హైదరాబాద్ నగర ప్రజల్లో తీవ్ర అభద్రతను రేకెత్తించాడు. అధికారంలోకి వచ్చిన తర్వాత విప్లవోద్యమంపై ఉక్కుపాదాన్ని మోపాడు. తెలంగాణ పల్లెలపై బి.ఎస్.ఎఫ్‌ను దించాడు. నక్సలైట్ అనే ముసుగు వేసి ఎందరో సానుభూతిపరులను హత్య చేయించాడు. అంతేగాక రాష్ట్రంలో మొదటిసారి నాటి పీపుల్స్‌వార్ పార్టీపై నిషేధం విధించాడు. రాజ్యలక్ష్మి ప్రస్తుతం చురుకైన క్యాబినెట్ మంత్రిగా వుంటూ అణచివేతలో భాగం పంచుకుంటోంది. అందుకే వీరిద్దరూ విప్లవోద్యమ లక్ష్యాలయ్యారు.

ఈ దాడి నుంచి వీరిద్దరూ బయటపడ్డప్పటికీ ప్రజా వ్యతిరేకులైన అధికార పార్టీ నేతల్లో ఈ దాడి తీవ్ర భయాందోళనలు రేపింది. తాము పెంచి పోషిస్తోన్న పోలీసు వ్యవస్థ, ఇంటెలిజెన్సీ, జడ్ కేటగిరీలూ ఏవీ ప్రజాగ్రహం ముందు తమను కాపాడలేవనే నిజం వారిని మరోసారి వణికించింది.

అదే సమయంలో విప్లవ శిబిరంలో ఈ ఘటన తీవ్ర ఉత్సాహాన్ని రేపింది. విప్లవ శక్తులు క్రియాశీలకంగా వ్యవహరిస్తే, ఎంతటి అననుకూల పరిస్థితిలోనైనా అనుకూలతలూ, విజయాలూ సాధించగలవనే విశ్వాసాన్ని మరోసారి ఇచ్చిందీ ఘటన. అత్యంత కట్టుదిట్టమైన భద్రతను సైతం ఛేదించవచ్చనీ, ఆ 'అత్యంత కట్టుదిట్టమైన భద్రత'లో సైతం క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే అనేక బలహీనాంశాలు విప్లవకారులకు లభిస్తాయని కూడా ఈ సంఘటన అర్థం చేయించింది.

ఈ మధ్య కాలంలో ప్రభుత్వ తీవ్ర అణచివేతలో తమ నాయకత్వాన్ని కోల్పోతూ కసితో రగులుతున్న విప్లవ ప్రజానీకాన్ని సైతం ఈ ఘటన ఉత్సాహపరిచింది.

విప్లవకారులనూ, ప్రజలనూ ఇంతగా ఉత్సాహపరిచినట్టి ఈ ఘటనలో భాగస్వాములైన సాహస గెరిల్లాలకు విప్లవ జేజేలు చెపుదాం. ఈ దాడి స్ఫూర్తితో మరెన్నో దాడులను విజయవంతం చేద్దాం.

★

కరపత్రం

# మల్కాన్‌గిరి వికాస్ పరిషత్ పోలీసుల సృష్టే!

## విప్లవోద్యమంపై పోలీసుల బహుముఖ దాడిని ప్రతిఘటిద్దాం! దుష్ప్రచారాన్ని ఎండగడదాం!

*('మల్కాన్‌గిరి వికాస్ పరిషత్' పేరుతో ఎ.ఒ.బిలోని మల్కాన్‌గిరి జిల్లాలో పోలీసులు ఒక పెద్ద పోస్టర్‌ను వేసారు. ఈ పోస్టర్ ద్వారా మావోయిస్టు ఉద్యమంపై విష ప్రచారానికి పాల్పడ్డారు. ఈ పోస్టర్‌ను ఖండిస్తూ జవాబుగా ఎ.ఒ.బి. ఎస్.జడ్.సి వివరమైన కరపత్రం వేసి, ప్రచారం చేసింది. ఆ కరపత్రాన్ని ఇక్కడ యథాతథంగా ప్రచురిస్తున్నాం - సంపాదకవర్గం)*

***ప్రియమైన ప్రజలారా!***

2007 ఏప్రిల్‌లో 'మల్కాన్‌గిరి వికాస్ పరిషత్' పేర మా పార్టీపై పోలీసులు దుష్ప్రచార యుద్ధం ప్రారంభించారు. 'మల్కాన్‌గిరి వికాస్ పరిషత్' సంస్థ పోలీసుల సృష్టే! మేము అభివృద్ధి నిరోధకులమని హింసావాదులమని, విలాసవంతమైన జీవితం గడుపుతామని, పెద్ద పోస్టరు వేసి ప్రచారం చేసారు. పోస్టరులో మల్కాన్‌గిరి జిల్లా అభివృద్ధికి మేము ఏం చేశామని ప్రశ్నిస్తూ, ప్రజలను తుపాకులు, మైన్స్‌తో భయపెట్టి హింసావాదులుగా తయారు చేస్తున్నామనీ, ఆదివాసీలను, సాధారణ ప్రజలను ప్రజాకోర్టులపేర చంపివేస్తున్నామనీ విష ప్రచారం చేశారు. ఈ దోపిడీ వ్యవస్థను కూల్చి ప్రజా రాజకీయాధికారం కోసం సాయుధ పోరాటాన్ని చేస్తోంది మా పార్టీ. మా పోరాటాన్ని భౌతిక హింస ద్వారా అణచివేయడాన్ని ప్రధానంగా ఎంచుకున్నప్పటికీ, మా పార్టీపై, ప్రజా ఉద్యమాలపై దుష్ప్రచారాన్ని ఒక సాధనంగా వాడుకుంటోంది ప్రభుత్వమూ పోలీసు వ్యవస్థ. ఆ ప్రచారంలో భాగమే మల్కాన్‌గిరి వికాస్ పరిషత్ పోస్టర్ల యుద్ధం. ఈ పోస్టరులో 'రాష్ట్ర జిల్లా అభివృద్ధి గురించి ఆలోచించండి' అంటూ 'మావోయిస్టులు మీకు ఏమి అభివృద్ధి చేసారు' అంటూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని మేము అడ్డగిస్తున్నామనీ అందువలన జిల్లా వెనుకబడి వుందని రాశారు ఈ పోస్టరులో మమ్మల్ని బాధ్యులను చేసిన వాటికి అంశాల వారిగా సమాధానం చెప్పే ముందు, ఒరిస్సా రాష్ట్ర పరిస్థితిని మీ ముందుంచుతాం.

60 ఏళ్ల 'స్వతంత్ర' భారతావనిలో ప్రజల సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదు. దేశంలోనే, ఒరిస్సా రాష్ట్రంలో పుష్కలంగా ఖనిజ సంపద దొరుకుతుంది. అపారమైన జలసంపద, విశాలమైన అటవీ ప్రాంతాలు వున్నాయి. అయినా ఒరిస్సా దేశంలోనే వెనుక బడిన రాష్ట్రం. ఇక్కడ ప్రధానంగా జల విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ తయారీ తర్వాత వచ్చే నీటిని కెనాల్స్ ద్వారా పంట పొలాలకు వదులుతున్నారు. అంతే కానీ వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం కల్పించిన నీటి పారుదల వసతులు పెద్దగా లేవు. అలాగే చెరువులు, కుంటలు, బోర్ల లాంటి ప్రత్యామ్నాయ నీటి వనరులూ లేవు. ఫలితంగా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందలేదు. పారిశ్రామిక రంగం అంటే ప్రభుత్వ రంగంలో వున్న పరిశ్రమలు అతి తక్కువ. ఉన్న వాటిని కూడా ప్రభుత్వం దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు తెగనమ్మే ప్రయత్నాలు చేస్తున్నది. రాష్ట్రంలో లభించే ఖనిజ సంపద (ఇనుము, బాక్సైట్)ను అమ్మడానికి బహుళజాతి కంపెనీలు, దళారీ పెట్టుబడిదారులతో ప్రభుత్వం 57 ఒప్పందాలు చేసుకున్నది. కళింగనగర్ అటవీ ప్రాంతాన్నంతా పారిశ్రామిక ప్రాంతంగా ప్రకటించి అక్కడి ఆదివాసీలను నిర్వాసితులను చేస్తోంది. వారి భూములను అతి తక్కువ ధరకు కొని పెట్టుబడిదారులకు అధిక ధరలకు అమ్మి దళారీ వ్యాపారం చేస్తోందీ ప్రభుత్వం. పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల స్థాపనతో ఉద్యోగాలు పెరుగుతాయని భ్రమలు పెడుతోంది. నాల్కోలో ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో అక్కడి నిర్వాసితులకు ప్రత్యక్ష అనుభవమే. తమ ఖనిజ సంపదను దోచుకోవడాన్నీ, సామ్రాజ్యవాదులు పరిశ్రమలు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కాశీపూర్, కళింగనగర్, చిలక సరస్సు నిర్వాసితులు పోరాడితే, ఆ ప్రజా సమూహాలపై కాల్పులు జరిపి మొత్తం 26 మందిని చంపింది. కె.బి.కె (కోరాపుట్, బొలంగిర్, కలహండి జిల్లాలను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన) పథకం కింద వేలాది కోట్ల నిధులు విడుదల చేసింది. కానీ అక్కడి అభివృద్ధి కాగితాలపై వుంటే, నిధులు బడా రాజకీయ నాయకులూ, కాంట్రాక్టర్ల జేబులోకి చేరిపోయాయి. కె.బి.కెలోని కలహండి జిల్లా కరువుకు ప్రసిద్ధి. కలహండి జిల్లా కాశీపూర్‌లో ఆకలితో ప్రజలు చనిపోతున్న విషయం రాష్ట్ర ప్రజలుగా మీకందరికీ తెలిసిందే మౌలిక సదుపాయాలైన కరెంటు, రోడ్లు, రేషన్ కార్డులు, విద్య, వైద్యం పరిస్థితి చూస్తే రోడ్లపై పెట్టిన శ్రద్ధ మరే ఇతర వాటిపై పెట్టడం లేదు. రాష్ట్రంలో బలిమెల, మాచ్‌ఖండ్, కొలాబ్ ఇంకా ఇతర ప్రాజెక్టులలో తయారయ్యే జల విద్యుత్ ఆదివాసీ గ్రామాల నుండి పెద్ద పట్టణాలకు, పారిశ్రామిక ప్రాంతాలకు తరలిపోతున్నది. ఈ ప్రాజెక్టులను ఆనుకొని వున్న ఆదివాసీ గ్రామాలు మాత్రం నేటికీ చీకటిలో మగ్గిపోతున్నాయి. విద్య, వైద్యం, ప్రయివేటీకరించబడుతూ సాధారణ ప్రజలకు అందనంత దూరం పరుగులు తీస్తోంది. ఇది స్థూలంగా ఒరిస్సా రాష్ట్ర వాస్తవ పరిస్థితి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా, రాష్ట్రాన్ని సామ్రాజ్యవాదులకూ, భూస్వాములకూ, దళారీ పెట్టుబడిదారులకు అమ్మటంలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడుతూ, మమ్మల్ని అభివృద్ధి నిరోధకులుగా, హింసావాదులుగా ముద్రవేస్తున్నది. అసలు అభివృద్ధి అంటే ఏమిటి? ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేదే అభివృద్ధి. కానీ నేడు పాలకులు చేస్తోన్న అభివృద్ధి సామ్రాజ్యవాదులకూ, భూస్వాములకూ, దళారీ పెట్టుబడిదారులకు సంబంధించిన అభివృద్ధి. ఇదంతా ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా రాజ్యమేలుతున్న నయా ఉదారీకరణ ఫలితమే. రాష్ట్రం ఇంతగా వెనుకబడి వుండడం మూలంగా దారిద్ర్యరేఖకు దిగువన అడుగంటుతున్న జీవన ప్రమాణాలతో జీవిస్తున్న ప్రజలు, సహజంగానే మా పార్టీ విధానాలు, త్యాగాలు, మా లక్ష్యం

వైపు ఆకర్షితులై మా ఉద్యమాలలో భాగమై ప్రజా రాజ్యాధికారానికై సాయుధ మార్గంలో ప్రయాణిస్తున్నారు. మా పార్టీ నాయకత్వంలోని ప్రజావిముక్తి గెరిల్లా సైన్యంలో చేరి పోలీసుల అణచివేతను సాయుధంగానే తిప్పికొడుతున్నారు. వాస్తవం ఇదైతే మేము హింసావాదులమనీ, తుపాకులూ, తూటాలూ, ల్యాండ్‌మైన్స్‌తో ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నామని ప్రభుత్వం మాపై అబద్ధపు ప్రచారానికి పూనుకొంది. నిజానికి తుపాకులూ, తూటాలతో ఏ ఉద్యమాలకైనా సమాధానం చెపుతున్నది ప్రభుత్వమే, పోలీసులే! ఫిబ్రవరిలో జరిగిన పంచాయితీ ఎన్నికల సందర్భంగా మా మిలీషియా సభ్యులు దేవాల్, భీమాల్‌లను నిరాయుధంగా పట్టుకొని అతి కిరాతకంగా పోలీసులు కాల్చి చంపారు.

మేము బాలలను స్కూలుకు వెళ్లనీయకుండా వారిని బాలల సంఘంలో పెట్టి పార్టీ కార్యక్రమాలలో ఉపయోగించుకుంటున్నామని మరో ఆరోపణ. నేడు సాధారణ ప్రజల ఆర్థిక పరిస్థితులు చాలా అధ్వాన్నంగా వున్నాయి. అటువంటి పరిస్థితులలో ఎన్ని కుటుంబాలు తమ పిల్లలను స్కూలుకు పంపించగలుగుతాయి? దేశంలోని నేటి బాలకార్మిక వ్యవస్థ చిన్న పిల్లలపై పడుతున్న కుటుంబ భారానికి అద్దం పడుతుంది. ప్రభుత్వం బాలలందరికీ విద్య పేరుతో రకరకాల పథకాలు ప్రవేశపెట్టింది. కానీ బాలల విద్య మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిపోయింది. బాలల విద్య పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధిని ప్రదర్శించని ప్రభుత్వాలు ఆ దోషాన్ని తల్లిదండ్రులపై నెడుతున్నాయి. మా ఉద్యమ ప్రాంతాల్లో మాపై నెడుతున్నాయి. నిజానికి ఒరిస్సాలో నేటికీ పాఠశాలలు లేని గ్రామాలు ఎన్నో వున్నాయి. పాఠశాలలు ఉన్న గ్రామాలలో టీచర్లు సరిగా రాకపోవడంతో పిల్లల విద్య గగన కుసుమంగా మారింది. ప్రభుత్వం టీచర్ల రిక్రూట్‌మెంట్ ఆపేసింది. ప్రభుత్వ పాఠశాలలను దివాళా తీయిస్తూ విద్యను ప్రయివేటుపరం చేస్తున్నది. ఈ పరిస్థితులలో బాలలు తమ భవిష్యత్ నూతన ప్రజాస్వామిక విప్లవంలో ముడిపడి వుందని గ్రహించి రాడికల్ బాలల సంఘంలో చేరి పని చేస్తున్నారు. పాఠశాలలో చదువుకునే విద్యార్థులు వసతులకై పోరాడుతున్నారు. ప్రభుత్వం హాస్పిటల్, స్కూలు పేర గ్రామాలలో పక్కా భవనాలను నిర్మిస్తోంది. ఇందులో ప్రజలకు వైద్యం, విద్య అందించడం ఏమీ వుండదు. భవిష్యత్‌లో వాటిని పోలీస్ స్టేషన్లుగా ఉపయోగించుకుంటారు. ఇప్పటికే ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్‌లలో పోలీసులు ఈ విధంగా ఉపయోగించుకుంటున్నారు. ఈ రోజు ప్రభుత్వాలు రోడ్ల నిర్మాణానికి ఇచ్చిన ప్రాముఖ్యత మరేదానికి ఇవ్వడం లేదు. ప్రపంచ బ్యాంకు షరతులలో భాగంగా ఈ రోడ్ల నిర్మాణం సాగుతున్నది. దేశ వ్యాప్తంగా రోడ్లను అభివృద్ధి చేయాలని గ్రామీణ సడక్ యోజన పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించింది కేంద్ర ప్రభుత్వం. రోడ్ల ద్వారా ఆదివాసీ జీవితాలలో అభివృద్ధి వస్తుందనీ, రోడ్లు లేని గ్రామాలు అభివృద్ధి చెందవనీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఇంతకీ ఈ రోడ్లు ప్రజల జీవితాలలో నింపిన అభివృద్ధిని చూద్దాం. ఈ రోడ్లకై విడుదలవుతున్న నిధులలో 50 శాతం పైగా ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్ల జేబులలోకే పోతాయనే వాస్తవం మీకందరికీ తెలిసిందే. ఈ పనులలో ఆదివాసీలతో రోజు కూలీకన్నా తక్కువ ఇచ్చి పని చేయించుకుంటున్నది ప్రభుత్వం. రోడ్లు వేసిన గ్రామాలలో ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగైనాయా? అంటే నేటికీ వందలాది గ్రామాల ప్రజలు తమ దినుసులను 4,5 గంటలు నడిచి వారాంతపు సంతల నుండి మోసుకువస్తూనే వున్నారు. మరి వారి జీవితాలలో రోడ్లు తెచ్చిన అభివృద్ధి ఏమిటి? ఇక్కడ దొరికే కలప, వెదురు, తదితర దోచుకున్న సంపదను పట్టణాలకు చేర్చడానికీ, ఉద్యమ ప్రాంతాలలో మా సమాచారం అందుకుని వాహనాలలో వచ్చి మమ్మల్ని దెబ్బతీయటానికే ఈ రోడ్లు. ప్రజలకు ఎటువంటి ఉపయోగంలేని రోడ్లను మేము వ్యతిరేకిస్తున్నాం. రోడ్లు వున్న గ్రామాలకు కూడా విద్యుత్ లేదు. రేషన్ కార్డులు లేవు ఎందుకో ప్రభుత్వమే చెప్పాలి.

మేము ప్రజల తాగు నీటికి వేసే బోరింగ్‌లను వ్యతిరేకించడం లేదు. వేసవి కాలంలో చాలా గ్రామాలు తీవ్ర మంచినీటి ఎద్దడి ఎదుర్కొంటున్నాయి. ప్రజల తాగునీటి కల్పనకై ప్రజలను కదిలించి పోరాటాలు చేయిస్తుంది మా పార్టీ. కొన్ని గ్రామాలలో ప్రజా సంక్షేమంలో భాగంగా మా పార్టీ సహకారంతో ప్రజలు సమిష్టిగా శ్రమ చేసి చెరువులు తవ్వుకుంటున్నారు. నీళ్ల కుండీలు నిర్మించుకుంటున్నారు. కాబట్టి మేం బోరింగ్‌లను వ్యతిరేకిస్తున్నామని చేసే ప్రచారం ఎంత హాస్యాస్పదమో ఆలోచించండి.

ఏ ప్రభుత్వమైనా ప్రజా ఉద్యమంలో, విముక్తి ఉద్యమాలలో భాగమవుతున్న మహిళలను అరెస్టులు చేయడం, చిత్రహింసలు పెట్టడం, లైంగికంగా వేధించడం, అత్యాచారాలు చేయడం మాత్రమే కాకుండా, నిరాయుధంగా పట్టుకొని ఎన్‌కౌంటర్ల పేర కాల్చి చంపుతున్నది. మరోవైపు లైంగికంగా 'చెడిపోయిన' వారిగా ముద్ర వేసి వారిపై మానసిక యుద్ధం చేస్తున్నది. మహిళల వ్యక్తిత్వంను గౌరవిస్తూ, పురుషులతో సమానమైనవారుగా గుర్తించి వారి సమస్యల పరిష్కారానికి నిజాయితీగా పని చేసే మా పార్టీ పట్ల పెద్ద మొత్తంలో మహిళలు ఆకర్షించబడుతున్నారు. ఉద్యమంలో భాగమవుతున్నారు. మా ఉద్యమంలోకి మహిళలు రాకుండా చెయ్యడానికి మా పార్టీలోని పురుషులు మహిళలను లైంగికంగా ఉపయోగించుకుని, వారి సిగ్గు తీస్తున్నారని తప్పుడు ప్రచారం చేశారు. మా పార్టీ నైతికతపై బురదజల్లే ప్రయత్నమే ఇది.

ఆదివాసీల అడవి, ఖనిజ, జల సంపదలను అమ్మివేయడానికి, అడవిపై వారికి గల హక్కులను క్రమంగా నిరాకరిస్తూ రాజ్యాంగం కల్పించిన అటవీ స్వయం ప్రతిపత్తికి తూట్లు పొడిచి వారిని నిరాశ్రయులుగా మారుస్తున్నది ప్రభుత్వం. తమ హక్కుల సాధనకై, తమ సంపదలను కాపాడుకోవడానికై ఆదివాసీలు పోరాడుతుంటే, మరోవైపు ఆదివాసీలకు ఉపాధికల్పన పేర ఆదివాసీలలోని ఒక సెక్షన్ ప్రజలను చీల్చి, ఉద్యోగాలు ఇస్తూ మేము మాత్రమే వారిని అభివృద్ధి చేస్తున్నామని ప్రచారం చేస్తున్నది. ఆదివాసీలకు పోలీసు ఉద్యోగాలు తప్ప ఇతర ఉద్యోగాలు ఏ మేరకు కల్పించింది? ఉద్యోగాలలో ఆదివాసీల శాతం ఎంత? అంటే చాలా తక్కువ.

ప్రజా ఉద్యమాలను అణచడానికి ఎ.పిలో గిరిజన బెటాలియన్‌ను ఏర్పరిచింది. దండకారణ్యంలో మావోవాదులను తరిమికొట్టడం పేరుతో ప్రారంభించిన సల్వాజుడూంలో ఆదివాసీలలోని పై స్థాయి వారిని ఎస్.పి.ఒలుగా నియమించింది. ఒరిస్సాలో కూడా పోలీసు ఉద్యోగాలలోకి ఆదివాసీలను భర్తీ చేయడానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. కాబట్టి ఆదివాసీలను బానిసలుగా మార్చే పోలీస్ శాఖ కుట్రలకు మోసపోకండి. పోలీసులుగా, హోంగార్డులుగా, చౌకీదారులుగా భర్తీ కాకండి. ప్రజలకు శత్రువులుగా మారకండి అని ప్రజలకు మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

ప్రజా కోర్టులలో ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ఒరిస్సాలోని న్యాయ వ్యవస్థ ప్రజాస్వామికంగా ప్రజలకు కల్పించిన హక్కులను సైతం నిరాకరిస్తున్నది. ఇక్కడ ఆందోళనాకారులపై, సాధారణ ప్రజలపై తప్పుడు కేసులు బనాయించి బెయిల్ ఇవ్వకుండా ఏళ్ల తరబడి జైళ్లలో నిర్బంధిస్తున్నది. కోర్టులలో న్యాయం ధనికుల తలుపు తడుతుందని ప్రజలు ఆచరణలో తెలుసుకున్నారు. కోర్టులలో న్యాయం ఏమోగానీ ఇల్లూ, ఒళ్లు రెండూ గుల్లయి యేళ్ల తరబడి తిరగటం జరుగుతున్నది తప్ప ప్రయోజనం శూన్యం.

ప్రజలలో కృత్రిమ అసమానతలు సృష్టించటానికి బెంగాలీలలోని వ్యాపార వర్గాన్ని, ఉన్నత వర్గం టేకేదారులను ఆదివాసులకు వ్యతిరేకంగా నిలబెడుతున్నది. పైగా బెంగాలీలకు ఆదివాసీలకు విభేదాలు సృష్టిస్తున్నామని మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నది. దోపిడీదారులకు వ్యతిరేకమైన మా ఉద్యమం సహజంగానే బెంగాలీలలోని దోపిడీదారులకు కూడా వ్యతిరేకమే. వారికి వ్యతిరేకంగా బెంగాలీలలోని పేదలనూ, ఆదివాసీలను ఐక్యం చేయడం మా లక్ష్యం. అందుకని మొత్తంగా బెంగాలీలకు మేం వ్యతిరేకం కాదని గుర్తించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాం.

అభివృద్ధి కార్యక్రమాలకు వస్తున్న నిధులను టేకేదారులు, అధికార యంత్రాంగం, రాజకీయ నాయకులు, 'గుటకాయ స్వాహా' చేస్తున్నారు. కింది నుండి పై స్థాయి వరకూ కుంభకోణాల చరిత్ర తప్ప నిజమైన అభివృద్ధి లేదు. ప్రజల సంక్షేమం కోసం, ప్రజల అభివృద్ధి కార్యక్రమాల కోసం, ఉద్యమ అవసరాల కోసం ప్రజల నుండీ, సానుభూతిపరుల నుండీ చందాలు వసూలు చేస్తున్నాం. దానిలో భాగంగా కాంట్రాక్టర్లకు పెనాల్టీలు వేస్తున్నాం. ప్రజల డబ్బులతో విలాసవంతమైన జీవితం గడిపేది ఎవరు? స్విస్ బ్యాంకులలో డబ్బు దాచేది ఎవరు? రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేది ఎవరు? అంతా ప్రజలందరికీ తెలుసు. బిశ్వనాథ్‌మాడి, కోసమాడి, దందపౌరా, తపస్‌పౌరా, పంచన్, నోజన్, సుభాష్ మొండాల్, సుభాష్ బిస్వాసో, నందోజన, బందు, బీహి మొదలైన వారందరినీ పోలీసులు వేలాది రూపాయలతో కొనివేసి ఉద్యమానికి వ్యతిరేకంగా నిలబెట్టి ఇన్‌ఫార్మర్‌లుగా మార్చారు. వాళ్ల ద్రోహం వల్ల ప్రజా ఉద్యమానికి, ప్రజలకు ఎంతో నష్టం జరిగింది. ప్రజల ముందు ఈ విషయాన్ని బహిర్గతం చేశాం. ప్రజలకు వ్యతిరేకంగా మారవద్దని, పోలీసుల కుట్రలకు బలికావద్దని హెచ్చరికలు చేసినా, మారకుండా ప్రజలకు ద్రోహం చేస్తుంటే ప్రజల తీర్పు అనుసరించి వారికి శిక్షలు వేసాం. దీనికి బాధ్యతపడాల్సింది ప్రభుత్వ యంత్రాంగమే.

స్థానిక సర్పంచ్‌లు, సెక్రటరీలు, ఇంకా ఇతర యంత్రాంగాన్ని వారి పనులు వారు చేసుకోకుండా అడ్డగిస్తున్నామని మరో ఆరోపణ. సర్పంచ్, సెక్రటరీ లాంటివారు ప్రజలకు బాధ్యతపడి వారి వృత్తి ధర్మాలను ఏదో ఒక మేరకు నిర్వహిస్తోంది మా ఉద్యమ ప్రాంతంలోనే. ఎందుకంటే ఇక్కడ ప్రజలలో పెరిగిన చైతన్యం వలన వారి పనులు వారు చేయకతప్పని పరిస్థితి.

ఈ రకంగా మాపై దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నారు? పోలీసులు మల్కన్‌గిరి వికాస్ పరిషత్ అవతారం ఎందుకు ఎత్తాల్సి వచ్చింది? అంటే, కేంద్ర ప్రభుత్వ నాయకత్వంలో వ్యూహాత్మకంగా అమలు జరుపబడుతున్న 'తక్కువ తీవ్రత గల ఘర్షణ యుద్ధం' (లో ఇంటెన్సిటీ వార్ కాన్‌ఫ్లిక్ట్)లో భాగమే ఇది. ఈ రోజు సామ్రాజ్యవాదం ప్రపంచ వ్యాప్తంగా విప్లవోద్యమాలను, జాతి విముక్తి పోరాటాలను అణచివేయడానికి ఈ ఎల్.ఐ.సిని రూపొందించింది. దాంట్లో సాయుధ అణచివేతతోపాటు దుష్ప్రచారం ద్వారా ప్రజలకు ప్రజా ఉద్యమాలపై విశ్వాసం సన్నగిల్లేటట్లు చేసి, ఉద్యమాలను నీరుగార్చడం అనే లక్ష్యం వుంది. అందుకనే ఈ దుష్ప్రచారానికి పోలీసు శాఖ 'మల్కన్‌గిరి వికాస్ పరిషత్' అవతారం ఎత్తింది. అందులో భాగంగానే ఇతర మా ఉద్యమ ప్రాంతాలలో ఇటువంటి ప్రచారం నిరంతరం కొనసాగిస్తున్నది.

అయితే ప్రజలు దీని వెనుక వున్న కుట్రను గ్రహించి, ఈ ప్రచార ప్రభావానికి లోను కాకుండా ప్రజా ఉద్యమాలలో క్రియాశీలకమైన పాత్ర పోషిస్తూ ప్రజా విముక్తికి బాటలు వేస్తున్నారు. పి.ఎల్.జి.ఎలో చేరి శత్రు నిర్బంధాన్ని సాయుధ ప్రతిఘటనతో ఎదుర్కొంటున్నారు.

ప్రజలకు, ప్రజాస్వామికవాదులకు!

మల్కన్‌గిరి వికాస్ పరిషత్ ప్రచారంలోని కుట్రను గ్రహించి, ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వమూ పోలీసులు చేస్తున్న క్రూరమైన అణచివేతదాడులను ఖండించాల్సిందిగా, ప్రజా ఉద్యమాలకు మద్దతు తెలియజేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**స్పెషల్ జోనల్ కమిటీ**
**ఆంధ్ర - ఒరిస్సా సరిహద్దు ప్రాంతం**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

*తేదీ: 15-05-2007*

సిద్ధాంత వ్యాసం

# పార్టీలో మూస పద్ధతి

ఈనాటి సమావేశ లక్ష్యం ఏమిటో కామ్రేడ్ కాయ్-ఫెంగ్ ఇపుడే చెప్పారు. స్వీయాత్మక ఒంటెత్తు ధోరణులు మూస పద్ధతి పార్టీ రచనల్ని (లేక పార్టీ "ఎనిమిది పాదాల వ్యాసం")* తమ ప్రచార సాధనాలుగా, భావ ప్రకటనా రూపాలుగా ఎలా వాడుకొంటున్నాయో ఇప్పుడు నేను చర్చిస్తాను, మనం స్వీయాత్మక ఒంటెత్తు ధోరణులకు వ్యతిరేకంగా పోరాడుతున్నాం. మనం గనక మూసపోత పార్టీ రచనా పద్ధతి నుండి బయటపడకపోతే అవి ఇంకా ఏదో ఒక మూల దాక్కొనే ఉంటాయి. మనం దీన్ని కూడా నాశనం చేయగల్గితే స్వీయాత్మక ఒంటెత్తు ధోరణులను అరికట్టగలం, ఈ రెండు 'రక్కసుల' నిజ స్వరూపాన్ని బట్టబయలు చెయ్యగలం. అపుడు "రోడ్డు మీద పరుగెడుతున్న ఎలుకల్ని చంపండి, చంపండి, అంటూ అందరూ వెంటపడినట్టు'' వీటిని తేలిగ్గా నిర్మూలించగలం.



ఒక వ్యక్తి తను చదువుకోవటం కోసం మాత్రమే మూసపోత పార్టీ రచనల్ని తయారు చేస్తే ఫర్వాలేదు. దాన్ని గనక ఇతరులకు అందించితే పాఠకుల సంఖ్య రెట్టింపవుతుంది. దీనివల్ల తక్కువ హానేమీ జరగదు. అతను ఆ రచనను గోడలకు అంటించినా, సైక్లోస్టయిల్ చేయించినా, పత్రికల్లో గానీ, పుస్తక రూపంలో గానీ ప్రచురించినా అది చాలా మందిని ప్రభావితం చేస్తుంది. తద్వారా సమస్య మరింత పెద్దదవుతుంది. పైగా ఇలాంటి మూస పద్ధతి రచనలు చేసేవాళ్లు పెద్ద సంఖ్యలో శ్రోతల్ని, పాఠకుల్ని కోరుకుంటారు. అందుకనే దాన్ని బట్టబయలు చేయడం, నాశనం చేయడం తప్పని సరి అవుతుంది.

అంతేకాదు, మూసపోత పార్టీ రచన "విదేశీ మూస పద్ధతి"లో ఒక తరహాకి చెందింది. లూసన్ చాలా కాలం క్రితమే దానిపై దాడి చేశాడు. అయితే దాన్ని మనం పార్టీ "ఎనిమిది పాదాల వ్యాసం" అని ఎందుకంటాం? ఎందుకంటే, దాంట్లో విదేశీ వాసనలేగాక స్వదేశీ వాసన కూడా వుంది. బహుశా దాన్ని కూడా ఒక రకమైన సృజనాత్మక రచనగా లెక్కవేయవచ్చేమో! మన ప్రజలు సృజనాత్మక రచనలు చేయలేదని ఎవరన్నారు? ఇది ఒక రకం కావచ్చు! (నవ్వులు).

మూసపోత పార్టీ రచనా పద్ధతికి మన పార్టీలో సుదీర్ఘ చరిత్ర వుంది. ప్రత్యేకించి వ్యవసాయక విప్లవ కాలంలో అది ఒకోసారి చాలా ఎక్కువైంది.

చారిత్రకంగా చూస్తే మూసపోత పార్టీ రచనా పద్ధతి మే నాలుగు ఉద్యమానికి ప్రతిచర్య.

మే నాలుగు ఉద్యమంలో ఆధునిక భావాలు కల్గిన ప్రజలు గ్రాంధిక చైనా భాషను వాడటాన్ని వ్యతిరేకించి, వ్యవహారిక భాషను ప్రవేశ పెట్టారు. వాళ్లు సాంప్రదాయక పిడివాదాన్ని వ్యతిరేకించి, శాస్త్రీయ విజ్ఞానాన్ని, ప్రజాస్వామ్య భావాలను ప్రచారం చేశారు. ఇదంతా సరైనదే. అప్పట్లో ఉద్యమం ఉధృతంగా, సజీవంగా, అభివృద్ధికరంగా, విప్లవాత్మకంగా వుంది. ఆ రోజుల్లో పాలకవర్గాలు విద్యార్థులకు కన్‌ఫూషియస్ బోధనలను ఎక్కించారు. వారు కన్‌ఫూషియస్ బోధనల జిలుగునంతా మత మౌఢ్యంగా గౌరవించేలా ప్రజల్ని ఒత్తిడి చేశారు. పైగా రచయితలందరూ గ్రాంధిక భాషనే వాడారు. క్లుప్తంగా చెప్పాలంటే పాలకవర్గాలూ, వారి తాబేదార్లూ చెప్పిందీ, రాసిందీ కూడా రూపంలోనూ, వస్తువులోనూ మూస పద్ధతి రచనా లక్షణం, పిడివాద లక్షణం కలిగి వుండేది. అది పాత మూస పద్ధతి, పాత పిడివాదం. ఈ పాత మూస పద్ధతి, పాత పిడివాదాల అసహ్యకర రూపాన్ని బహిరంగంగా ఎండగట్టి, వీటికి వ్యతిరేకంగా పోరాడమని ప్రజలకు పిలుపు ఇవ్వడమే మే 4 ఉద్యమం సాధించిన గొప్ప విజయం. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం కూడా ఆ ఉద్యమం సాధించిన గొప్ప విజయం. కానీ పాత మూస పద్ధతికి, పిడివాదానికి వ్యతిరేకంగా చేసిన పోరాటమే మే 4 ఉద్యమం సాధించిన విజయాల్లో గొప్ప విజయంగా నిలిచిపోయింది. ఆ తర్వాత విదేశీ మూస పద్ధతి, విదేశీ పిడివాదం తలెత్తాయి. మన పార్టీలోని కొంత మంది మార్క్సిజానికి వ్యతిరేకంగా విదేశీ మూస పద్ధతిని, పిడివాదాన్ని స్వీయాత్మక ఒంటెత్తు ధోరణిగా, మూస పద్ధతి పార్టీ రచనా విధానంగా అభివృద్ధి చేశారు. ఇవి కొత్త మూస పద్ధతులు, పిడివాదాలు. ఇవి మన కామ్రేడ్స్ మెదడుల్లో ఎంత గట్టిగా నాటుకుపోయాయంటే ఇప్పటికీ మనం వాళ్ల మనసుల్ని మార్చడానికి చాలా తీవ్రమైన ప్రయత్నం చేయాల్సి వస్తుంది. ఈ విధంగా, పాత భూస్వామ్య మూసరచనా పద్ధతికి, పిడివాదానికి వ్యతిరేకంగా పోరాడిన, సజీవమైన, శక్తివంతమైన, అభివృద్ధికరమైన, విప్లవాత్మకమైన మే 4 ఉద్యమాన్ని ఆ తర్వాత దాని లక్ష్యానికి పూర్తి భిన్నంగామార్చి, కొత్త మూస రచనా పద్ధతి, పిడివాదాలు తలెత్తాయి. ఈ కొత్త పద్ధతులు సజీవమైనవి, శక్తివంతమైనవి కావు. అవి మృతప్రాయం. అవి అభివృద్ధికరమూ, విప్లవాత్మకమైనవి కావు. అవి అభివృద్ధి నిరోధకమైనవి, విప్లవానికి ప్రతిబంధకాలూను. అంటే, విదేశీ మూస రచనా పద్ధతి, లేదా మూసపార్టీ రచనా పద్ధతి మే 4 ఉద్యమం అసలు స్వభావానికి ప్రతిచర్య. అయినా మే 4 ఉద్యమంలో కొన్ని బలహీనతలు ఉండనే ఉన్నాయి. నాయకత్వంలో చాలా మందికి మార్క్సిస్టు విమర్శనా దృక్పథం కొరవడింది. వాళ్లు సాధారణంగా బూర్జువా పద్ధతిని, అంటే లాంఛన ప్రాయమైన పద్ధతిని (ఫార్మలిస్టు మెథడ్) అనుసరించారు. వాళ్లు పాత మూస పద్ధతి, పాత పిడివాదాన్ని వ్యతిరేకిస్తూ, శాస్త్రీయ విజ్ఞానాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రచారం చేయడం సరైనదే. అయితే ప్రస్తుతం పరిస్థితులు, చరిత్ర, విదేశీ విషయాలతో వ్యవహరించేటపుడు వారిలో

# రచనలను వ్యతిరేకించండి

*ఫిబ్రవరి 8, 1942*

చారిత్రక భౌతికవాద విమర్శనా ధోరణి కొరవడింది. వాళ్లు తాము చెడు అనుకున్నదంతా పూర్తి చెడు అని, మంచి అనుకున్నదంతా పూర్తిగా మంచి అని భావించారు. సమస్యల పట్ల అవలంభించిన ఈ లాంఛనప్రాయమైన ధోరణి తదనంతర కాలంలో ఉద్యమ క్రమాన్ని దెబ్బతీసింది. దాని అభివృద్ధి క్రమంలోనే మే 4 ఉద్యమం రెండు ధోరణులుగా చీలింది. ఒకవర్గం దాని శాస్త్రీయ ప్రజాస్వామిక వారసత్వాన్ని స్వీకరించి, దాన్ని మార్క్సిస్టు సూత్రాల ప్రాతిపదికపై మార్చి వేసింది. కమ్యూనిస్టులు, కొందరు పార్టీయేతర మార్క్సిస్టులు ఇలా వ్యవహరించారు. మరో వర్గం బూర్జువా మార్గాన్ని చేపట్టింది. ఇది లాంఛనప్రాయమైన ధోరణి మితవాదం వైపుగా అభివృద్ధి చెందటాన్నే సూచిస్తుంది. అయితే కమ్యూనిస్టు పార్టీలో కూడా ఆంతరంగిక పరిస్థితి ఒకే రకంగా లేదు. అక్కడ కూడా కొంత మంది సభ్యులు పెడ ధోరణికి గురయ్యారు. మార్క్సిస్టు సిద్ధాంతం గురించి ఖచ్చితమైన అవగాహన లేకపోవడంచేత వారు లాంఛనప్రాయమైన ధోరణికి గురయ్యారు. అంటే వారు స్వీయాత్మకత, ఒంటెత్తు విధానం, మూసపోత పార్టీ రచనా పద్ధతి అనే పొరపాట్లకు గురయ్యారు. ఇది లాంఛన ప్రాయమైన ధోరణి అతివాదం వైపుగా అభివృద్ధి చెందటం అవుతుంది. అంటే ఇది యాదృచ్ఛికంగా జరిగింది కాదని, అది ఒక వంక మే 4 ఉద్యమంలోని ప్రతికూల అంశాలకు ప్రతిచర్య అని, మరోపక్క వారసత్వంగా వస్తున్న అననుకూల అంశాల కొనసాగింపు, అభివృద్ధి అని మనకు అర్థమవుతుంది. ఈ అంశాన్ని అర్థం చేసుకోవడం మనకు చాలా ఉపయోగం. మే 4 ఉద్యమ కాలంలో పాత మూసపద్ధతి, పిడివాదానికి వ్యతిరేకంగా పోరాడటం ఎంత విప్లవకరమో, అవసరమో, అదే విధంగా ఈ రోజున మార్క్సిజంపై ఆధారపడి కొత్త మూస పద్ధతిని, పిడివాదాన్ని విమర్శించడం కూడా అంతే విప్లవకరం, అవసరం. మే 4 ఉద్యమ దశలో పాత మూస పద్ధతికి, పిడివాదానికి వ్యతిరేకంగా పోరాటం జరుగక పోయి ఉంటే, వాటి బానిసత్వం నుండి చైనా ప్రజలు బయటపడి ఉండేవాళ్లే కాదు. చైనాకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల అవకాశం ఏమాత్రం ఉండేది కాదు. దీనికి సంబంధించిన కృషికి మే 4 ఉద్యమ కాలంలో ప్రారంభం మాత్రమే జరిగింది. పాత మూస పద్ధతి, పిడివాదాల ప్రాబల్యం నుండి ప్రజలు పూర్తిగా విముక్తి పొందాలంటే విప్లవ పంథాలో ప్రజల్ని మలిచే ప్రయత్నాన్ని ఇంకా పెద్ద ఎత్తున చేపట్టాలి. ఇప్పుడు గనక మనం కొత్త మూస రచనా పద్ధతిని, పిడివాదాన్ని వ్యతిరేకించకపోతే చైనా ప్రజల మనసులు మరో కోవకు చెందిన లాంఛనప్రాయమైన ధోరణికి లోబడిపోతాయి. ఇప్పటికే మన పార్టీ కార్యకర్తలు కొంతమందిలో (కొంత మందిలో మాత్రమే అనుకోండి) కనపడుతున్న మూస పార్టీ రచనా పద్ధతి విషాన్ని, పిడివాద తప్పుల్ని వదిలించకపోతే వారిలో శక్తివంతమైన, సజీవమైన విప్లవోత్తేజాన్ని రేకెత్తించడం, మార్క్సిజంపట్ల తప్పుడు దృక్పథాన్ని అవలంభించే చెడు అలవాటును నిర్మూలించడం, నిజమైన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయటం, అభివృద్ధిపరచడం గాని అసాధ్యమవుతుంది. పైగా ప్రజలందరి పైనా వున్న పాత మూస పద్ధతి, పిడివాదాల ప్రభావానికి వ్యతిరేకంగా, కొత్త మూస పద్ధతికి, పిడివాదాల ప్రభావానికి వ్యతిరేకంగా శక్తివంతమైన పోరాటం చేయడం, ఈ ప్రభావాలను రూపుమాపే, తుడిచిపెట్టే లక్ష్యాన్ని నెరవేర్చడం కూడా అసాధ్యం అవుతుంది.

స్వీయాత్మకత, ఒంటెత్తు ధోరణి, మూసపోత పార్టీ రచనా పద్ధతులు, మూడూ మార్క్సిస్టు వ్యతిరేక ధోరణులు. అవి పాలకవర్గాల అవసరాలను తీరుస్తాయే తప్ప ప్రజల అవసరాలను తీర్చవు. అవి మన పార్టీలో వున్న పెటీ బూర్జువా సిద్ధాంతానికి ప్రతిబింబాలు. చైనాలో ఈ పెటీ బూర్జువావర్గం పెద్ద సంఖ్యలోనే వుంది. గణనీయమైన సంఖ్యలో వున్న ఈ వర్గాలే మన పార్టీ చుట్టూ ఆవరించాయి. మన పార్టీలో చాలా మంది ఈ వర్గం నుంచే వచ్చారు. వాళ్లు పార్టీలో చేరేటపుడు తమ పెటీ బూర్జువా అలవాట్లను, అవి ఎక్కువైనా, తక్కువైనా, వాటిని పార్టీలోకి అనివార్యంగా లాక్కొని వస్తారు. పెటీ బూర్జువా విప్లవకారుల అత్యుత్సాహాన్ని, ఏకపక్ష విధానాన్నీ కనుక అదుపులో పెట్టి మార్చకపోతే అవి స్వీయ మానసిక ధోరణికి, ఒంటెత్తు ధోరణికి దారి తీస్తాయి. ఇవి విదేశీ మూస రచనా విధానం, లేదా మూస పార్టీ రచనా పద్ధతులుగా వ్యక్తమవుతాయి.

వీటన్నింటిని శుభ్రపరిచి, తొలగించడం తేలిక కాదు. కష్టపడి ప్రజలకు నచ్చచెప్పడం ద్వారా మాత్రమే ఈ పనిని సక్రమంగా నిర్వహించగలం. మనం సక్రమంగాను, చిత్తశుద్ధితోను వాదించగల్గితే అది శక్తివంతంగా వుంటుంది. ఈ క్రమంలో మనం మొదట రోగికి "నువ్వు రోగివి" అనే విషయాన్ని గుర్తు చేసి, అతన్ని కుదిపి, చెమటలు పట్టించాలి. ఆ తర్వాత వైద్యం పొందమని రోగికి నిజాయితీగా సలహా ఇవ్వాలి.

ఇపుడు మనం మూసపోత పార్టీ రచనా విధానాన్ని విశ్లేషించి, దాని లొసుగు ఎక్కడ వుందో చూద్దాం. విషాన్ని విషంతోనే విరుగుడు చేసినట్లుగా, ఈ మూసపోత ఎనిమిది పాదాల వ్యాసాన్ని అనుకరించి, మనం కూడా కింది విధంగా రాసినట్టు "ఎనిమిది పాదాలని" ప్రవేశపెడదాం. వీటిని ఎనిమిది ప్రధాన ఆరోపణలుగా పేర్కొనవచ్చు.

మూసపోత పార్టీ రచనా విధానం మీద మొదటి ఆరోపణ ఏమిటంటే అది పనికిరాని చెత్తతో, వాగాడంబరంతో పేజీలు నింపుతుంది. మన కార్యకర్తలు కొందరు అర్థం పర్థంలేని పెద్ద పెద్ద వ్యాసాలు రాయడంలో ఆనందం పొందుతారు. అవి "పొడుగ్గా, కంపుకొడుతూ వుండే మురికి మనిషి మేజోళ్లు" లాంటివి. వాళ్లు అంత పెద్ద పెద్ద సరుకులేని వ్యాసాలు ఎందుకు రాయాలి? దానికి ఒకే ఒక వివరణ వుంది. తాము రాసిన వ్యాసాలను ప్రజలు చదవకూడదని వాళ్ల గట్టి నిర్ణయం కావచ్చు. సరుకులేని ఆ పెద్ద పెద్ద వ్యాసాలను చూడగానే ప్రజలు అయిష్టంగా, తల అడ్డంగా వూపుతారు. ఇకవాళ్లు ఆ వ్యాసాన్ని చదువుతారని ఎలా ఆశించగలం? అమాయకుల్ని నమ్మించటానికి, వారిపై చెడు ప్రభావాన్ని కల్గించి, చెడు

అలవాట్లని పెంపొందించడానికి తప్ప అవి ఎందుకూ పనికిరావు. గత సంవత్సరం జూన్ 22న సోవియట్ యూనియన్ దురాక్రమణకు వ్యతిరేకంగా పెద్దఎత్తున యుద్ధం ప్రారంభించింది. అయితే దీనికి సంబంధించి జూలై 3న స్టాలిన్ చేసిన ఉపన్యాసం మన 'లిబరేషన్ డైలీ' పత్రిక సంపాదకీయమంత మాత్రమే వుంది. అదే మన పెద్ద మనుషులెవరైనా ఆ ఉపన్యాసం తయారు చేసి వుంటే అది ఎంత పొడుగు వుండేదో ఊహించుకోండి! అది కనీసం కొన్ని వందల వేల పదాలతో నిండి వుండేది. మనం యుద్ధం మధ్యలో ఉన్నాం కాబట్టి సూటిగా, క్లుప్తంగా రాయటం నేర్చుకోవాలి. ఇక్కడ ఏనాన్‌లో ప్రస్తుతం పోరాటం లేకపోయినప్పటికీ, యుద్ధ రంగంలో వున్న మన సైన్యం రోజూ పోరాడుతూనే వుంది, వెనుకతట్టు ప్రాంతాలలో వున్న ప్రజలు పనుల్లో నిమగ్నులై వున్నారు. పెద్ద పెద్ద వ్యాసాలు రాస్తే వాటిని ఎవరు చదువుతారు? యుద్ధ రంగంలో వున్న కొంతమంది కామ్రేడ్స్ కూడా పెద్ద పెద్ద నివేదికలు రాయాలనుకుంటారు. వాళ్లు చాలా కష్టపడి వాటిని రాసి, మనకు పంపిస్తారు. అయితే వాటిని చదివే ఓపిక ఎవరికుంటుంది? సరుకులేని పెద్ద పెద్ద వ్యాసాలు మనకు ఉపయోగపడవనుకున్నాం. మరి సరుకులేని చిన్న వ్యాసాలు మెరుగ్గా ఉన్నాయా? అవి కూడా బాగాలేవు. మనం పనికిరాని వాగుడును కట్టిపెట్టాలి. అయితే, ముందుగా మురికి మనిషి కంపు మేజోళ్లను చెత్త బుట్టలో పారెయ్యాలి. " 'పెట్టుబడి' పుస్తకం పెద్దది కాదా? దాని గురించి మనం ఏం చేయాలి?" అని కొంత మంది అడగవచ్చు. దీనికి చాలా తేలికగా జవాబు చెప్పవచ్చు. ఆ పుస్తకాన్ని నిరంతరం అధ్యయనం చేయండి. "వేరు వేరు పర్వతాల మీద వేరు వేరు పాటలు పాడండి," "పదార్థాన్ని బట్టి ఆకలి, మనిషిని బట్టి బట్ట," అన్న సామెతలున్నాయి. మనం ఏది చేసినా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చేయాలి. వ్యాసాలు రాసేటప్పుడు, ఉపన్యాసాలిచ్చేటప్పుడు కూడా ఇదే పద్ధతిని అవలంబించాలి. మనం పనికిరాని, సుదీర్ఘమైన మూస రచనలను వ్యతిరేకిస్తున్నాం. అంటే, ప్రతిదీ బాగుండాలంటే తప్పనిసరిగా క్లుప్తంగా ఉండాలని అర్థంకాదు. యుద్ధ సమయాల్లో చిన్న చిన్న వ్యాసాలు మనకు అవసరం అన్నమాట నిజమేకానీ, అంతకంటే ముఖ్యంగా మనకు విషయం వున్న వ్యాసాలు అవసరం. విషయంలేని వ్యాసాలను ఏమాత్రం సమర్థించలేం. అవి అత్యంత అభ్యంతరకరమైనవి. ఇది ఉపన్యాసాలకు కూడా వర్తిస్తుంది. పనికిరాని సుదీర్ఘ ఉపన్యాసాలను మనం కట్టిపెట్టాలి.

ఈ మూసపోత రచనల పైన మన రెండో ఆరోపణ ఏమిటంటే, ఇవి ప్రజల్ని భయపెట్టడానికి డాబులు కొడతాయి. ఈ రకమైన రచనలు కొన్ని విషయం లేకుండా, దీర్ఘంగా వుండటమేగాక, కావాలని ప్రజల్ని మభ్యపెట్టాలనే ఉద్దేశంతోనే డాబుగా కూడా వుంటాయి. అవి అత్యంత విషపూరితాలు. ఎందుకూ పనికిరాని సుదీర్ఘమైన వ్యాసాలు రాయటాన్ని అనుభవం లేకపోవడంగా సరిపెట్టుకోవచ్చుగాని, ప్రజల్ని భయపెట్టడం కోసం డాబులు కొట్టడం అనేది అనుభవం లేకపోవడమేగాక, ఖచ్చితంగా మోసపూరితమైనది. వీళ్లని విమర్శిస్తూ లూసన్ ఒకసారి, "పరాభవించడం, బెదిరించడం, పోరాటం కాదు," అని అన్నాడు. శాస్త్రీయమైనదేదీ విమర్శకు భయపడదు. ఎందుకంటే, శాస్త్రం అనేది సత్యం. తనని ఒప్పుకోరేమోనన్న భయం దానికుండదు. కానీ మూస పద్ధతిలో స్వీయాత్మక, ఒంటెత్తు ధోరణిలో రచనలు చేసేవారు, ఉపన్యాసాలిచ్చేవారు, తమని ప్రజలు నిరాకరిస్తారేమోనని భయపడతారు. పిరికిగా వుంటారు, అందుకు అవతలి వాళ్లను భయపెట్టడానికి డాబులు పోవడంపై ఆధారపడతారు. అలా చేస్తే ప్రజల్ని నోరెత్తకుండా చేయగలమని, "ఆ రోజుకి పబ్బం గడుపుకొంటా"మని వీళ్లు నమ్ముతారు. ఆ డాబులు పోవడం నిజాన్ని ప్రతిబింబించకపోగా, వాస్తవం తెలుసుకోవడానికి ప్రతిబంధకంగా వుంటుంది. నిజం ఎప్పుడూ ప్రజల్ని మభ్యపెట్టడానికి డాబులు కొట్టదు. అది నమ్మకంగానూ, నిజాయితీగానూ వ్యవహరిస్తుంది. మన కామ్రేడ్స్ చాలా మంది వ్యాసాలలో, ఉపన్యాసాలలో, ''నిర్దాక్షిణ్యమైన పోరాటం,'' ''నిర్దాక్షిణ్యంగా దెబ్బతీయటం'' అనే పదాలు వాడుతూ వుంటారు. శత్రువుకు వ్యతిరేకంగానో, లేదా శత్రు సిద్ధాంతానికి వ్యతిరేకంగానో అటువంటి చర్యలు అవసరంగాని, మన కామ్రేడ్స్‌కు వ్యతిరేకంగా వాటిని ఉపయోగించటం తప్పు. 'సోవియట్ యూనియన్ (బోల్షివిక్) కమ్యూనిస్టు పార్టీ చరిత్ర సంక్షిప్త పాఠం' పుస్తకం ముగింపుకు సంబంధించిన నాల్గవ అంశంలో చర్చించినట్టుగా శత్రువులు, శత్రు సిద్ధాంతాలు మన పార్టీలోకి దొంగచాటుగా ప్రవేశించడం తరుచు జరుగుతూనే వుంటుంది. ఈ శత్రువులకు వ్యతిరేకంగా మనం తప్పకుండా నిర్దాక్షిణ్యంగా పోరాడాలి, నిర్దాక్షిణ్యంగా దెబ్బతీయాలి. ఎందుకంటే, ఈ దుర్మార్గులు మన పార్టీకి వ్యతిరేకంగా ఇవే పద్ధతులను అవలంభిస్తారు. మనం కనుక వాళ్లను సహించినట్లయితే, వాళ్ల వలలో చిక్కుకుపోతాం. అయితే, అరుదుగా తప్పులు చేసే మన కామ్రేడ్స్‌పట్ల మాత్రం ఇలాంటి పద్ధతుల్ని అవలంభించకూడదు. రష్యా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర పుస్తకంలో చెప్పినట్లుగా వాళ్లపట్ల విమర్శ, ఆత్మవిమర్శ పద్ధతిని అనుసరించాలి. తప్పులు చేసిన కామ్రేడ్స్‌తో కూడా ''నిర్దాక్షిణ్యంగా పోరాడాలి,'' "నిర్దాక్షిణ్యంగా దెబ్బతీయా"లని అప్పుడు పెద్ద ఎత్తున ప్రచారం చేసిన కామ్రేడ్స్ అలా ఎందుకు చేసారంటే, వాళ్లు ఎవరితోనైతే వ్యవహరిస్తున్నారో వారిపట్ల సరైన విశ్లేషణ లేకపోవటం, అవతలి వారిని భయపెట్టడానికి డాబులు కొట్టడం, అందుకు కారణాలు. నువ్వు ఎవరితో వ్యవహరిస్తున్నా ఇది మాత్రం సరైన పద్ధతికాదు. శత్రువుకు వ్యతిరేకంగా ఈ ఎత్తుగడ నిష్ప్రయోజనం. మన కామ్రేడ్స్‌కు వ్యతిరేకంగా ఇది చేటు చేస్తుంది. ఇది దోపిడీ వర్గాలు, అలగా శ్రామిక జనం (Lumpen proletariat) అలవాటుగా అనుసరించే ఎత్తుగడేకాని శ్రామికవర్గానికి ఏమాత్రం ఉపయోగపడదు, క్రియాశీలమైన శాస్త్రీయ దృక్పథం ఒక్కటే శ్రామికవర్గం చేతిలో పదునైన, శక్తివంతమైన ఆయుధం. కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు-లెనినిస్టు, వాస్తవం మీద, వాస్తవాల నుండి నిజాన్ని గ్రహించడం మీద, శాస్త్రీయ విజ్ఞానం మీద ఆధారపడుతుందిగాని, ప్రజల్ని భయపెట్టి లొంగదీసుకునే పద్ధతి మీద ఆధారపడదు. డాబులు కొట్టడం ద్వారా, నటించడం ద్వారా వారు ప్రతిష్టను, పదవిని పొందాలనుకోవడం తీవ్రంగా నిరసించదగ్గ అంశం. క్లుప్తంగా చెప్పాలంటే, సంస్థలు నిర్ణయాలు తీసుకొనేటప్పుడు, ఆదేశాలిచ్చేటప్పుడు, కామ్రేడ్స్ వ్యాసాలు రాసేటప్పుడు, ఉపన్యాసాలిచ్చేటప్పుడు, వాళ్లు ఎటువంటి మినహాయింపులు లేకుండా

మార్క్సిస్టు-లెనినిస్టు వాస్తవం మీద ఆధారపడాలి, ఉపయోగకరంగా వ్యవహరించాలి దీనిపైన ఆధారపడటం ద్వారా మాత్రమే విప్లవంలో విజయాన్ని సాధించగలం. మిగిలినవన్నీ పనికిరానివే.

మూసపోత రచనలపై మూడో ఆరోపణ ఏమిటంటే, అవి లక్ష్యం లేనివి కావడమేకాక, పాఠకులను పరిగణనలోకి తీసుకోవు. కొన్ని సంవత్సరాల క్రితం ఏనాన్ నగర గోడల మీద, "కార్మికులారా! రైతులారా! ఏకం కండి. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధంలో విజయం సాధించడానికి కృషి చేయండి!'' అనే భావాన్నిచ్చే నినాదం కనపడింది. నినాదంలో తప్పు లేదుగాని, వాడిన భాష మాత్రం పాతకాలపు గ్రాంధిక భాష. ఈ నినాదం రాసిన కార్యకర్త నిస్సందేహంగా పురాతన పండితుల శిష్యుడే. కానీ ఈ ప్రతిఘటనా యుద్ధ కాలంలో ఏనాన్ నగర గోడల మీద అతను అలా ఎందుకు రాశాడన్నది అర్థం కాని విషయం. బహుశా అతను సాధారణ ప్రజలు తను రాసిన దాన్ని చదవకూడదన్న ప్రతిజ్ఞ తీసుకున్నాడేమో. ఇంతకంటే వేరుగా దాన్ని వివరించడం కష్టం. నిజంగా ప్రచారం చేయదలచిన కమ్యూనిస్టులు తమ వ్యాసాలు, నినాదాలు చదివే, ఉపన్యాసాలు వినే శ్రోతల్ని దృష్టిలో పెట్టుకోవాలి. అలా చేయకపోతే తాము రాసినదాన్ని, చెప్పినదాన్ని ఎవరూ వినకుండా, చదవకుండా చేయడమే అవుతుంది తాము రాసింది, చెప్పింది అందరూ తేలిగ్గా అర్థం చేసుకుంటారని చాలా మంది నమ్ముతారు. కానీ నిజానికి దానికి విరుద్ధంగా జరుగుతుంది. వాళ్ల మూసపోత రచనల్ని, ఉపన్యాసాల్ని ప్రజలు ఎట్లా అర్థం చేసుకోగల్గుతారు? "ఆవు ముందు పిల్లనగ్రోవి ఊదడం'' అన్న సామెత శ్రోతల్ని ఎద్దేవా చేయడానికి ఉద్దేశించబడింది. ఈ భావాన్ని శ్రోతల్ని గౌరవించటంగా మార్చి చూస్తే, ఆ వెక్కిరింత పిల్లనగ్రోవి ఊదేవాడికే తగులుతుంది. అతను శ్రోతల్ని దృష్టిలో పెట్టుకోకుండా ఎందుకు ఊదాలి. అంతకన్నా అధ్వాన్నం ఏమిటంటే, అతను అసహ్యంగా అరిచే కాకిలాంటి మూసపోత పార్టీ రచనను సృష్టించి, పైగా జనం ఎదురుగా ఇంకా కాకిలాగా అరవడానికి పూనుకుంటాడు. బాణం వేసినపుడు లక్ష్యాన్ని గురిచూడాలి. పిల్లనగ్రోవి ఊదినపుడు వినేవారిని దృష్టిలో పెట్టుకోవాలి. అలాంటప్పుడు పాఠకుల్ని, శ్రోతల్ని గమనంలోకి తీసుకోకుండా ఎవరైనా వ్యాసాలు ఎలా రాస్తారు, ఉపన్యాసాలు ఎలా ఇస్తారు? మనం ఎవరితోనైనా స్నేహం చేయదల్చుకుంటే, వాళ్లు ఎవరైనా కానీయండి, ఒకళ్ల మనసునొకళ్లం తెలుసుకోకుండా, అలాగే ఆలోచనలు తెలుసుకోకుండా మంచి స్నేహితులం కాగలమా? తమ ప్రేక్షకుల్ని పరిశీలించకుండా, అధ్యయనం చేయకుండా, విశ్లేషించకుండా, ఊరికే గడగడ మాట్లాడటం వల్ల మన ప్రచారదళ కార్యకర్తలు ఏమీ సాధించలేరు.

మూసపోత రచనల మీద నాలుగో ఆరోపణ ఏమిటంటే, ఆ రచనల్లో వాడే మృత భాషను చూస్తే ఎవరికైనా "పీసాన్'' గుర్తుకు వస్తుంది. మన మూసపోత పార్టీ రచనా విధానం లాగానే షాంఘైలో "చిన్న పీసాన్''లని పిలువబడే జంతువులు కూడా ముదరబారి, వికారంగా వుంటాయి. ఒక వ్యాసంగానీ, ఉపన్యాసంగాని జీవం, ఉత్తేజం లేకుండా, కేవలం తరగతి గదిలో విన్నదానికి కొంచెం తేడాగా వుంటే, అది కూడా "పీసాన్''లాగా వికారంగా, జీవం లేకుండా వుండదూ? ప్రజలతో సంబంధం లేకుండా జీవితమంతా బడిలోను, కాలేజిలోను, విశ్వవిద్యాలయంలోను గడిపిన వ్యక్తి భాష పేలవంగా, మార్పు లేనిదిగా వుంటే అది అతని తప్పుకాదు. కానీ మనం ప్రజల కోసం పని చేస్తున్న విప్లవకారులం. మనం ప్రజల భాషను తెలుసుకోకపోతే బాగా పని చేయలేం. ప్రస్తుతం ప్రచార కార్యక్రమంలో వున్న మన కార్యకర్తలు చాలా మంది భాషను అధ్యయనం చేయరు. వాళ్ల ప్రచారం నీరసంగా వుంటుంది. అతి కొద్దిమంది ప్రజలు మాత్రమే వాళ్ల వ్యాసాలు చదివి, వాళ్ల మాటలు వింటారు. మనం భాషను ఎందుకు అధ్యయనం చేయాలి? అంతేకాక, దానిపై ఎక్కువ శక్తిని ఎందుకు కేంద్రీకరించాలి? ఎందుకంటే, భాష మీద పట్టు సంపాదించడం అంత తేలిక కాదు. దాని కోసం చాలా శ్రమపడాలి. ముందు మనం ప్రజల భాష నేర్చుకుందాం. ప్రజల భాష సంపన్నమైంది, శక్తివంతమైనది, అది నిజ జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. మనలో చాలా మంది భాష మీద పట్టు సంపాదించలేకపోయారు, కాబట్టే మన రచనలు, ఉపన్యాసాలు సజీవంగా, శక్తివంతంగా, భావస్ఫోరకంగా వుండటంలేదు. అవి ఆరోగ్యవంతమైన మనిషిలాకాక చిక్కిపోయిన "పీసాన్''లాగా, ఎముకల గూళ్లలాగా వున్నాయి. రెండవది, విదేశీ భాషల నుండి మనకు కావలసినదాన్ని కలుపుకుందాం. మనం విదేశీ వ్యక్తీకరణలను యాంత్రికంగా దిగుమతి చేసుకోకూడదు. ఎలాంటి విచక్షణ లేకుండా ఉపయోగించకూడదు. మంచివి, మన అవసరాలకు తగిన వ్యక్తీకరణలను మాత్రమే తీసుకుందాం. పాత చైనా పదజాలం మన అవసరాలకు తగినంతగా లేకపోవడం వలన ఇప్పటికే మనం విదేశీ వ్యక్తీకరణలను మన పదజాలంలో ఇముడ్చుకున్నాం. ఉదాహరణకు ఈ రోజున మనం కార్యకర్తల సమావేశం జరుపుకున్నాం. కార్యకర్త (కాంపు) అనే మాట విదేశీ పదం నుండి వచ్చిందే. మనం విదేశాల నుండి అభివృద్ధికరమైన భావాలనేకాక కొత్త వ్యక్తీకరణలు కూడా కలుపుకుంటూనే వుండాలి. మూడవది, చైనా గ్రాంధిక భాష నుండి కూడా సజీవమైన అంశాల్ని మనం నేర్చుకుందాం. మనం చైనా గ్రాంధిక భాషను బాగా అధ్యయనం చేయలేదు. కాబట్టి ఇప్పటికీ దానిలో సజీవంగా వున్న అంశాల్ని పూర్తిగా, తగినట్లుగా ఉపయోగించుకోలేకపోతున్నాం. అందులో పాతబడిపోయిన అస్పష్ట వ్యక్తీకరణలను వాడడాన్ని మనం ఖచ్చితంగా వ్యతిరేకిస్తాము. దానికి తిరుగులేదు. కానీ ఇప్పటికీ పనికి వచ్చే మంచిని మాత్రం స్వీకరించాలి. మూసపోత రచనా విధానానికి గురైనవారు ప్రజల భాషలోగాని, గ్రాంధిక భాషలోగాని, విదేశీ భాషలోగాని పనికివచ్చే అంశాల్ని అధ్యయనం చేయడానికి ఏమాత్రం కృషి చేయరు. అందుకనే ప్రజలు వాళ్ల పనికిరాని నీరస ప్రచారాన్ని ఆహ్వానించరు. అలాంటి అసమర్థులైన ప్రచారకులు మనకు కూడా అవసరం లేదు. మన ప్రచారకులు ఎవరు? ఉపాధ్యాయులు, పత్రికా విలేఖరులు, రచయితలు, కళాకారులేకాక, మన కార్యకర్తలందరూ కూడా. ఉదాహరణకు సైనిక కమాండర్లను తీసుకోండి. వాళ్లు బహిరంగ సభల్లో మాట్లాడకపోయినా సైనికులతో మాట్లాడాలి, ప్రజలతో వ్యవహరించాలి. ఇది ప్రచారంకాక మరేమిటి? ఒకరు మరొకరితో మాట్లాడుతున్నారంటే అది ప్రచారం కిందే లెక్క. మూగవారు కాకుంటే ప్రతివారూ ఎప్పుడూ నాలుగు ముక్కలు మాట్లాడుతూనే వుంటారు. అందుకనే మన కార్యకర్తలందరూ తప్పనిసరిగా భాషను అధ్యయనం చేయాలి.

మూస పద్ధతి పార్టీ రచన గురించి అయిదో ఆరోపణ ఏమంటే, చైనా ఔషధాల దుకాణం ఆరంభిస్తున్నట్టు అతి క్లిష్టమైన అనేక శీర్షికల గుత్తులా కింద వివిధ విషయాలను ఏర్చికూర్చుతారనేది. ఏదైనా చైనా మందుల షాపును చూడండి. అసంఖ్యాకమైన అరలు అమర్చిన బీరువాలు, ప్రతి అర మీద ఫలానా మూలిక, ఫలానా లవణం అంటూ ఔషధం పేరు రాసి అతికించి వున్న ఓ చీటీ దర్శనమిస్తాయి. సకల దినుసుల పేర్లూ మీకక్కడ కనపడతాయి. మన కామ్రేడ్స్ ఈ పద్ధతిని దొరకబుచ్చుకున్నారు. వాళ్ల రచనలు, ఉపన్యాసాలు, పుస్తకాలు, నివేదికలలో వారు మొట్ట మొదట పెద్ద సంఖ్యా క్రమం, ఆ పిమ్మట చిన్న సంఖ్యా క్రమం, ఆ తర్వాత ఊర్ధ్వ లోకాలకు సంబంధించిన పది సంకేతాలూ, ఆ తదుపరి ఇహలోక శాఖలకు చెందిన పన్నెండు సంకేతాలూ, అవీ అయిపోతే ఇంగ్లీషు అక్షరాలు చిన్నవీ - ఇలా ఇదీ అదీ అనకుండా రకరకాల పేర్లు, సంకేతాలతో శీర్షికలుగా విడగొడతారు. అటు మన పూర్వీకులు, ఇటు విదేశీయులు కూడా ఇన్ని రకాల సంకేతాలు, వర్ణక్రమాలు ఏర్పరచి వుండడం నిజంగా ఎంత అదృష్టం కదా; మనం అనవసరంగా బాధపడకుండా సునాయసంగా చైనా ఔషధాల దుకాణం తెరుచుకోగల్గుతున్నాం. గొప్ప పదాడంబరంతో, ఇలా సంకేతాక్షరాలూ, అంకెలూ ఎన్నో గుప్పించడమే తప్ప ఏ సమస్యను తడమకుండా, విశ్లేషించకుండా, పరిష్కరించకుండా, దేని గురించీ అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గాని ఖచ్చితంగా ఓ వైఖరి తీసుకోకుండా సాగే రచన నిజానికి సరుకులేని డొల్లే. అది సరిగ్గా చైనా ఔషధాల దుకాణమే. ఊర్ధ్వలోకాల వంటివి వాడనే వాడకూడదని నేననడం లేదు. కానీ సమస్యలపట్ల అటువంటి ధోరణి అనుసరించడం తప్పు. మన కామ్రేడ్స్ చాలా మంది ఎంతో మోజుపడే ఆ చైనా మందుల దుకాణం నుండి ఎరువు తెచ్చుకున్న పద్ధతి నిజానికి పరమ మొరటుది. అది పిల్ల చేష్టలు, భేషజంతో కూడిన వదరుబోతు తనమూ తప్ప వేరేంకాదు. అది, విషయాన్ని వాటి అంతస్సంబంధాల రీత్యా గాక, కేవలం వాటి బాహ్య లక్షణాలను బట్టి మాత్రమే వర్గీకరించే లాంఛనప్రాయ పద్ధతి. ఆంతరిక సంబంధంలేని అనేక విషయాల పుట్టను, అనేక భావాలను పట్టుకుని, కేవలం వాటి బహిర లక్షణాలను బట్టి మాత్రమే వాటిని ఓ వరసలో వల్లించుకుపోవడమంటే, ఆ అనేక భావాలను కలగూర గంపలా గుచ్చెత్తడం మాత్రమే. అవతలి వాళ్లను కూడా అదే ఆషామాషీ నాటకంలోకి లాగడమే. దీనంతటి ఫలితంగా ఏమవుతుందంటే, వారు అనేక అంశాలను ఎ.బి.సి.డి. అని వరుస క్రమంలో జాబితాలుగా వల్లించడంతోనే తృప్తి పడతారు తప్ప, సమస్యల గురించి ఆలోచించడానికిగాని, విషయాల సారాంశాన్ని తరచి చూడటానిగ్గాని తలకాయలు ఉపయోగించరు. సమస్య అంటే ఏమిటి? ఒక వస్తువులోని వైరుధ్యమే సమస్య. వైరుధ్యం అపరిష్కృతంగా వున్న చోట సమస్య వుంటుంది. సమస్య వున్నప్పుడు నువ్వు ఒకవైపు నిలిచి, రెండో వైపుని వ్యతిరేకించాలి. సమస్యను ముందుంచాలి. సమస్యను ముందుంచాలంటే, నువ్వు మొదట ప్రాథమిక పరిశీలన జరిపి, సమస్య, లేక వైరుధ్యంలోని రెండు మౌలిక అంశాలను అధ్యయనం చేయాలి. ఆ తర్వాతనే వైరుధ్య స్వభావాన్ని అర్థం చేసుకోగలుగుతాము. ఇది సమస్యను కనుక్కునే క్రమం. ప్రాథమిక పరిశీలన, అధ్యయనాల వల్ల సమస్యను కనుక్కోవచ్చు, సమస్యను ముందుంచవచ్చు. కానీ, దానివల్ల సమస్య పరిష్కారం కాదు. సమస్యను పరిష్కరించాలంటే క్రమబద్ధమైన, సమగ్రమైన పరిశీలన, అధ్యయనం అవసరం. ఇది విశ్లేషణా క్రమం. సమస్యను ముందుంచడానికి కూడా విశ్లేషణ అవసరం. లేకపోతే, దృగ్గోచర విషయాల అయోమయ, గజిబిజి ముద్దలో సమస్య, లేక వైరుధ్యం ఎక్కడ వుందో కనుక్కోవడం సాధ్యపడదు. కాని ఇక్కడ విశ్లేషణా క్రమం అంటే క్రమబద్ధమైన, సమగ్రమైన విశ్లేషణ అని అర్థం. ఒక సమస్యను ముందుంచడం జరిగినా, ఒకోసారి దాన్ని పరిష్కరించడం కుదరదు. దానికి కారణం, వస్తువుల అంతర్గత సంబంధాలు ఇంకా వ్యక్తం కాకపోవడం, లేక క్రమబద్ధమైన, సమగ్రమైన ఈ విశ్లేషణాక్రమం ఇంకా అమలు జరగకపోవడం కావచ్చు. పర్యవసానంగా మనం సమస్య రూపు రేఖలను ఇంకా స్పష్టంగా చూడలేము, దానిని విశ్లేషించలేము, అలా సమస్యను ముందుంచాలి. తర్వాత దాన్ని విశ్లేషించి, సమస్య స్వభావాన్ని సూచించాలి. ఆ తర్వాత దాని పరిష్కార విధానాన్ని అందించాలి. దీనిలో లాంఛనప్రాయ పద్ధతులు నిష్ప్రయోజనం. మన పార్టీలో పిల్లకాయ చేష్టలు, మొరటు, అనాగరిక, బద్ధకపు లాంఛనప్రాయ పద్ధతులు విరివిగా వున్నాయి. మనం వాటిని బహిర్గతం చేయాలి. సమస్యల్ని పరిశీలించి, ముందుంచి, విశ్లేషించి, పరిష్కరించే మార్క్సిస్టు పద్ధతిని ఉపయోగించడం అలా మాత్రమే నేర్చుకోగలం. అప్పుడు మాత్రమే మనం మన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించగలం. అప్పుడే మన విప్లవ లక్ష్యం విజయవంతం కాగలదు.

మూస పార్టీ రచనా పద్ధతి మీద ఆరవ ఆరోపణ ఏమిటంటే, అది బాధ్యతా రహితమైనది. అంతేకాక, అది బైటపడిన ప్రతిచోట ప్రజలకు హాని కలిగిస్తుంది. పైన పేర్కొన్న తప్పిదాలన్నీ కొంతమేరకు అపరిపక్వతవల్ల, మరికొంత మేరకు బాధ్యతా రాహిత్యంవల్ల సంభవిస్తాయి. ఉదాహరణకు ముఖం కడుక్కోవడం చూద్దాం. మనం ప్రతిరోజు ముఖం కడుక్కుంటాం. కొందరం ఎక్కువసార్లు కూడా కడుక్కుంటాం. ఆ తర్వాత, "పరిశీలన, అధ్యయనం" పద్ధతిలో మనల్ని మనం అద్దంలో తనిఖీ చేసుకుంటాం (పెద్దగా నవ్వులు). ఏదైనా సవ్యంగా లేదేమోనన్న భయంతో అలా చేస్తాం. ఎంత బాధ్యతాయుతమైన ప్రవర్తన! మనం వ్యాసాలు రాయడం, ఉపన్యాసాలివ్వడంలో కూడా అంతే బాధ్యతాయుతంగా వుంటే, పొరపాట్లు చెయ్యం. సరిగా చెప్పలేనివి చెప్పకండి. అది ఇతరుల ఆలోచనలపై, చర్యలపై ప్రభావం చూపగలదని ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఎవరినైనా ఒకటి రెండు రోజులు ముఖం కడుక్కోకపోతే అది మంచిదికాదు. ఒకవేళ కడుక్కున్నాక కూడా ఒకటి రెండు మరకలుండిపోతే అదీ మంచిది కాదు. కానీ దానివల్ల ప్రమాదం లేదు. కానీ వ్యాసాలు రాయడం, ఉపన్యాసాలివ్వడం వేరు. అవి ఇతరులను ప్రభావం చేయడం అనే ఏకైక లక్ష్యం కలిగివున్నవి. అయినా మన కామ్రేడ్స్ ఈ పనిని చాలా తేలిగ్గా తీసుకుంటారు. ఇది ముఖ్యమైన దాన్ని తక్కువచేసి, చిన్న చిన్న వాటికి ప్రాముఖ్యత ఇవ్వడం అవుతుంది. చాలా మంది అధ్యయనం చేయకుండా ముందుగా తయారవకుండా వ్యాసాలు రాస్తారు, ఉపన్యాసాలిస్తారు. వ్యాసం రాశాక, ముఖం కడుక్కున్నాక అద్దంలో చూసుకున్నట్టుగా ఆ వ్యాసాన్ని పలుమార్లు చదువుకోవడం గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా దాన్ని ఏకంగా

ప్రచురణకు పంపేస్తారు. దాని పర్యవసానం, "కలం నుండి వెయ్యి పదాల ధార, కానీ విషయానికి పదివేల పదాల దూరం''. ఈ రచయితలు చాలా నేర్పుగలవారైనట్టు కనిపించినా, వారు నిజానికి ప్రజలకు హాని కలిగిస్తారు. ఈ చెడు అలవాటును, ఈ బాధ్యతా రాహిత్యాన్ని తప్పక సరిదిద్దాలి.

మూస పార్టీ రచనా పద్ధతి మీద ఏడవ ఆరోపణ ఏమిటంటే, అది పార్టీ మొత్తాన్ని కలుషితం చేస్తుంది, విప్లవాన్ని ప్రమాదంలో ముంచి వేస్తుంది. ఎనిమిదవ ఆరోపణ ఏమిటంటే, అది వ్యాపించటం వల్ల దేశం దెబ్బతింటుంది. ప్రజలు సర్వనాశనమవుతారు. ఈ రెండు ఆరోపణలు స్పష్టంగా వున్నాయి. ఇక వాటిని వివరించనక్కరలేదు. మరోలా చెప్పాలంటే, మూస పార్టీ రచనా పద్ధతిని గనక మార్చకుండా, దాన్ని అలా నిరాటంకంగా అభివృద్ధి చెందనిస్తే, దాని ఫలితం చాలా తీవ్రంగా వుంటుంది. మూస పార్టీ రచనా పద్ధతిలో స్వీయాత్మకత, ఒంటెత్తు పోకడ అనే విషం దాగుంది. ఈ విషంగాని వ్యాపిస్తే, అది పార్టీని, దేశాన్ని కూడా ప్రమాదానికి గురి చేస్తుంది.

ముందు పేర్కొన్న ఎనిమిది అంశాలూ మనం మూస పార్టీ రచనా పద్ధతికి వ్యతిరేకంగా పోరాడాలన్నదానికి పిలుపు.

రూపంలో తీసుకుంటే, మూస పార్టీ రచన విప్లవోత్తేజానికి సరిపోనిదే కాక, ఆ ఉత్తేజాన్ని దెబ్బతీయగలది కూడా. విప్లవోత్తేజాన్ని పెంపొందించాలంటే మూస పార్టీ రచనా పద్ధతిని విడనాడాలి. దానికి బదులు ఉత్తేజకరమైనది, సజీవమైనది, స్వచ్ఛమైనది, శక్తివంతమైనది అయిన మార్క్సిస్టు-లెనినిస్టు రచనా పద్ధతిని అవలంభించాలి. ఈ రకమైన రచనా పద్ధతి చాలా కాలంగా ఉనికిలో వుంది, కానీ దాన్ని ఇంకా అభివృద్ధిపరిచి, మనలో విస్తృతంగా వ్యాపింపచేయాలి. మనం విదేశీ మూస రచనా పద్ధతిని, మూస పార్టీ రచనా పద్ధతిని నాశనం చేశాక, మన నూతన రచనా పద్ధతిని అభివృద్ధి పరిచి, దాన్ని విస్తరింప చేయవచ్చు. అలా మన పార్టీ విప్లవ లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోగలుగుతాం.

పార్టీ మూస పద్ధతి వ్యాసాలకు, ఉపన్యాసాలకే పరిమితం కాలేదు. అది సమావేశాల నిర్వహణలో కూడా ప్రతిబింబిస్తుంది "1. ప్రారంభ ప్రకటన, 2. నివేదిక, 3. చర్చ, 4. నిర్ణయాలు, 5. వాయిదా వేయటం.'' ప్రతి సమావేశంలో, అది చిన్నదైనా, పెద్దదైనా, ప్రతిచోట, ప్రతిసారి ఈ పద్ధతిని యథాతథంగా అనుసరించడం మరొక పార్టీ మూస పద్ధతే కాదా? ఇక సమావేశాల్లో సమర్పించే "నివేదికలు'' ఈ పద్ధతిలో వుంటాయి: "1. అంతర్జాతీయ పరిస్థితి, 2. జాతీయ పరిస్థితి, 3. సరిహద్దు ప్రాంతం, 4. మన సొంత శాఖ.'' ఈ సమావేశాలు సాధారణంగా ఉదయం నుండి రాత్రి వరకు కొనసాగుతాయి. తాము మాట్లాడకపోతే ఇతరులను కించపరిచినట్టు అవుతుందేమో అన్నట్టు, చెప్పడానికి ఏమీలేని వారు కూడా మైకుని అందుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే, వాస్తవ పరిస్థితులపట్ల అలక్ష్యం, పాత మూర్ఖ పద్ధతులు, అలవాట్లకు అతుక్కుపోయి ప్రవర్తించడం ప్రబలంగా వుంది. మనం వీటన్నింటినీ కూడా సరిదిద్దుకోవద్దా?

ఈ మధ్య చాలా మంది జాతీయ, శాస్త్రీయ, ప్రజా పద్ధతిలోకి (Mass style) మార్పుకై పిలుపునిస్తున్నారు. లోపల నుండి బయటకు సమగ్రంగా మారటం. కానీ కొంచెమైనా మారని వారు కొందరు మార్పుకై పిలుపునిస్తున్నారు. కానీ ఈ కామ్రేడ్స్ "మార్పు'' గురించి మాట్లాడేముందు తాము కొంచెమైనా మారాలని నా సలహా. లేకుంటే వారు పిడివాదం, పార్టీ మూస రచనా పద్ధతుల్లో చిక్కుకుపోతారు. దీన్ని మహత్తర ఆశయాలు కలిగివున్నా అతి తక్కువ శక్తి సామర్థ్యం కలిగి వుండడంగానూ, గొప్ప ఉత్సాహం, తక్కువ నైపుణ్యం కలిగి వుండడంగానూ, చెప్పుకోవచ్చు. దీనివల్ల ఏమీ సాధించలేం. కాబట్టి 'ప్రజాపద్ధతికి మార్పు' గురించి అతి సునాయసంగా మాట్లాడే వారెవరైనా తన చిన్న వలయానికి అతుక్కుపోతే, అతను చాలా జాగ్రత్తగా వుండాలి. లేకపోతే ఏదో ఒకనాడు దారినపోయే ప్రజలు అతనికి తగిలి, "ఈ 'మార్పు' గురించి ఏమిటండీ చాలా మాట్లాడుతున్నారు? అదేదో మమ్మల్ని కూడా కొంచెం చూడనిస్తారా?'' అంటే అతను చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. అతను ఊరికే వాగడంకాక, నిజాయితీగా ప్రజా పద్ధతికి మారదలుచుకుంటే, అతను సామాన్య జనం వద్దకు నిజంగా వెళ్లి, వారి నుండి నేర్చుకోవాలి. లేకుంటే అతని "మార్పు'' గాలిలోనే తేలుతూ వుంటుంది. కొందరు ప్రజా పద్ధతికి మార్పు గురించి తెగ అరుస్తుంటారు. కానీ వారు సామాన్య ప్రజల నుండి నేర్చుకోవడానికి నిజంగా సంసిద్ధంగా లేరని ఇది నిరూపిస్తుంది. వారి బుర్రలు ఇంకా తమ చిన్న వలయాలకే పరిమితమై వున్నాయి.

ఈ సమావేశంలో నాలుగు వ్యాసాలున్న "ప్రచారానికి మార్గదర్శకత్వం'' అనే కరపత్రం ప్రతులను పంచాం. మన కామ్రేడ్స్ ఈ కరపత్రాన్ని పదే పదే చదవాలని నా సలహా.

"సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు (బోల్షివిక్) పార్టీ సంక్షిప్త చరిత్ర''లో లెనిన్ ప్రచార కార్యక్రమాన్ని గురించి రాసిన విషయాలు ఈ కరపత్రం మొదటి భాగంలో వున్నాయి. అన్నిటితో పాటు, లెనిన్ కరపత్రాలు ఎలా రాశాడో కూడా వుంది:

లెనిన్ మార్గదర్శకత్వం కింద "సోషలిజాన్ని కార్మికోద్యమంతో ఐక్యం చేసిన'' మొదటి సంస్థే సేంట్ పీటర్స్ బర్గ్ కార్మికవర్గ విముక్తి పోరాట సంఘం. ఏదో ఒక కర్మాగారంలో సమ్మె జరిగితే, కర్మాగారాల్లో వ్యవహారాల గురించి సభ్యులచేత ఎప్పటికప్పుడు వివరంగా తెలుసుకుంటున్న పోరాట సంఘం, వెంటనే కరపత్రాలు పంచడం, సోషలిస్టు ప్రకటనలు చేయడం ద్వారా ప్రతిస్పందిస్తుంది. ఈ కరపత్రాలు, యజమానులు కార్మికుల్ని దోచుకోవడాన్ని బహిర్గతపరిచి, కార్మికులు తమ శ్రేయస్సు కోసం ఎలా పోరాడాలో వివరించి, కార్మికుల డిమాండ్లను పొందుపరిచేవి. ఈ కరపత్రాలు పెట్టుబడిదారీ విధానంలోని చీడల గురించిన కనిపించే నిజాన్ని, కార్మికుల పేదరికాన్ని, 12-14 గంటల మధ్య వుండేవారి దుర్భరమైన, కష్టమైన పని దినాన్ని, వారికి హక్కులు లేకపోవడాన్ని వెల్లడించేవి. అవి పరిస్థితులకు అనుగుణ్యమైన రాజకీయ డిమాండ్లను కూడా ముందుంచేవి.

"సమగ్రంగా తెలుసుకోవటం,'' కనిపించే నిజాన్ని వెల్లడించటం'' అన్న మాటలను గుర్తుంచుకోండి! అంతేకాక బాబుష్కిన్ అనే కార్మికుడి సహకారంతో లెనిన్ 1894 చివరలో ఇలాంటి మొదటి ఆందోళన

కరపత్రాన్ని, సెంట్ పీటర్స్‌బర్గ్‌లో సమ్మె చేస్తున్న సెమ్యానికోవ్ ఫ్యాక్టరీ కార్మికులకు ఒక విజ్ఞప్తిని రాశారు.

ఒక కరపత్రం రాయాలంటే, ఆ విషయాలన్నీ సమగ్రంగా తెలిసిన కామ్రేడ్స్‌ని సంప్రదించాలి. ఇలాంటి పరిశీలన, అధ్యయనాల మీద ఆధారపడే లెనిన్ రాయటంగానీ, పని చేయటంగాని జరిగింది.

ప్రతి కరపత్రం కార్మికుల ఉత్తేజాన్ని పెంపొందించటానికి ఎంతో తోడ్పడింది. సోషలిస్టులు తమకు సహాయపడుతున్నారని, తమ పక్షం వహిస్తున్నారని వారు చూశారు,

మనం లెనిన్‌తో ఏకీభవిస్తామా? ఏకీభవిస్తే మనం కూడా లెనిన్ కార్యదక్షతతోనే పని చేయాలి. అంటే, మనం కూడా లెనిన్ చేసినట్టు చేయాలి. కాగితాలకు కాగితాలను వృధా వాగాడంబరంతో నింపకూడదు, ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకోకుండా మన ఇష్టానుసారం లక్ష్యం లేకుండా వ్యవహరించకూడదు. మన అభిప్రాయాలే సరైనవి అనుకోవడం, గొప్పలు చెప్పుకోవడం మానుకోవాలి.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏడవ ప్రపంచ మహాసభలో డిమిట్రావ్ చేసిన ప్రకటనలోని కొన్ని భాగాలు కరపత్రం రెండవ భాగంలో వున్నాయి. డిమిట్రావ్ ఏమన్నారు? ఆయన ఇలా అన్నారు?

మనం ప్రజలతో మాట్లాడటం నేర్చుకోవాలి. గ్రాంధిక భాషలోకాదు, ప్రజల, ఆశయాల కోసం పోరాడే యోధుల భాషలో మాట్లాడాలి, వారి ప్రతి మాట, ప్రతి భావం, కోట్లాది ప్రజల ఆశలను, మనోభావాలను ప్రతిబింబిస్తాయి. అంతేకాక;

......మనం ప్రజలకు అర్థమయ్యే భాషలో మాట్లాడటం నేర్చుకోకపోతే ప్రజలు మన నిర్ణయాలను జీర్ణం చేసుకోలేరు''.

ప్రజలకు పరిచయముండి, అర్థమయ్యే ఉపమానాలను వాడుతూ, సామాన్యంగా, నిర్దిష్టంగా మాట్లాడటం మనకు ఎల్లప్పుడూ కుదరదు. మనం కంఠస్తం చేసిన ఆ నిర్దిష్ట సూత్రాలు వాడకుండా ఆపుకోవడం మనకు ఇంకా సాధ్యపడటం లేదు. నిజానికి మన కరపత్రాలు, పత్రికలు, తీర్మానాలు, సిద్ధాంత పత్రాలు చూస్తే, అవి సాధారణంగా ఎంత క్లిష్టమైన పద్ధతిలో రాసి వుంటాయంటే, పార్టీ శ్రేణుల మాట అటుంచి, మన పార్టీ ముఖ్యులకే అవి అర్థమవటం కష్టం.

అయితే ఏమిటి? డిమిట్రావ్ మనలోపాన్ని వేలెత్తిచూపడంలేదూ! అంటే, పార్టీ మూస రచనా పద్ధతి చైనాలోనే కాక విదేశాల్లో కూడా అమల్లో వుందన్నమాట. అంటే ఇది అందరికీ వున్న జబ్బేనన్న మాట (నవ్వులు). ఏది ఏమైనా, మనం కామ్రేడ్ డిమిట్రావ్ ఆదేశానుసారం మన జబ్బుని త్వరగా నయం చేసుకోవాలి.

మనలో ప్రతి ఒక్కరం దీన్ని ఒక నియమంగా, బోల్షివిక్ నియమంగా, ప్రాథమిక సూత్రంగా తీసుకోవాలి:

"రాసిన ప్రతిసారి, మాట్లాడిన ప్రతిసారి పార్టీ శ్రేణులను దృష్టిలో పెట్టుకోండి. వారు నిన్ను అర్థం చేసుకోవాలి, నీ పిలుపును విశ్వసించి, నిన్ను అనుసరించడానికి సిద్ధపడాలి: నువ్వు ఎవరికోసమైతే రాస్తున్నావో, ఎవరికోసమైతే మాట్లాడుతున్నావో, వారిని దృష్టిలో పెట్టుకోవాలి.

ఇది మనకు కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఇచ్చిన సూచన. దీన్ని మనం అనుసరించాలి. దాన్ని మనం ఒక నియమంగా తీసుకుందాం!

ఇక కరపత్రంలో మూడవ భాగం "లూసన్ పూర్తి రచనలు'' నుండి ఎన్నుకోవడం జరిగింది. అది 'ది డిప్పర్' అనే పత్రికకు లూసన్ సమాధానం. అందులో ఆయన ఎలా రాయాలో చర్చించాడు. లూసన్ ఏమన్నాడు? మొత్తం మీద ఆయన, రాయడానికి ఎనిమిది నియమాలను సూచించాడు. నేను ఇక్కడ వ్యాఖ్యానించడం కోసం కొన్నింటిని వాడతాను.

నియమం 1: "అన్ని రకాల విషయాలపై అత్యంత శ్రద్ధ వహించండి; ఎక్కువగా గమనించండి, కొంచెమే గమనించి వుంటే రాయకండి.''

ఆయన అనేదేమిటంటే, ఒకటో అరో విషయాలను పరిశీలించడంకాక "అన్ని రకాల విషయాలపై అత్యంత శ్రద్ధ వహించండి.'' ఆయన "ఎక్కువగా గమనించండి,'' అన్నాడు. అంటే, ఒక చూపో అర చూపో విసిరి ఊరుకోవద్దన్నాడు. మరి మనం ఏం చేస్తాం? మనం దీనికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించి, చాలా తక్కువగా గమనించి రాసేస్తూ వుండమూ?

నియమం 2: "చెప్పవలసిందేమీ లేనపుడు బలవంతంగా రాయకు.''

మరి మనం ఏం చేస్తాం? మన బుర్రల్లో ఏమీ లేదని స్పష్టంగా తెలిసినా మనం బలవంతంగా చాలా ఎక్కువ రాయమూ? పరిశీలన, అధ్యయనం లేకుండా కలం పట్టుకుని "బలవంతంగా రాయటం'' అనేది కేవలం బాధ్యతారాహిత్యమే అవుతుంది.

నియమం 4: "రాసిన తరువాత దాన్ని కనీసం రెండుమార్లు చదివి, పనికిరాని పదాలను, వాక్యాలను, పేరాలను ఏమాత్రం దిగులు పడకుండా కొట్టివేయాలి. నవలకు సరిపడే విషయాన్ని స్కెచ్‌కి తగ్గించుకోండిగాని, ఎప్పుడూ కూడా స్కెచ్‌కి సరిపోయే విషయాన్ని నవలగా అల్లకండి.''

"రెండుమార్లు ఆలోచించు'' అని సలహా ఇచ్చాడు కన్ఫూషియస్. "ఆలోచించడం ద్వారా ఒక పనిని పూర్తి చేయవచ్చు,'' అన్నాడు హాన్‌యూ. అది పూర్వకాలంలో. ఈనాడు పరిణామాలు చాలా క్లిష్టంగా వుంటున్నాయి. ఒకోసారి మూడు నాలుగుసార్లు ఆలోచించినా సరిపోదు. "కనీసం రెండుమార్లు చదువు,'' అన్నారు లూసన్. ఎన్ని ఎక్కువసార్లు చదవాలి? ఆయన అది చెప్పలేదు. కానీ నా ఉద్దేశ్యంలో, ఒక ముఖ్యమైన వ్యాసాన్ని ప్రచురించే ముందు దాన్ని పదిసార్ల కంటే ఎక్కువే చదివి, దాన్ని చైతన్యయుతంగా సరి చూడాలి. వ్యాసాలు భౌతిక వాస్తవికత యొక్క ప్రతిబింబం. ఆ భౌతిక వాస్తవికత సంక్లిష్టమైనది. దాన్ని సవ్యంగా ప్రతిబింబించాలంటే, పదే పదే అధ్యయనం చేయాలి. ఈ విషయంలో అజాగ్రత్తగా వుండటమంటే, రాత యొక్క ప్రాథమిక అంశాలు తెలీవనే అనుకోవాలి.

నియమం 6: "నీకు తప్ప మరెవరికీ అర్థం కాని విశ్లేషణాలను, ఇతర పదాలను సృష్టించకు.''

మనం "ఎవరికీ అర్థంకాని" వ్యక్తీకరణలను చాలానే సృష్టించాం." ఒకోసారి వాక్యంలోని ఒక భాగమే నలభై ఏభై పదాలతో కూర్చబడి, అందులో "ఎవరికీ అర్థంకాని విశ్లేషణాలు, ఇతర పదాలు" కిక్కిరిసి వుంటాయి. లూసన్‌ని అనుసరించమని నిర్విరామంగా బోధించేవారే ఆయనకు వెన్ను చూపిస్తారు!

ఇక కరపత్రం ఆఖరి భాగం, జాతీయ ప్రచార పద్ధతిని ఎలా అభివృద్ధి పరచాలన్న నివేదికలోది. ఈ నివేదికను చైనా కమ్యూనిస్టు పార్టీ ఆరవ కేంద్ర కమిటీ ఆరవ విస్తృత సమావేశంలో ఆమోదించారు. 1938లో జరిగిన ఈ సమావేశంలో మనం ఏమన్నామంటే, "చైనా ప్రత్యేక లక్షణాల నుండి విడదీసి మార్క్సిజం గురించి మాట్లాడటం నిర్దిష్టత లేని మార్క్సిజం అవుతుంది, శూన్యంలో మార్క్సిజం అవుతుంది." అంటే, మార్క్సిజం గురించి పనికిరాని విధంగా మాట్లాడే ప్రతిమాటను మనం వ్యతిరేకించాలి. చైనాలో వుండే కమ్యూనిస్టులు మార్క్సిజాన్ని చైనా విప్లవ వాస్తవికతతో జోడించి అధ్యయనం చేయాలి.

నివేదికలో ఇలా వుంది:

విదేశీ మూస పద్ధతులను నిర్మూలించాలి, పనికిరాని అవాస్తవిక రాగాలాపనను తగ్గించాలి, పిడివాదాన్ని కట్టిపెట్టాలి. వాటిబదులు, చైనా సామాన్య ప్రజానీకం ప్రేమించే స్వచ్ఛమైన, సజీవమైన చైనా పద్ధతిని, ఉత్తేజాన్ని పెంపొందించాలి. అంతర్జాతీయ వస్తువును జాతీయ రూపం నుండి వేరు చేసి చూడటం అనేది అంతర్జాతీయ ఓనమాలు తెలియని వాళ్ల పద్ధతి. తద్వ్యతిరేకంగా మనం ఈ రెండింటినీ దగ్గరగా జోడించాలి. ఈ విషయంలో మన శ్రేణుల్లో చాలా తీవ్రమైన పొరపాట్లు వున్నాయి. వాటిని మనం చైతన్యయుతంగా అధిగమించాలి.

ఆ నివేదికలో విదేశీ మూస పద్ధతులను నిర్మూలించమని పిలుపునిచ్చాం, కానీ కొందరు కామ్రేడ్స్ వాటిని ఇంకా ప్రోత్సహిస్తూనే వున్నారు. పనికిరాని అవాస్తవిక రాగాలాపనను తగ్గించమన్నాం, కానీ కొందరు కామ్రేడ్స్ మొండిగా, వాటిని ఇంకా ఎక్కువగా ఆలపిస్తున్నారు. పిడివాదాన్ని కట్టిపెట్టమన్నాం, కానీ కొందరు కామ్రేడ్స్ దాన్ని మేల్కొల్పుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఆరవ విస్తృత సమావేశంలో ఆమోదించిన ఈ నివేదికను చాలా మంది ఉద్దేశ పూర్వకంగానే వ్యతిరేకిస్తున్నారా అన్నట్టు, ఇక చెవితో విని, మరొక చెవితో వదిలేశారు.

మనం ఇప్పుడు పార్టీ మూస రచనా పద్ధతి, పిడివాదం మొదలగు వాటిని శాశ్వతంగా విడనాడాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది. అందుకే నేను ఇక్కడికొచ్చి దీర్ఘంగా ప్రసంగించవలసి వచ్చింది. మన కామ్రేడ్స్ నేను చెప్పిన దాన్ని పునరాలోచించి, విశ్లేషించుకుంటారని, అలానే ప్రతి కామ్రేడ్ తన సొంత విషయంలో కూడా విశ్లేషణ జరుపుకుంటారని ఆశిస్తున్నాను. ప్రతి ఒక్కరూ తమని తాము పరీక్షించుకోవాలి. తను స్పష్టం చేసిన దాన్ని గురించి తన స్నేహితులతోను, చుట్టూవున్న కామ్రేడ్స్‌తోనూ చర్చించాలి. అలా అతను తన లోపాలను నిజంగా అధిగమించాలి.

**వివరణ**

* 15వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకు చైనా భూస్వామ్య వంశాలు తమ రాచరిక పరీక్షల్లో ప్రతిపాదించిన ప్రత్యేక వ్యాసం యొక్క రూపమే మూస పద్ధతి రచనా విధానం, లేక "ఎనిమిది పాదాల వ్యాసం." అది మాటల గారడీ. అది రూపానికి ప్రాధాన్యతనిచ్చి, వస్తువును వదిలివేసే విధానం. నిర్మాణాత్మకంగా వ్యాసం ప్రధాన భాగంలో ఎనిమిది అంశాలు వుండేవి. అవి, వ్యక్తీకరణ, విస్తృతీకరణ, ప్రథమ వివరణ, మొదటివాదన, ఆరంభ ఖండం, మధ్యఖండం, వెనుకఖండం, అంతిమఖండం, ఇవికాక ఐదు నుండి ఎనిమిదవ అంశం వరకు ప్రతిదానికి రెండు "పాదాలు" వుంటాయి. అంటే, రెండు వ్యతిరేక ఖండాలు. కాబట్టి దానికి "ఎనిమిది పాదాల వ్యాసం" అని పేరు వచ్చింది. మూస పద్ధతిలో లాంఛనప్రాయంగా రాయడానికి, పాతరాత పద్ధతులకు, చైనాలో "ఎనిమిది పాదాల వ్యాసం" ఒక ఊతపదమైపోయింది. కాబట్టి, "మూస పద్ధతి పార్టీ రచనా విధానం" అనేది, విప్లవ శ్రేణుల్లోని కొందరు, వాస్తవాలను విశ్లేషించకుండా విప్లవ పదజాలాన్ని ఎడాపెడా వాడడానికి వర్తిస్తుంది. "ఎనిమిది పాదాల వ్యాసం"లాగా వాళ్ల రచనలు కూడా కేవలం వాగాడంబరం మీదనే ఆధారపడ్డాయి.

★

---

*(....7వ పేజీ తరువాయి)*

చివరగా రాజ్యహింస, సల్వాజుడూం హత్యాకాండ, ముదిగొండ కాల్పులు, వాకపల్లి మహిళలపై జరిగిన అత్యాచారాలు, మహిళల మీద జరుగుతున్న రాజ్యహింస, ముస్లిం మైనారిటీలపై రాజ్యహింస, దళితులపై దాడులు, భారత్-అమెరికా అణు ఇంధన సహకార ఒప్పందం, రైతుల ఆత్మహత్యలు, నల్లదండు ముఠాల హత్యలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, పోలవరం, సింగరేణి నిర్వాసితుల సమస్యలపై మహాసభ పలు తీర్మానాలు చేసింది.

చివరగా మహాసభ కార్యక్రమాన్ని పరిసమాప్తం చేస్తూ క్యాంపంతా అరుణపతాకం ముందు నిలబడి, అంతర్జాతీయ గీతం ఆలపించిన తర్వాత ఎర్రజెండాను కామ్రేడ్ జంపన్న అవనతం చేసాడు. ఆ తదుపరి నూతన కార్యదర్శి కామ్రేడ్ చంద్రన్న ముగింపు ఉపన్యాసాన్ని ఇస్తూ మహాసభను విజయవంతం చేయటంలో సహాయపడిన అందరికీ విప్లవాభివందనాలు తెలియజేసాడు. అలాగే తాత్కాలిక సెట్ బ్యాక్ అయిన ఎన్.టి ఉద్యమాన్ని దృఢ సంకల్పంతో ముందుకు తీసుకెళ్లాలని పార్టీనీ, పి.ఎల్.జి.ఎ యోధులను కోరాడు.

★

# అమరవీరులకు జోహార్లు

## ఎ.పి అమరులు

### కామ్రేడ్ భగత్

కా. భగత్ గుంటూరు జిల్లా నర్సరావుపేటలో దళిత, మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. పై చదువులు చదువలేక ఉన్న చదువుతోని ఉద్యోగం కోసం ప్రయత్నించి విఫలమయి కార్పెంటర్ పని చేస్తూ బతుకుతున్న క్రమంలో ప్రజా సంఘాల పరిచయాల్లోకి వచ్చాడు. క్రమంగా ఆ సంఘాల కార్యకలాపాల్లో చురుకైన పాత్ర వహించాడు. ఆ సమయంలో పల్నాడు ప్రాంతంలో ఉధృతంగా జరుగుతున్న కరువుదాడులూ, ప్రజాపోరాటాలను చూసి ఆ ప్రాంతానికి వచ్చాడు.

2002లో పూర్తికాలం కార్యకర్తగా చంద్రవంక దళంలో చేరాడు. వేమగిరిలోని ఫారెస్టు భూముల పంపకంలోనూ, జూలకల్లు భూముల పంపకంలోను పాల్గొన్నాడు. గుమ్మడాడులో జరిగిన కరువు దాడిలో కూడా పాల్గొన్నాడు. కొద్ది కాలానికే 2003లో గుత్తికొండ దళ కమాండర్ బాధ్యతలు చేపట్టాడు.

కా. భగత్ పట్టణంలో పుట్టి పెరిగినప్పటికీ దళ జీవితానికి చైతన్యయుతంగా అలవాటుపడ్డాడు. కష్టపడి పని చేసేవాడు. లంబాడీ భాషను నేర్చుకొని, వారికి రాజకీయాలు చెప్పేవాడు. ప్రజలతో, క్యాడర్‌తో సన్నిహితంగా కల్సిపోతూ వాళ్ల అభిమానాన్ని చూరగొన్నాడు.

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చైతన్యయుతమైన కృషి చేసేవాడు. ఈ క్రమంలో ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు చుట్టుముట్టి దళం మీద ఫైరింగ్ చేశారు. తన ఫైరింగ్‌తో పోలీసులకు జవాబిస్తూ రిట్రీట్ అయి ఆర్.వి ప్లేస్‌కు వెళ్తున్న క్రమంలో కామ్రేడ్ భగత్‌ను పాపయ్య అనే మిలీషియా కామ్రేడ్‌తో సహా పోలీసులు పట్టుకొని 2003, డిసెంబర్ 18న కాల్చిచంపారు.

కా. భగత్ ఆదర్శాలను ఎత్తిపడుతూ, అతని ఆశయసాధనలో ముందుకు సాగుదాం.

### కామ్రేడ్ పాపయ్య (శ్రీధర్)

కామ్రేడ్ పాపయ్య గుంటూరు జిల్లా కారంపూడి మండలం సన్నిగండ్ల గ్రామస్తుడు. వీరిది చాలా పేద కుటుంబం. ఈ గ్రామంలో భూస్వాముల పీడన బలంగా వుండేది. 1991-92లలో ఈ గ్రామం పార్టీ పరిచయాల్లోకి వచ్చింది. అయితే భూస్వాములను ఎదిరించి ప్రజలు పార్టీకి దగ్గరవడానికి భయపడేవారు. అటువంటి పరిస్థితుల్లో కా. పాపయ్యతో సహా మరికొద్ది మంది పార్టీ పరిచయాల్లోకి వచ్చి భూస్వాములను ఎదిరించారు.

కామ్రేడ్ పాపయ్య నాయకత్వంలో గ్రామంలో సంఘం ఏర్పడి భూ ఆక్రమణ పోరాటాలు ముందుకు వచ్చాయి. తన ఆధ్వర్యంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. కరడుగట్టిన భూస్వాములను దేహశుద్ధి చేయడంలో, ఆర్థికంగా నష్టపరచడంలో కా. పాపయ్య ముందు పీఠిన వున్నాడు. చివరికి భూస్వాములు పాపయ్య అంటే హడలిపోయి లొంగివచ్చారు.

ఇలా విప్లవోద్యమంలో చురుకైన పాత్ర వహిస్తున్న కా. పాపయ్యను పోలీసులు అరెస్ట్ చేసి తీవ్ర చిత్రహింసలతోనూ, ప్రలోభాలతోనూ లొంగదీసుకునే ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ కా. పాపయ్యలోని విప్లవదీక్ష మొక్కవోలేదు. జైలు నుండి విడుదలై వచ్చిన తర్వాత రహస్యంగా వుంటూ పార్టీ కార్యకలాపాలు కొనసాగించాడు. తన నాయకత్వంలో ముగ్గురిని దళంలోకి రిక్రూట్ చేశాడు.

ఈ క్రమంలో 2003 మధ్యలో జూలకల్లు వద్ద పోలీసులు కా. భగత్ తోటి కా. పాపయ్యను నిరాయుధంగా పట్టుకొని కాల్చిచంపారు.

కా. పాపయ్యకు భార్యా, పిల్లలు వున్నారు. అయినప్పటికీ కుటుంబానికి లోబడి తన కార్యాచరణ ఎన్నడూ లేదు. సామాజిక శ్రేయస్సు పైనే కుటుంబ శ్రేయస్సు ఆధారపడి వుంటుందని విశ్వసించాడు. అందుకే సామాజిక శ్రేయస్సు కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు.

కా. పాపయ్య జీవితం ఆదర్శపూరితం. ఆ ఆదర్శాలను దృఢంగా కొనసాగిద్దాం.

### కామ్రేడ్ సునీత (మరియమ్మ)

కా. సునీతది గుంటూరు జిల్లా దుర్గి మండలంలోని అడిగొప్పుల గ్రామం. పేద దళిత కుటుంబంలో పుట్టిన ఆమెకు తల్లిదండ్రులు చిన్న వయసులోనే పెళ్లి చేశారు. తాగుబోతు భర్తతో ఆమె అనేక ఇబ్బందులు పడింది. దానికి తోడు అత్తమామల వేధింపులతో ఉక్కిరి బిక్కిరయింది. ఆ వేధింపులను భరించలేక గ్రామంలోని పార్టీకి తెలియజేసింది. పార్టీ ఎంత చెప్పినప్పటికీ ఆమె భర్త, అత్తమామల్లో మార్పు రాలేదు. దానితో ఆమె తన విముక్తితో పాటు సమస్త మహిళల విముక్తిని సాధ్యం చేసే పోరుబాటనెంచుకుంది.

2003 ఆఖరులో ఆమె చంద్రవంక దళ సభ్యురాలిగా రిక్రూట్ అయింది. ఆ తర్వాత కొద్దిరోజులకే ప్లటూన్‌కు బదిలీ అయింది. 2004లో రెమిడిచర్ల వద్ద చేసిన రెండు ఆంబుష్‌ల్లో చురుగ్గా పాల్గొంది.

ఆ తర్వాత బండ్లమోటు స్టేషన్‌పై చేసిన రాకెట్ దాడిలోనూ పాల్గొంది. చిలుకలూరిపేట, అద్దంకి పోలీస్ స్టేషన్‌పై చేసిన దాడుల్లో అసాల్ట్ టీముల్లో వుండి ధైర్యంగా పాల్గొంది. భూస్వాములను శిక్షించిన ఘటనల్లోనూ పాల్గొంది.

కా. సునీతది కష్టపడే స్వభావం. ఎంతపనైనా ఓపిగ్గా చేసేది. ఇంటి దగ్గర చదువన్నది తెలియకపోయినా పార్టీలో చాలా వేగంగా చదువు నేర్చుకొని పుస్తకాలు చదివేది. కామ్రేడ్స్ దగ్గర తెలియని విషయాలు అడిగి తెలుసుకోవడంలో నిరంతరం జిజ్ఞాసను చూపేది. ఉద్యమంతో పాటు తాను అభివృద్ధి చెందాలని నిరంతరం తపన పడేది.

ఆ క్రమంలో ప్రయాణిస్తుండగానే 2005 జనవరిలో ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం మఱ్రివేముల వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో కా. వసంతతో పాటు కా. సునీత అమరురాలయింది.

కా. సునీత కలలుకన్న మహిళా విముక్తిని నిజం చేయడం కోసం దృఢంగా ముందుకు నడుద్దాం.

### కామ్రేడ్ వసంత (పార్వతి)

కామ్రేడ్ వసంత గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామస్తురాలు. వాళ్ల గ్రామంలో జరుగుతున్న విప్లవ పోరాటాలనూ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రభావితురాలై 2004 నవంబర్‌లో గుత్తికొండ బిళం దళంలోకి రిక్రూట్ అయింది.

కా. వసంత చాలా చొరవ కల్గిన కామ్రేడ్. ఎప్పుడూ గలగలా మాట్లాడుతూ అందరితోనూ కల్సిపోయేది. ఎంతపనైనా నవ్వుతూ చేసేది. కొద్ది కాలానికే చదువు నేర్చుకుంది.

ఇంకా ఎంతగానో ఎదగాల్సి వున్న ఈ కామ్రేడ్ రిక్రూట్ అయిన కొద్ది కాలానికే 2005 జనవరిలో మఱ్రివేముల వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో కా. సునీతతో సహా అమరురాలైంది.

కా. వసంత ఆశయాలను నెరవేర్చుతామని ప్రతిజ్ఞ చేద్దాం.

### కామ్రేడ్ మరియమ్మ (విజయ)

కామ్రేడ్ విజయ(26) గుంటూరు జిల్లా గురజాల మండలం గోగులపాడు గ్రామంలో ఒక నిరుపేద దళిత కుటుంబంలో పుట్టింది. తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కూతురవడం మూలంగా అల్లారుముద్దుగా పెరిగింది. పేదరికం మూలంగా తల్లిదండ్రులు ఆమెను రెండవ తరగతికి మించి చదివించలేకపోయారు.

గోగులపాడు గ్రామం పోరాటాల గడ్డయిన పల్నాడులో వుంది. 1990 నుండీ ఆ వూళ్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఉధృతంగా సాగేవి. ఆ ప్రభావం కా. విజయ మీద పడింది. దానితో ఆమె పార్టీలో పని చేయాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో తల్లిదండ్రులు ఆమెకు పెళ్లి చేయాలని నిశ్చయించుకొని సంబంధం ఖాయం చేశారు. ఆమె ఆ పెళ్లిని వ్యతిరేకిస్తూ, పెళ్లి వారం రోజుల్లో ఉందనగా ఇంట్లో నుండి వచ్చేసి పార్టీకి కలువడానికి ప్రయత్నించింది. పార్టీ వెంటనే కలువకపోవడంతో మూడు నెలలు ఆ పనీ ఈ పనీ చేసుకుంటూ కాలం గడిపి పార్టీ సంబంధాలను పట్టుకుంది. పార్టీ కలువగానే, తనను దళంలో చేర్చుకొమ్మని కోరింది. అయితే వెంటనే అలా తీసుకోవడం కుదరదనీ, ఆరు నెలలు ఒక గ్రామంలోని మహిళా సంఘంలో పని చేయాలని పార్టీ చెప్పింది. కా. విజయ పార్టీ సూచనను అంగీకరించింది.

ఆ తర్వాత 1998లో ఆమె దళంలో చేరింది. 98 నుండి 2000 వరకూ దాచేపల్లి దళంలో సభ్యురాలిగా పని చేసింది. ఆ తర్వాత కొన్నాళ్లు చంద్రవంక దళంలో పని చేసింది. 2001-02లలో వెల్దుర్తి దళ సభ్యురాలిగా ఉంటూ మహిళా సంఘ బాధ్యతలు చేపట్టింది. ఈ సమయంలో ఏరియాలో విస్తృతంగా జరిగిన సారా వ్యతిరేక పోరాటంలో కా. విజయ తగిన పాత్రను పోషించింది. 2003లో ఎ.సి సభ్యురాలై దాచేపల్లి దళ కమాండర్‌గా బాధ్యతలను స్వీకరించింది. ఈ కాలంలో పలు రైతాంగ సమస్యలపై పోరాటాలను చేపట్టింది. 2004లో చంద్రవంక ఏరియాకు బదిలీ అయింది. ఈ కాలంలో అడిగొప్పుల గ్రామంలో భూస్వాములకు వ్యతిరేకంగా ఉధృతంగా జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించింది. ఇదే సమయంలో వచ్చిన చర్చల వెసులుబాటు కాలాన్ని వినియోగించుకొని విస్తృతమైన ప్రజా సమీకరణ చర్యలకు నాయకత్వం వహించింది. అనేక గ్రామాల్లో అమరవీరుల స్థూపాలను నిర్మించేందుకు ప్రజలను ప్రోత్సహించింది.

కా. విజయ పలు మిలటరీ ఘటనలలో చురుకైన పాత్ర వహించింది. పలువురు మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డ జూలకల్లు గ్రామస్తుడైన వలి అనే గూండాను ఖతం చేసిన మహిళా టీంకు నాయకత్వం వహించింది. ప్రజా వ్యతిరేకులైన నరవాలపాడు, అడిగొప్పుల భూస్వాములను ఖతం చేసిన చర్యలోనూ పాల్గొంది. 2004 జూలైలో జరిగిన బస్సు ఆంబుష్‌లో చురుకైన పాత్రను వహించింది.

దుర్గి పోలీస్ స్టేషన్ పైన చేసిన రాకెట్ల దాడిలోనూ, పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్న అద్దంకి పోలీస్ స్టేషన్‌పై చేసిన దాడిలోనూ, చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌పై చేసిన దాడిలోనూ కామ్రేడ్ విజయ చురుకైన పాత్ర వహించింది. ఆమెలోని మిలటరీ సమర్థతల మూలంగా 2004లో మొట్ట మొదట ఏర్పాటు చేసిన ప్లటూన్‌లో బి సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించింది. ప్లటూన్ పాల్గొన్న అన్ని చర్యల్లోనూ ఆమె చురుకైన పాత్ర వహించింది.

ఆర్గనైజేషనల్‌గానూ, మిలటరీపరంగానూ చురుకైన పాత్రను వహిస్తూ కా. విజయ 2006లో చంద్రవంక ఏరియా కమిటీ కార్యదర్శి బాధ్యతలను చేపట్టింది. ఈ బాధ్యతలను నిర్వర్తిస్తున్న క్రమంలో 2005 డిసెంబర్‌లో మర్రివేముల గ్రామం వద్ద ప్లటూన్‌పై జరిగిన దాడిలో కా. విజయ తన సహచరుడు కా. సునీల్‌తో పాటు అమరురాలయింది.

కా. విజయలోని సమర్థతలను అలవర్చుకోవడం ద్వారా ఆమె ఆశయాలను కొనసాగిద్దాం.

## కామ్రేడ్ కోటేశ్వరరావు (సునీల్)



కామ్రేడ్ సునీల్ (28) గుంటూరు జిల్లా కారంపూడి మండలం గజవారిపల్లిలో నిరుపేద దళిత కుటుంబంలో పుట్టాడు. ఆ వూరిలో మొదట జనశక్తి పార్టీ ప్రభావం వుండేది. కా. సునీల్ మొదట జనశక్తి పార్టీ వైపు ఆకర్షితుడయ్యాడు. ఆ తర్వాత మావోయిస్టు పార్టీ చేత ప్రభావితుడై 1998-99 కాలంలో పరిచయాలలోకి వచ్చాడు. క్రమంగా గురజాలలో ఇంటర్ చదువుతూ ఆర్.ఎస్.యులో పని చేయడం ప్రారంభించాడు. 2000లో పూర్తికాలం కార్యకర్తగా మారాడు. ఆర్.ఎస్.యులో పని చేస్తుండగానే 2002లో అరెస్టయి ఒక సంవత్సర కాలం జైలు జీవితం గడిపాడు. జైలు నుండి విడుదలైన తర్వాత తిరిగి ఆర్.ఎస్.యులోనే తన విప్లవ కార్యాచరణను కొనసాగించాడు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పని చేశాడు.

కొంత కాలానికి దళ జీవితంలోకి వచ్చాడు. 2004లో జిల్లాలో మొదటగా ప్లటూన్ ఏర్పాటు చేయగా అందులో సెక్షన్ డిప్యూటీగా బాధ్యతలు స్వీకరించాడు. 2005లో బి సెక్షన్ కమాండర్ అయ్యాడు.

ప్లటూన్‌లో వుంటూ జిల్లాలో జరిగిన అనేక మిలటరీ ఘటనల్లో చురుగ్గా పాల్గొన్నాడు. దుర్గి, చిలకలూరిపేట పోలీస్ స్టేషన్ పైన జరిగిన దాడుల్లో చురుకైన పాత్ర వహించాడు. ఇన్ఫార్మర్లనూ, హోంగార్డులనూ ఖతం చేసిన పలు ఘటనల్లో కా. సునీల్ పాల్గొన్నాడు. ప్లటూన్‌పై జరిగిన అనేక దాడులను ప్రతిఘటించడంలో తమ సెక్షన్ చురుగ్గా పాల్గొనేలా నాయకత్వం వహించాడు.

అనారోగ్యం ఉన్నప్పటికీ దాన్ని లెక్క చేయకుండా ప్లటూన్‌తో పాటు నడుస్తూ, అన్ని పనుల్లోనూ చురుగ్గా పాల్గొనేవాడు.

కా. సునీల్ మంచి టీచర్. రాజకీయాలను క్యాడర్‌కు సులువుగా అర్థం చేయించేలా కృషి చేసేవాడు. తను మంచి చదువరి కూడా.

ఇలా విప్లవోద్యమంలో చురుకైన పాత్ర వహిస్తోన్న కా. సునీల్ ప్రకాశం జిల్లా మర్రివేముల సమీపంలో 2005 డిసెంబర్‌లో ప్లటూన్‌పైన జరిగిన దాడిలో తన సహచరి కా. విజయతో పాటు అమరుడయ్యాడు.

కా. సునీల్ ఆశయాలను కొనసాగించడమే మన ముందున్న కర్తవ్యం.

## కామ్రేడ్ రఘు



కామ్రేడ్ రఘు (27) క్రిష్ణా జిల్లాకు చెందినవాడు. వాళ్లది విప్లవ రాజకీయ కుటుంబం కావడం వల్ల రఘుకు చిన్నప్పట్నుంచీ విప్లవ రాజకీయాలు పరిచయమే. పదవ తరగతి పూర్తి చేసిన తర్వాత కొన్నాళ్లు విప్లవ సాంస్కృతిక సంఘంలో పని చేశాడు. ఆ సమయంలో అనేక సభలలో ప్రదర్శనలు ఇచ్చాడు.

2003లో గుంటూరు జిల్లాలోని బెల్లంకొండ దళంలో సభ్యుడిగా చేరాడు. ఆ దళ ప్రాంతంలో జరిగిన అన్ని పోరాటాల్లో చురుకైన పాత్ర వహించాడు. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున జరిగిన కరువు దాడుల్లోనూ పాల్గొన్నాడు. 2005-06లలో గుత్తికొండ దళ కమాండర్‌గా పని చేశాడు.

ప్రజా వ్యతిరేకుల పట్ల విపరీతమైన ద్వేషాన్ని కల్గి వుండేవాడు. పలువురు ప్రజా వ్యతిరేకులను ఖతం చేసిన చర్యలకు నాయకత్వం వహించాడు.

చర్చల కాలంలో గుత్తికొండ గ్రామంలోని భూములను పేదలకు పంపిణీ చేయడంలో పాల్గొన్నాడు. చర్చల సమయంలో చర్చల ప్రతినిధుల రక్షణ బృందంలోనూ సభ్యుడిగా వున్నాడు.

కా. రఘు తోడబుట్టిన అక్క పార్టీలో పని చేసి తిరిగి వెళ్లిపోయినప్పటికీ తను దృఢంగా నిలబడ్డాడు. 2006లో ఎడతెరిపి లేకుండా గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ చేస్తూ ప్లాటూన్‌ను చుట్టిముట్టిన సందర్భంలో కూంబింగ్‌ను దారి మళ్లించడం కోసం కొదమగుండ్ల గ్రామంలో ఒక ఇన్ఫార్మర్‌ను ఖతం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఆ నిర్ణయాన్ని అమలు చేయడం కోసం వెళ్లిన కామ్రేడ్ రఘు చర్యను విజయవంతం చేసి వస్తున్న క్రమంలో శత్రు ఆంబుష్‌లో చిక్కుకుని అమరుడయ్యాడు. ఇదే ఘటనలో కామ్రేడ్ వాసు కూడా అమరుడయ్యాడు.

ఆ విధంగా కామ్రేడ్ రఘు తన ప్రాణాలను ఫణంగా పెట్టి శత్రువును దారి మళ్లించి మొత్తం ప్లటూన్‌ను సురక్షితంగా తప్పించుకునే అవకాశాన్ని కల్పించాడు.

కా. రఘు సాహసాన్ని అలవర్చుకొని అతని ఆశయసాధనలో ముందుకు సాగుదాం.

## కామ్రేడ్ వాసు

కామ్రేడ్ వాసు (20) గుంటూరు జిల్లా, పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామంలో ఒక దళిత కుటుంబంలో పుట్టాడు. ఆ గ్రామం మొదటి నుండీ పార్టీకి కోటలాగా ఉండేది. ఆ ప్రభావంతో కామ్రేడ్ వాసు రాడికల్ బాలల సంఘ సభ్యుడై తన పోరు నడక మొదలుపెట్టాడు. గ్రామంలోకి దళం వస్తే చిన్నతనం నుంచీ బాధ్యతగా అన్ని ఏర్పాట్లు చేసేవాడు. సెంట్రీలు చేసేవాడు. పోలీసులు వస్తే డబ్బా బాంబులు పేల్చి శత్రువును గందరగోళపర్చేవాడు.

అతనిలోని ఆ విప్లవదీక్ష వల్ల చిన్నతనంలోనే దళంలో చేరాడు. 2004లో దాచేపల్లి దళంలో తన దళ జీవితాన్ని ప్రారంభించిన వాసు ఆ తర్వాత చంద్రవంక దళంలో కొన్నాళ్లు పని చేశాడు. మరి కొన్నాళ్లు గుత్తికొండ దళంలోనూ పని చేశాడు. కా. వాసు మొత్తంగా ఎక్కువ కాలం ఇద్దరితో కూడిన (1+1) దళంలో కా. రఘుతో కల్సి పని చేశాడు.

తన విప్లవ జీవితంలో పలు భూపోరాటాలలో చురుగ్గా పాల్గొన్నాడు. పలు సందర్భాల్లో సభలకు ప్రజలను కదిలించడంలో చాలా చొరవగా ఉండేవాడు. ఎంత కష్టమైన పని అయినా ఎంతో రాత్రి అయినా పార్టీ అప్పగించిన పనులను తప్పకుండా చేసేవాడు. ప్రజలతోనూ చొరవగా కల్సిపోయేవాడు. చిన్నవాడు అయినప్పటికీ ఎంతో పెద్దవాడిలా పరిణతిలో మాట్లాడి పెద్దలను మెప్పించేవాడు. దళంలోకి వచ్చిన తర్వాత ఎంతో శ్రద్ధగా చదువు నేర్చుకున్నాడు.

ఇలా చిన్న వయసులోనే పార్టీ రాజకీయాలపట్ల ఎంతో విశ్వాసాన్ని ప్రకటించి, నమ్మిన ఆశయం కోసం పోరుబాటలో దృఢంగా నడుస్తున్న సమయంలో 2006లో కా. రఘుతో కల్సి ఇన్ఫార్మర్‌ను ఖతం చేసిన చర్యలో పాల్గొని తిరిగి వస్తున్న క్రమంలో శత్రువు మాటు దాడిలో కొదమగుండ్ల వద్ద కా. రఘుతో పాటే అమరుడయ్యాడు.

ఏ ఆశయసాధన కోసం కా. వాసు అమరుడయ్యాడో ఆ ఆశయాన్ని నెరవేర్చడం కోసం దృఢంగా పోరాడుదాం.

## కామ్రేడ్ మరియమ్మ (లత)

కామ్రేడ్ లత (21) గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టింది. ఈ గ్రామం పార్టీకి బలమైన గ్రామం. కరడుగట్టిన భూస్వాములతో దృఢంగా పోరాడిన గ్రామం. జిల్లాలో మొట్ట మొదట ఇదే గ్రామంలో ప్రజా కంటకులైన అచ్చిరెడ్డి, అంకిరెడ్డి అనే భూస్వాములను పార్టీ ఖతం చేసింది.

ఇటువంటి గ్రామంలో పుట్టిన కామ్రేడ్ లత చిన్నప్పట్నుంచీ విప్లవ రాజకీయాల మధ్యనే పెరిగింది. పేదరికం వల్ల రెండవ తరగతి వరకు మాత్రమే చదువుకో గలిగింది. చిన్నప్పుడే రాడికల్ బాలల సంఘంలో చేరి విప్లవ కార్యాచరణను మొదలు పెట్టింది. క్రమంగా తన చైతన్యాన్ని పెంచుకుంటూ 2004 చివర్లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయి ప్లటూన్ సభ్యురాలయింది. ప్లటూన్ చేసిన అన్ని చర్యలలోనూ చురుగ్గా పాల్గొంది. చర్చల కాలంలోని వెసులుబాటు సమయంలో మహిళలను కూడగట్టే కర్తవ్యాన్ని స్వీకరించి, ఇద్దరితో కూడిన దళంలో చురుగ్గా తిరిగింది. ప్రజల్లో చురుగ్గా కల్సిపోతూ తనకు తెల్సిన రాజకీయాలను వారికి చెప్పేది.

చర్చల తర్వాత మళ్లీ ప్లటూన్‌లో పని చేస్తున్న క్రమంలో, 2006 జనవరిలో ప్లటూన్‌పై జరిగిన దాడి నుంచి మరొక ప్లటూన్ సభ్యురాలితో కల్సి తప్పించుకొని అడిగొప్పుల గ్రామంలో ఆశ్రయం పొందుతుండగా పోలీసులు వీరిద్దరినీ పట్టుకొన్నారు. పోలీసులు క్రూరమైన చిత్రహింసలు పెట్టడంతో మరొక సభ్యురాలు లొంగిపోయింది. కా. లత ఆ చిత్రహింసలను త్యాగనిరతితో భరించింది గానీ ఒక్క రహస్యం కూడా శత్రువుకు చెప్పలేదు. దానితో పోలీసులు కా. లతను వెల్దుర్తి మండలం దావుపల్లి సమీపంలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కట్టు కథ అల్లారు.

కా. లతలోని త్యాగనిరతిని ఎత్తిపడుదాం. ఆమె ఆశయాన్ని కొనసాగిద్దాం.

## కామ్రేడ్ సైదా (రాజు)

కా. రాజుది గుంటూరు జిల్లా నకిరకల్లు మండలం సల్లగుళ్లగ్రామం. అయితే బతుకుదెరువు కోసం కారంపూడి వెళ్లి అక్కడ డ్రైవర్‌గా పని చేసే క్రమంలో పార్టీ పరిచయాల్లోకి వచ్చాడు.

చంద్రవంక ఏరియాలో జరుగుతున్న భూపోరాటాలను చూసి ప్రభావితుడై 2004లో పార్టీలోకి రిక్రూట్ అయ్యాడు. రిక్రూట్ అయినప్పటి నుండీ ప్లటూన్ సభ్యుడిగానే పని చేశాడు. కా. రాజు డ్రైవరేకాక మంచి మెకానిక్ కూడా. అతనిలో వున్న నైపుణ్యాలు ప్లటూన్‌కు ఎంతగానో ఉపయోగపడ్డాయి. చిలకలూరిపేట, దుర్గి, త్రిపురాంతకం పోలీస్ స్టేషన్లపై చేసిన దాడుల్లో డ్రైవర్‌గా వుండి బలగాలను సురక్షితంగా గమ్యం చేర్చాడు.

పోలీస్ స్టేషన్‌పై చేసిన దాడుల్లో పలు సందర్భాల్లో రెక్కీని నిర్వహించాడు. గురజాల మండలం మాడుగుల వద్ద మందుపాతర పేల్చిన సంఘటనలోనూ కా. రాజు రెక్కీ నిర్వహించాడు. కా. రాజు శత్రువుపట్ల తీవ్రమైన కసిని ప్రదర్శించేవాడు. ప్లటూన్ మీద దాడులు జరిగిన పలు సందర్భాల్లో శత్రువును ధైర్యంగా ప్రతిఘటించాడు. నకిరకల్లు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముందువరసలో ఉండి ఫైరింగ్ చేసి మిగితా ప్లటూన్‌ను కాపాడాడు.

ఒకసారి నరమాలపాడు వద్ద పోలీసులు పట్టుకుంటే ఏమాత్రం భయపడకుండా, సాధారణ డ్రైవర్‌నని చెప్పి పోలీసులను నమ్మించి తప్పించుకున్నాడు.

ఇలా విప్లవోద్యమాన్ని దృఢంగా అంటిపెట్టుకున్న కా. రాజు, అనారోగ్య కారణంగా చికిత్స కోసం బయటకు వెళ్లినప్పుడు సల్లగుళ్ల వద్ద పోలీసులు చుట్టిముట్టి, పట్టుకొనే అవకాశం ఉన్నప్పటికీ పట్టుకోకుండా ప్రజలంతా చూస్తుండగానే కాల్చిచంపి తమ క్రూరత్వాన్ని చాటుకున్నారు.

విప్లవోద్యమం పట్ల కా. రాజు ప్రదర్శించిన అంకితభావాన్ని ఎత్తిపడుదాం. తన ఆశయాన్ని ముందుకు తీసుకుపోదాం.

## కామ్రేడ్ గురవయ్య (రమేష్)

కామ్రేడ్ రమేష్‌ది గుంటూరు జిల్లా, కారంపూడి మండలం, వేపసన్నెగండ్ల గ్రామం. దళిత కుటుంబంలో పుట్టాడు. వాళ్ల గ్రామంలో జరుగుతున్న భూపోరాటాలను చూసి ఉత్తేజితుడై గ్రామ సంఘంలో చేరి చురుగ్గా పని చేసాడు. భూస్వాములకు ఎదురునిలిచాడు. గ్రామంలో పార్టీ పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న వారినీ, పెత్తందారులను శిక్షించడంలోనూ, మండల అధ్యక్షురాలు పద్మావతి ఇంటిని పేల్చడంలోనూ కా. రమేష్ చురుకైన పాత్ర వహించాడు.

అలా పలు పోరాటాల్లో పాల్గొంటూ తన చైతన్యాన్ని పెంచుకొని 2004లో దళ సభ్యుడిగా రిక్రూట్ అయ్యాడు. కా. రమేష్‌కు అప్పటికే పెళ్లయి, ఇద్దరు పిల్లలు కూడా వున్నారు. అయినప్పటికీ తనలోని విప్లవ ఆకాంక్షను కుటుంబ బంధనాలు అడ్డుకోలేకపోయాయి.

మొదట చంద్రవంక దళంలో చేరి కొన్నాళ్ల తర్వాత ఇద్దరితో కూడిన (1+1) దళంలో పని చేశాడు. గుత్తికొండ ఏరియాలో జరిగిన భూపోరాటాల్లో చురుకైన పాత్ర వహించాడు.

కా. రమేష్ ప్రజలతో చొరవగా కలిసిపోయేవాడు. ఎల్లప్పుడూ నవ్వుతూ చుట్టుపక్కల వున్నవారిని నవ్విస్తూ ఉండేవాడు.

తన కుటుంబం ఏ సమస్యనైనా తన దృష్టికి తెస్తే, పార్టీకి చెప్పి పరిష్కరించుకొమ్మని చెప్పేవాడు. అంతేగానీ తానే తన కుటుంబ సమస్యల గురించి పట్టించుకోవాలని ఆలోచించేవాడు కాదు.

ఇలా విప్లవోద్యమంలో దృఢంగా పాల్గొంటున్న క్రమంలో కామ్రేడ్ రమేష్‌ను 2006లో పుల్లల చెరువు మండలం, సింగాపల్లి వద్ద మరో ఇద్దరు సంఘ సభ్యులతో సహా పోలీసులు పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలు పెట్టాడు. అయినప్పటికీ కా. రమేష్ ప్లటూన్ ఆచూకీ చెప్పలేదు. దానితో పోలీసులు ఈ ముగ్గురు కామ్రేడ్స్‌ను గుత్తికొండ అడవుల్లో హత్య చేసి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు.

కా. రమేష్‌లోని ఆదర్శాలను ఎత్తిపడుదాం. తన ఆశయసాధనలో ముందుకుసాగుదాం.

## కామ్రేడ్స్ సుబ్బయ్య, ప్రభాకర్

కామ్రేడ్ సుబ్బయ్య గుంటూరు జిల్లా, దోమలగుండం గ్రామ సంఘ నాయకుడు, కామ్రేడ్ ప్రభాకర్ అదే గ్రామానికి చెందిన సంఘ సభ్యుడు. వీరిద్దరూ దళ సభ్యుడు కా. రమేష్‌తో సహా పుల్లల చెరువు మండలం సింగాపల్లి గ్రామంలో నిద్రిస్తుండగా ఒక ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఈ ముగ్గుర్ని పట్టుకొని చిత్రహింసలు పెట్టి గుత్తికొండ అడవుల్లో కాల్చి చంపారు. ఈ సంఘటన 2006లో జరిగింది.

కామ్రేడ్స్ సుబ్బయ్య, ప్రభాకర్‌లు దోమల గుండం గ్రామంలో జరిగిన భూపోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. అనేక ప్రజా సమస్యలను పరిష్కారం చేశారు. రావులపురం వద్ద జన్మభూమి కార్యక్రమం కోసం వస్తున్న పోలీసులపై మందుపాతర పేల్చి గాయపర్చారు. అలా జన్మభూమి కార్యక్రమాన్ని ఆపగలిగారు.

పార్టీ గ్రామంలోకి వస్తే కంటికి రెప్పలా కాపాడేవారు. చుట్టుపక్కల గ్రామాల్లో జరుగుతున్న పోరాటాల్లో పాల్గొని మద్దతు ఇచ్చేవారు.

కామ్రేడ్ సుబ్బయ్య గ్రామ సుంకరిగా ఉండేవాడు. కానీ తాను ఎక్కువగా పార్టీ కార్యకలాపాలే నిర్వహిస్తుండేవాడు. అతనికి భార్యా పిల్లలు ఉన్నప్పటికీ, ఆర్థిక సమస్యలు వేధిస్తున్నప్పటికీ, కుటుంబం గురించి ఎక్కువగా పట్టించుకోకుండా పార్టీ పనులు చురుగ్గా చేసేవాడు. శత్రువు మొదటి నుంచీ కుటుంబాన్ని ఎన్ని ఇబ్బందులు పెట్టినా లొంగలేదు. చంపుతానని కూడా పోలీసులు ఎన్నోసార్లు బెదిరించారు. అయినప్పటికీ లొంగలేదు.

ఇలా పార్టీ పట్ల ఎంతో నిబద్ధతతో పని చేస్తున్న కామ్రేడ్స్ సుబ్బయ్య, ప్రభాకర్‌లను పోలీసులు పట్టుకొని ఎన్ని చిత్రహింసలు పెట్టినా లొంగకుండా అమరత్వాన్నే వరించారు.

వీరి ఆశయ సాధనలో మరింత దృఢంగా ముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేద్దాం.

## కామ్రేడ్ శ్రీను

కామ్రేడ్ శ్రీను గుంటూరు జిల్లా కొల్లూరు మండలం చిట్యాల గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టాడు. పేదరికం వల్ల చిన్నతనం నుండి కాయకష్టం చేసుకొని బతికేవాడు. వాళ్ల వూర్లోని పోరాటాల ప్రభావం వల్ల బాలల సంఘంలో చేరి చురుగ్గా పని చేసేవాడు. పోలీసులపై చికాకు పరిచే చర్యలు చేసేవాడు. వూళ్లో వున్న బడిలో పోలీసులు మకాం వేస్తే రాత్రిపూట వెళ్లి డబ్బా బాంబులు పేల్చేవాడు.

అలా చిన్నప్పట్నుంచీ విప్లవ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటు 2004లో దళంలో చేరాడు. కొన్నాళ్లు బెల్లంకొండ దళంలో పని చేసి తర్వాత ప్లటూన్‌కు బదిలీ అయ్యాడు. ప్లటూన్‌లో వుంటూ పలు మిలటరీ ఘటనల్లో పాల్గొన్నాడు. చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌పై చేసిన దాడిలో అసాల్ట్ టీం సభ్యుడిగా ధైర్యంగా పాల్గొన్నాడు. పలు సంఘటనల్లో రెక్కీ నిర్వహించాడు.

ఎప్పుడూ చొరవగా, చురుకుగా ఉండేవాడు. కష్టపడి పని చేసేవాడు.

నకిరేకల్లు వద్ద పి.ఎల్‌పై దాడి జరిగిన సందర్భంలో సెంట్రీలో కామ్రేడ్ శ్రీను ఉన్నాడు. శత్రువుతో పోరాడుతూ మొత్తం ప్లటూన్ను రిట్రీట్ చేసే క్రమంలో శత్రు తూటాలు తగిలి అమరుడయ్యాడు.

కా. శ్రీను అమరత్వం వృధాపోదని చాటుదాం.

## కామ్రేడ్ యలమంద (భాస్కర్)

కామ్రేడ్ భాస్కర్ గుంటూరు జిల్లా దుర్గి మండలం అడిగొప్పుల గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టాడు. చిన్నప్పట్నుంచీ చదువులో చాలా చురుగ్గా ఉండేవాడు. అయినప్పటికీ పేదరికం మూలంగా ఇంటర్‌తో తన చదువు ఆగిపోయింది. ఆ తర్వాత వూళ్లో కూలి పనులు చేసే క్రమంలో పార్టీ పరిచయం అయింది.

పార్టీ పరిచయంతో చైతన్యం పెంచుకొని వారి గ్రామంలో అనేక పోరాటాల్లో చురుకైన పాత్ర వహించాడు. భూస్వాముల భూమి పేదలకు పంచడంలోనూ, అనేక అభివృద్ధి కార్యక్రమాల్లోనూ తన పాత్ర వుంది. ఆ క్రమంలో 2002 చివర్లో చంద్రవంక దళంలో చేరాడు. ఏ సమస్యపైనైనా ప్రజలను కదిలించడంలో చురుకైన పాత్రను వహించేవాడు. అనేక మిలటరీ ఘటనల్లో చురుగ్గా పాల్గొన్నాడు. భూస్వాములనూ, ఇన్‌ఫార్మర్లనూ, ప్రజా వ్యతిరేకులను శిక్షించిన అనేక ఘటనల్లో చురుకైన పాత్ర వహించాడు.

అద్దంకి పోలీస్ స్టేషన్‌పై దాడి కోసం రెక్కీ చేసి దాడి విజయంలో ప్రముఖ పాత్ర వహించాడు. గ్రేహౌండ్స్ పోలీసులపైన చేసిన దాడికి సైతం సమర్థవంతంగా రెక్కీ నిర్వహించాడు. బొల్లాపల్లి మండలం వెల్లటూరు బ్యాంకుపై దాడి చేసి తుపాకులను స్వాధీనం చేసుకున్న దాడిలోనూ పాల్గొన్నాడు.

చర్చల సమయంలో గుత్తికొండ బిలం వద్ద అమరుల స్థూపాన్ని నిర్మించడంలోనూ పాల్గొన్నాడు.

2005లో కా. భాస్కర్ ప్లటూన్‌లో ఎ సెక్షన్‌కు డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. అదే బాధ్యతలు నిర్వర్తిస్తున్న క్రమంలో 2006 మధ్యలో పని మీద బయటకు వెళ్లిన కా. భాస్కర్‌ను ద్రోహి ఇచ్చిన సమాచారంతో పోలీసులు పట్టుకొని, తీవ్రమైన చిత్రహింసలు పెట్టి హత్య చేసి కారంపూడి సమీపంలో మృతదేహాన్ని పడవేశారు.

కా. భాస్కర్ ఆశయాలను కొనసాగిద్దాం.

## కామ్రేడ్ లక్ష్మణ్ (నర్సింహా రెడ్డి)

కామ్రేడ్ లక్ష్మణ్ స్వంత పేరు నర్సింహారెడ్డి. దాదాపు 25 సంవత్సరాల వయసు వుంటుంది. మెదక్ జిల్లా దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో ఒక పేద రైతు కుటుంబంలో ఈ కామ్రేడ్ పుట్టాడు.

వీళ్ల గ్రామంలో భూస్వాముల పెత్తనం బాగా వుంటుంది. కనుక సహజంగానే ఆ పెత్తనాన్ని వ్యతిరేకించే పోరాటమూ వుంది. ఆ పోరాటాల పట్ల కామ్రేడ్ లక్ష్మణ్ చిన్నప్పుడే ఆకర్షితుడయ్యాడు. వీరి ఇల్లు దళానికి మంచి షెల్టర్. కాబట్టి కా. లక్ష్మణ్‌కు చిన్నప్పటి నుండీ దళం పరిచయమే. అతను ఊర్లో కొంతకాలం పాటు మిలిటెంటుగా పని చేశాడు. ఆ క్రమంలో తనతోపాటు పని చేసే కొంతమంది లొంగిపోయారు. అయినప్పటికీ ఇతను దృఢంగా నిలబడ్డాడు. మరికొంత కాలం సంఘంలో చురుగ్గా పని చేశాడు. ఈ క్రమంలో ఒకసారి తన మీద పోలీస్ ఫైరింగ్ జరిగింది. తను త్రుటిలో తప్పించుకున్నాడు. అయినా భయపడలేదు. కొద్దిరోజుల తర్వాత లక్ష్మీనారాయణ అనే మిలిటెంటును పోలీసులు పట్టుకొని ఊర్లోనే చంపివేసారు. కామ్రేడ్ లక్ష్మీనారాయణ అమరత్వపు స్ఫూర్తితో కామ్రేడ్ లక్ష్మణ్ పూర్తి కాలం కార్యకర్తగా 2002లో దళంలో చేరాడు.

మొదట మెదక్ జిల్లాలోని గిరాయిపల్లి దళంలో పని చేశాడు. ఆ తర్వాత ఎ.పి రాష్ట్ర కమిటీ సభ్యుడు అమరుడు ఎర్ర సత్యంకు గార్డుగా పని చేశాడు. కొంత కాలం తర్వాత ఎ.పి రాష్ట్ర కమిటీ కార్యదర్శికి గార్డుగా పని చేశాడు. ఆ తర్వాత నల్గొండ జిల్లాలో ఇద్దరితో కూడిన దళానికి కమాండర్‌గా వున్నాడు.

కామ్రేడ్ లక్ష్మణ్ మిలటరీ పరంగా చాలా దృఢంగా వుండేవాడు. నాలుగైదు ఎన్‌కౌంటర్లలో చాలా చురుగ్గా ప్రతిఘటిస్తూ తప్పించుకున్నాడు. చర్చల సందర్భంగా ప్రతినిధుల రక్షణ బాధ్యతలు వహించిన ప్లటూన్‌లో కూడా వున్నాడు.

కా. లక్ష్మణ్ సున్నిత మనస్కుడు. క్యాడర్‌తో మంచిగా కలిసిపోయే స్వభావంతో అందరికీ అభిమానపాత్రుడయ్యాడు. తనను రాష్ట్ర కమిటీ ఎ.ఒ.బికి బదిలీ చేసింది. నూతన ప్రాంతంలో పని చేయడం కోసం ఉత్సాహంగా వస్తుండగా ద్రోహి ఇచ్చిన సమాచారంతో మార్గమధ్యంలో కామ్రేడ్ స్వామి, భవాని అనే ఇద్దరు కామ్రేడ్స్‌తో సహా పోలీసులకు పట్టుపడ్డాడు. పోలీసులు ఒక రోజంతా ఈ ముగ్గురు కామ్రేడ్స్‌ను చిత్రహింసలు పెట్టి ఎ.ఒ.బిలోని మల్కన్‌గిరి జిల్లా మర్రిగూడ గ్రామం వద్ద బూటకపు ఎదురుకాల్పులు జరిపి హత్య చేశారు.

ఈ ముగ్గురు కామ్రేడ్స్‌కు అరుణాంజలి ఘటిద్దాం. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్దామని ప్రతిజ్ఞ చేద్దాం.

## కామ్రేడ్ దశరథ (టెక్ శ్రీను)



టెక్ శ్రీనుగా పేరుగాంచిన కామ్రేడ్ రామచంద్రం (23) మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం వెలికల్లు గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టాడు. 9వ తరగతి వరకూ చదువుకున్నాడు. క్రమంగా గ్రామంలో జరిగే పోరాటాలవైపు ఆకర్షితుడై మిలీషియా సభ్యుడయ్యాడు. మిలీషియా సభ్యుడిగా ఉన్నప్పుడు దళానికి ఎంతో అండగా ఉండేవాడు. ఆ సమయంలో ఒకసారి కా. శ్రీను దళంతో ఉన్నప్పుడు అజలాపురం వద్ద దళంపై పోలీసుల దాడి జరిగింది. ఆ దాడిని దళంతో పాటు కా. శ్రీను ధైర్యంగా ప్రతిఘటించాడు.

2002 ఆగస్టులో కా. శ్రీను పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యి, ఆయుధాల రిపేరింగ్ దళంలో చేరాడు. అందులో చేరి ఆయుధాల మరమ్మత్తులో మంచి నైపుణ్యం సాధించాడు. ఆరు రిపేరింగ్ క్యాంపుల్లో పాల్గొని ఎన్నో తుపాకులను మరమ్మత్తు చేశాడు. రాకెట్ లాంఛర్లు తయారు చేసిన క్యాంపులోనూ పాల్గొన్నాడు. పార్టీ అప్పగించిన బాధ్యతలను చొరవగా నెరవేర్చుతూ 2004 చివర్లో ఎ.సి స్థాయికి ప్రమోట్ అయ్యాడు. కా. శ్రీను మిలటరీపరంగా ఎంతో దృఢంగా ఉండేవాడు. పలు శత్రు దాడులను సాహసోపేతంగా ప్రతిఘటించాడు. 2004 ఫిబ్రవరిలో నల్లమలలో క్రిష్ణా నది దగ్గర పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్లో కమాండర్ ఫైరింగ్ చేయడానికి వెనుకాడినప్పటికీ కా. శ్రీను ముందుకు వెళ్లి ధైర్యంగా పోలీసులను ప్రతిఘటించాడు. 2005 చివర్లో ప్రకాశం జిల్లా మర్రివేముల గ్రామం వద్ద కామ్రేడ్స్ విజయ, సునీల్‌లు అమరులైన ఎన్‌కౌంటర్లో కా. శ్రీను ధైర్యంగా ప్రతిఘటిస్తూ తప్పుకున్నాడు. 2006 జూలైలో వందలాది గ్రేహౌండ్స్ బలగాలు చుట్టుముట్టి జరిపిన దాడిలో కామ్రేడ్ మాధవ్ తదితరులు అమరులుకాగా, కా. శ్రీను ధైర్యంగా ప్రతిఘటిస్తూ మిగితా కామ్రేడ్స్‌తో సహా తప్పుకున్నాడు. 2006లో ఎర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌పై కాల్పులు చేసిన టీంలోనూ కా. శ్రీను సభ్యుడిగా వున్నాడు. పలువురు ఇన్ఫార్మర్లను శిక్షించడంలో చురుగ్గా పాల్గొన్నాడు.

తనలో వున్న ఈ మిలటరీ సామర్థ్యాల వల్లనే చర్చల ప్రతినిధులకు రక్షణ బాధ్యతలు నెరవేర్చిన బృందంలో సభ్యుడయ్యాడు. ఆ సమయంలో మంజీరా గెస్ట్ హౌస్‌కు విలేకరి వేషంలో వచ్చిన ఇంటెలిజెన్స్ ఎస్.ఐని గుర్తించి రహస్యాలు సేకరించాలనే పోలీసుల కుటిలయత్నాలను భగ్నం చేశాడు.

కా. శ్రీనుకు కవిత్వంపై ఆసక్తి బాగా వుండేది. తన భావాలను తరచుగా కవితలుగా అక్షరీకరించేవాడు.

2007 ప్రారంభంలో పార్టీ రిపేరింగ్ టీంను రద్దు చేసి, కామ్రేడ్ శ్రీనును నల్లమల డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఎల్.జి.ఎస్‌కు కమాండర్‌గా నియమించింది. తీవ్ర శత్రు నిర్బంధంలో, అనేక నష్టాలకు గురై వున్న సమయంలో కా. శ్రీను పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను ధైర్యంగా స్వీకరించాడు. ఆ బాధ్యతలను నెరవేర్చే క్రమంలోనే 2007 జూలై 26న బొల్లాపల్లి మండలం మన్నెపల్లిపాడు తండా వద్ద శత్రువుతో జరిగిన ఎదురుకాల్పుల్లో పోరాడుతూ, దళ సభ్యుడు కా. శ్యాంతో సహా అమరుడయ్యాడు.

ప్రస్తుత పరిస్థితిలో శ్రీను వంటి కామ్రేడ్‌ను కోల్పోవడం నల్లమల ఉద్యమానికి తీవ్రమైన నష్టమే. ఆ నష్టాన్ని పూడ్చుకోవడం కోసం కా. శ్రీనులోని శక్తి సామర్థ్యాలను అలవర్చుకొని మరింత దృఢంగా ముందుకు నడుద్దాం.

## కామ్రేడ్ కోటా నందకుమార్ (శ్యాం)

కామ్రేడ్ శ్యాం (23) గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో పుట్టాడు. రామాపురం పోరాటాలకు నిలయమైన గ్రామం కావడంతో కా. శ్యాం చిన్నప్పటి నుంచీ విప్లవ వాతావరణంలోనే పెరిగాడు. కొంత జ్ఞానం రాగానే బాలల సంఘంలో చేరి విప్లవ కార్యకాలాపాలు మొదలుపెట్టాడు. ఆ తర్వాత యువజన సంఘంలో చేరి గ్రామంలో జరిగిన ప్రతి పోరాటంలోనూ చురుకైన పాత్రను పోషించాడు. యువజన సంఘంలో వుంటూనే పలు మిలటరీ ఘటనల్లో పాల్గొన్నాడు. రాశీ సిమెంటు ఫ్యాక్టరీ మీద దాడిలో, వాకీటాకీలు స్వాధీనం చేసుకున్న దాడిలో, స్టెన్ కార్బన్ తుపాకీని స్వాధీనం చేసుకున్న దాడిలో, రామాపురంలో జరిగిన కరువుదాడుల్లో, దాచేపల్లిలో మద్యం దుకాణాన్ని తగులబెట్టిన సంఘటనలో చురుగ్గా పాల్గొన్నాడు.

2004లో పూర్తికాలం కార్యకర్తగా, బెల్లంకొండ స్పెషల్ గెరిల్లా దళంలో సభ్యుడయ్యాడు. 2006లో బెల్లంకొండ దళం నుండి పుల్లల చెరువు దళానికి బదిలీ అయ్యాడు. ఈ సమయంలో పలు మిలటరీ చర్యల్లో చురుకైన పాత్ర వహించాడు. కా. విజయ, సునీతలు అమరులైన మర్రివేముల ఎన్‌కౌంటర్లో కా. శ్యాం ధైర్యంగా ప్రతిఘటించాడు.

కా. శ్యాం క్రమశిక్షణ కల్గిన కామ్రేడ్. సమయపాలన కచ్చితంగా అమలుచేసేవాడు. శత్రువుతో కొట్లాడాలంటే శారీరక దారుఢ్యం పెంచుకోవాలనే పట్టుదలతో ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజు చేసేవాడు. కష్టపడి పని చేసేవాడు. బరువులు మోయడంలో

ముందుండేవాడు. విషయాలను తెల్సుకోవడంలో అమితమైన ఆసక్తిని ప్రదర్శించేవాడు.

తనకు తెల్సిన వాళ్లు లొంగిపోయినా, తాను మాత్రం ఎటువంటి శషభిషలకూ లోను కాలేదు. ఇలా తన విప్లవ కార్యాచరణను దృఢంగా కొనసాగిస్తున్న క్రమంలోనే 2007 జూలై 26న బొల్లాపల్లి మండలం, మన్నెపల్లిపాడు తండా వద్ద జరిగిన ఎన్‌కౌంటర్లో కమాండర్ కామ్రేడ్ శ్రీనుతో సహా అమరుడయ్యాడు.

కా. శ్యాం విప్లవ కార్యాచరణ మనందరికీ ఆదర్శం.

### కామ్రేడ్ కిరణ్

కామ్రేడ్ కిరణ్ (23) గుంటూరు జిల్లా నర్సరావుపేటలోని ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. నర్సరావుపేటలోనే పదవ తరగతి వరకూ చదువుకున్నాడు. అదే కాలంలో జిల్లాలో జరుగుతున్న పోరాటాలను చూసి ఆకర్షితుడయ్యాడు. ఫలితంగా 2002లో బెల్లంకొండ దళ సభ్యుడిగా రిక్రూట్ అయ్యాడు. బెల్లంకొండ ఏరియాలో జరిగిన భూపోరాటాలన్నింటిలో చురుకైన పాత్ర వహించాడు. మోర్జంపాడు, వేమవరం కరువు దాడులలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. దళంలో డాక్టర్‌గా వుంటూ ప్రజలకూ, తోటి కామ్రేడ్స్‌కు ఎంతో ఓపిగ్గా వైద్యం చేసేవాడు. ప్రజలతో సన్నిహితంగా కల్సిపోయేవాడు.

2003లో అమరుడైన కామ్రేడ్ భగత్, కిరణ్‌కు స్వయాన అన్న. అన్న అమరత్వం కిరణ్ విప్లవదీక్షను మరింత పెంచింది. అన్న ఆశయాలను చివరిదాకా కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు.

2006లో ప్లటూన్‌కు బదిలీ అయ్యాడు. ఆ సమయంలో కొనసాగుతున్న తీవ్ర నిర్బంధాన్ని ప్రతిఘటించడంలో ప్లటూన్ సభ్యుడిగా తగిన పాత్రను పోషించాడు. ప్లటూన్‌పై జరిగిన అనేక దాడులను ధైర్యంగా ప్రతిఘటించాడు. చిలకలూరిపేట పోలీస్ స్టేషన్‌పై దాడిలోనూ, నందిగామ, కొల్లూరు పోలీస్ స్టేషన్లపై చేసిన ఫైరింగ్‌లలోనూ పాల్గొన్నాడు.

2006, 2007లలో పెద్ద ఎత్తున నాయకత్వాన్ని కోల్పోయినప్పటికీ బెంబేలు పడకుండా ఆ నష్టాల మధ్యనే ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లే కృషిలో పాల్గొన్నాడు. అందులో భాగంగా ఇద్దరితో కూడిన పుల్లల చెరువు దళానికి కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. ఆ బాధ్యతలను నెరవేర్చుతున్న క్రమంలో 2007 ఆగస్టులో ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం ఉమ్మడివరం వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో అమరుడయ్యాడు.

కా. కిరణ్ ఆశయాలను కొనసాగించే కృషిలో భాగంగా మరింత దృఢంగా ముందుకు సాగుదాం.

## ఎన్.టి అమరులు

### కా. కొయ్యడి లక్ష్మణ్

నిజామాబాద్ జిల్లా మాచారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన పార్టీ సానుభూతిపరుడు కా. కొయ్యడి లక్ష్మణ్ పోలీసుల వేధింపులు భరించలేక జనవరి 2006లో ఆత్మహత్య చేసుకున్నాడు.

కా. లక్ష్మణ్ 2003లో పార్టీకి పరిచయం అయినపుడు రాష్ట్రమంతటితో పాటు నిజామాబాద్ జిల్లాలోనూ ఫాసిస్టు చంద్రబాబు క్రూర నిర్బంధం కోరలు చాస్తున్నది. గ్రామాలన్నీ కాన్సన్‌ట్రేషన్ క్యాంపుల మాదిరిగా అయ్యాయి. ఇంతటి నిర్బంధంలో సైతం కా. లక్ష్మణ్ స్థానిక దళం గ్రామానికి పోయినపుడు కంటికి రెప్పలా కాపాడేవాడు. గ్రామ రిపోర్టునూ, పోలీసులకు సంబంధించిన సమాచారాన్ని దళానికి చెపుతుండేవాడు. అలాగే దళం ఇచ్చిన ప్రతి పనిని రహస్యంగా నెరవేర్చేవాడు.

ఇదే గ్రామానికి చెందిన పోలీసు ఇన్‌ఫార్మర్, పార్టీకి లక్ష్మణ్ సహకరిస్తున్నాడనీ అతని వద్ద పార్టీకి సంబంధించిన డంపులు వున్నాయని సమాచారం ఇవ్వడంతో పోలీసులు పలుమార్లు ఇంటిపై దాడి చేసారు. ఇంటిలో తిండి సరుకులూ, వంట పాత్రలను ధ్వంసం చేసి పోలీసులు కుటుంబ సభ్యులను మానసికంగా వేధింపులకు గురి చేసారు. దీంతో మానసిక క్షోభకు గురైన లక్ష్మణ్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

### కామ్రేడ్ అశోక్

2006 అక్టోబర్ 11వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాలైన తాళ్ళగూడెం, అన్నారం గ్రామాల మధ్య మాటుగాచిన ఆంధ్రప్రదేశ్ ఛత్తీస్‌గఢ్ పోలీసు మూకలు చేసిన పాశవిక దాడిలో కా. ప్రశాంత్‌తో పాటు కామ్రేడ్ అశోక్ నేలకొరిగాడు.

కామ్రేడ్ అశోక్ వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించినాడు. ప్రాథమిక విద్య కాల్వపల్లిలోనే చదివి బంద్ పెట్టినాడు.

కా. అశోక్ బాల్యం నుండి బాలల సంఘంలో పని చేస్తూ గ్రామంలో దళంకు సెంట్రీగా వుంటూ దళం అప్పగించిన పని చేస్తూ వుండేవాడు. కా. మధుకూ, ఎస్.జడ్.సి.ఎంకూ, సబ్‌కమాండ్‌కు వేరు వేరు సమయాల్లో కొరియర్‌గా 5 సంవత్సరాలు అవిరామంగా కృషి చేశాడు. శత్రువు కళ్లు గప్పి ఉత్తరాలను చేరవేయడంలోను పట్టణాలకు పోయి పని చేసుకొని రావడంలోను మంచి దిట్ట. గొర్లకాపరి వేషధారణలో చినిగిన నిక్కరు భుజంపై గొడ్డలితో అనేకసార్లు

కూంబింగ్‌ల మధ్యనే శత్రువు కళ్లు గప్పి దళానికి సమాచారం చేరవేసేవాడు, ఉత్తరాలు అందించేవాడు.

నిప్పులు చెరుగుతున్న నిర్బంధంలో ఎందరో కామ్రేడ్స్ అమరులవుతుంటే, కొందరు దిగజారిపోతుంటే ఎలాంటి శషభిషలు లేకుండా మరింత కసిని పెంచుకొని కాల్వపల్లికి వచ్చిన పోలీసులపై క్లైమోర్ మైన్స్ పేల్చి శత్రువును పరుగు తీయించినాడు. ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌కు డైరెక్షనల్ మైన్స్ పెట్టి బ్లాస్టింగ్ చేసిన ఘటనలో తాను రెక్కీ నిర్వహించాడు. నార్లాపురం దగ్గర పోలీసులు స్వాధీనం చేసుకున్న మైన్స్ తిరిగి స్వాధీనం చేసుకోవడంతో తన వంతు పాత్రను నిర్వహించాడు. జలగంచ, ఏటూరునాగారంలో బూబీట్రాప్స్ పెట్టి గందరగోళపర్చినాడు.

కుక్కునూర్ పోలీసు స్టేషన్‌పై దాడిలో పాల్గొని తన వంతు పాత్రను నిర్వహించాడు. రేయాన్ ఫ్యాక్టరీ కార్మికులా, ఆదివాసుల సమస్యలపై తీసుకొన్న పోరాటాలను సమన్వయం చేస్తూ వాళ్లకు అండగా నిలచినాడు పార్టీకి సమన్వయకర్తగా పని చేసినాడు అనేక మంది శత్రువుకు లొంగిపోయి పార్టీ రహస్యాలు చెప్పుతుంటే వాళ్ళను అసహ్యించుకొంటూ శత్రువుపై కసిని పెంచుకొని 2004 వెసులుబాటు కాలంలో ఫుల్ టైమర్‌గా దళంలోకి రిక్రూట్ అయ్యాడు. ఏటూరునాగారం దళానికి పైలెట్ అయ్యాడు. ఎంతదూరం పోయి పనులు చేసుకొని రావడానికైనా విసుగులేకుండా పోయి పనులు చేసుకుని వచ్చే వాడు. ఎప్పుడూ శత్రువు అంటే ఏమాత్రం భయపడేవాడు కాదు. ఎప్పుడైనా అడ్వాన్స్ బ్యాచ్‌లోనే వుండేవాడు. నేనే ముందు పోతానని అనేవాడు. ఇతని ధైర్య సాహసాలను మిలటరీ మెలకువలను దృష్టిలో పెట్టుకొని యాక్షన్ టీం మెంబర్‌గా పి.ఎల్ సభ్యుడుగా బదిలీ చేయడం జరిగింది.

అవే బాధ్యతలను నెరవేర్చుతున్న క్రమంలో శత్రువు మాటు దాడిలో వీరమరణం పొందాడు. కా. అశోక్ కలలను నిజం చేద్దాం. అతని ఆశయాన్ని కొనసాగిద్దాం. శత్రువును నేలకూల్చుదాం.

### కామ్రేడ్ వసంతి



కామ్రేడ్ వసంతి (మడ్కం మోతి) డికెలోని దంతెవాడ జిల్లా భైరంగడ్ బ్లాక్ జాంగ్లా గ్రామంలో పుట్టింది. కిష్టారం ఏరియాలో 2006 నవంబర్ 27 నాడు ఆంధ్రగ్రేహౌండ్స్ పై చేసిన ఆపర్చునిటీ ఆంబుష్‌లో హోరా హోరిగా పోరాడుతూ శత్రువును తరిమి కొడుతూ, శత్రువు కాల్చిన తూటాలు తగిలి తన అమూల్యమైన ప్రాణాల్ని అర్పించింది. కా. మోతి కె.ఎ.ఎం.ఎస్‌లో పని చేస్తూ గ్రామ మహిళలను కూడగడుతూ మహిళలపై జరుగుతున్న వివక్షకు, తెగ కట్టుబాట్లకు వ్యతిరేకంగా తాను చైతన్యమవుతూ తన తోటి మహిళలను చైతన్యం చేసింది. తన కుటుంబం మోతిని పార్టీలోకి పోకుండా ఆర్గనైజేషన్ లేని ప్రాంతంలో వున్న చుట్టాల ఇంటి వద్ద వుంచేవారు. పార్టీ మంచిది కాదని చెప్పేవాళ్ళు. అయినా వాళ్ల మాటలు పట్టించుకోకుండా సంఘం పనులల్లో చురుకుగా పాల్గొనేది. సల్వాజుడూం మొదలు అయిన తర్వాత మొట్టమొదట సల్వాజుడూంకు వ్యతిరేకంగా తిరగబడిన గ్రామాల్లో ఈ గ్రామం ఒకటి. వసంతి అన్న డి.ఎ.కె.ఎం.ఎస్‌లో చురుకైన కార్యకర్త కాబట్టి ఇతన్ని సల్వాజుడూం గూండాలు ముక్కలు ముక్కలుగా నరికి చంపినారు. దానితో శత్రువుపై మరింత కసితో 2006 జనవరిలో కా. వసంతి దళంలో రిక్రూట్ అయింది. కొత్తగా రిక్రూట్ అయిన వెంటనే ఉత్తర తెలంగాణకు పంపిస్తామంటే భాష రానప్పటికీ ఎలాంటి శషబిషలు లేకుండా వెళ్లడానికి సిద్ధమైంది. తెలంగాణకు వచ్చిన తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన ప్లాటూన్‌లో సభ్యురాలైంది. ప్లటూన్‌లో అందరి మన్ననలను అందుకుంది. పార్టీ క్రమశిక్షణ, పద్ధతులు పాటించడం, కష్టాన్ని భరించి చివరి వరకు పని చేయడంలో, అందరి కామ్రేడ్‌తో కలుపుగోలుగా వుండడంలో, తెలుగు భాషను నేర్చుకోవడంలో తాను ముందుండేది. పేషెంట్లు అయిన కామ్రేడ్స్‌కు ఎలాంటి విసుగు లేకుండా సేవ చేసేది. ఇవి ఈ కామ్రేడ్ నుండి మన మందరం నేర్చుకోవలసిన మంచి అంశాలు. ఈ కామ్రేడ్ మనందరికి ఎంతో ఆదర్శం. కా. వసంతి భౌతికకాయాన్ని శత్రువు చేతికి చిక్కకుండా తీసుకొచ్చి దహన సంస్కారాలు చేసి ఆమె ఆశయాన్ని, ఆమె అందించిన స్ఫూర్తిని ముందుకు తీసుకుపోతామని పి.ఎల్.జి.ఎ, ప్రజలు శపథం చేసినారు. కా. వసంతి మనతో భౌతికంగా లేకపోయినప్పటికీ ఆమె ఆదర్శాలు చిరస్థాయిగా నిలిచి ఉంటాయి.

### కామ్రేడ్ కుంజ మంగు (మల్లేష్, ఉంగాల్)

కా. ఉంగాల్ (కుంజ మంగు) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా, గంగులూరు ప్రాంతం పిడియ గ్రామంలో పుట్టాడు. పేద ఆదివాసీ కుటుంబంలో పుట్టి పెరిగాడు. చిన్నప్పటి నుండి విప్లవ భావాలతో తన ఆలోచనను పదును పెట్టాడు. బాలల సంఘంలో వుంటూ సంఘం పనులను తు.చ తప్పకుండా అమలుచేసేవాడు. సి.ఎన్.ఎం (చైతన్య నాట్య మంచ్)లో కూడా పని చేసాడు. పాటలు రాసే వాడు. ఈ క్రమంలో గ్రామ మిలీషియా సభ్యుడయ్యాడు. 2005 మధ్యలో ప్రారంభమైన సల్వాజుడూంకు వ్యతిరేకంగా వివిధ దాడుల్లో చురుకుగా పాల్గొన్నాడు. దండకారణ్య వ్యాప్తంగా సల్వాజుడూం నిర్బంధ దాడి సాగిన నేపథ్యంలో పూర్తి కాలం కార్యకర్తగా 2005 సెప్టెంబర్‌లో రిక్రూట్ అయినాడు. కా. ఉంగ ఉద్యమ అవసరాల

రీత్యా దండకారణ్యం నుండి ఉత్తర తెలంగాణకు నవంబర్ 2005లో వచ్చి ఖమ్మం జిల్లాలో సభ్యుడిగా పని చేసాడు. ఖమ్మం జిల్లాకు వచ్చిన తర్వాత ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకొని క్రమంగా తెలుగు భాషను నేర్చుకున్నాడు. కామ్రేడ్స్‌తోటి, ప్రజలతోటి మంచిగా కలిసిపోయేవాడు.



2005 చివర్లో తీసుకున్న ప్రతిఘటన క్యాంపెయిన్లో దళ సభ్యుడిగా చురుకుగా పాల్గొన్నాడు. 2006 జూన్ నెలలో చర్ల మండలం సత్యనారాయణపురంలో కమ్మ భూస్వాముల మీద దాడి చేసి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ని పేల్చి 2 ట్రాక్టర్లు, 2 సైకిల్ మోటర్స్ స్వాధీనం చేసుకున్న సంఘటనలో చురుకుగా పాల్గొన్నాడు. ఖమ్మం జిల్లా కార్యదర్శికి గార్డుగా కొంత కాలం పని చేసాడు. దళ సభ్యుడుగా, గార్డుగా తన విధులను శ్రద్ధగా నిర్వహించాడు.

కా. ఉంగాల్ అనారోగ్య సమస్యను ఎదుర్కొంటూ కూడా ఉద్యమంలో కొనసాగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఫిబ్రవరి 2007న చనిపోయాడు. కా. ఉంగాల్ అమరత్వం విప్లవోద్యమానికి నష్టకరమైనది. కా. ఉంగాల్ ఆశయాన్ని కొనసాగిద్దాం.

## కామ్రేడ్ దేవరాజు

కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన పార్టీ సభ్యుడు కా. దేవరాజు, డిసెంబర్ 2005లో పోలీసులు అరెస్టు చేసి హింసించడంతో అమరుడయ్యాడు.

కా. దేవరాజు తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు అయినందున అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. కడుపేద కుటుంబమే అయినప్పటికీ తల్లిదండ్రులు కూలి నాలి చేస్తూ దేవరాజును 7వ తరగతి వరకు చదివించగలిగారు.

యువకుడైన దేవరాజు ఒంటరిగానే తమ గ్రామంలోని అగ్రకుల భూస్వాములపై తిరగబడ్డాడు. దీనిని సహించలేని భూస్వాములు దేవరాజును హతమార్చడం కోసం విఫలయత్నం చేసారు. భూస్వాముల దాడుల నుండి తప్పించుకొని గ్రామ గ్రామం తిరుగుతున్న క్రమంలో 1999లో పార్టీ పరిచయాల్లోకి వచ్చాడు. పార్టీ పరిచయం అయిన నాటి నుండి గ్రామంలోనే వుంటూ పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని చురుకుగా నిర్వహించాడు. వివిధ సందర్భాల్లో దళంపై పోలీసుల దాడి జరిగినపుడు విడిపోయి, తన వద్దకు చేరుకున్న సభ్యులను, అలాగే అనారోగ్యానికి గురైన సభ్యులను కంటికి రెప్పలా కాపాడి దళానికి సురక్షితంగా అప్పగించేవాడు. చాలా విశ్వాసంగా బాధ్యతాయుతంగా పని చేస్తూ, గ్రామంలో సంఘ నిర్మాణం కావడంలో కీలకపాత్ర వహించాడు. అలాగే కొంత కాలం అప్పటి జిల్లా కమిటీకి కొరియర్‌గా పని చేసాడు. 2004 చర్చల కాలంలో దళంతోపాటు గ్రామ గ్రామం తిరుగుతూ కాలికి గజ్జెగట్టి పాటలు పాడుతూ ప్రజల్లో విప్లవోత్సాహాన్ని నింపాడు. ఈ క్రమంలో పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసారు. ఏరియా దళం నుండి ఎలాంటి ప్రతిఘటనా చర్య జరిగినా, కా. దేవరాజును పోలీసులు అరెస్టు చేసి హింసించేవారు. ఎన్నిసార్లు అరెస్టు చేసి ఎంతటి చిత్రహింసలకు గురి చేసినా పార్టీకి సంబంధించిన సమాచారం గురించి పెదవి విప్పలేదు. అరెస్టులు, చిత్రహింసలు భరిస్తూ త్యాగపూరితంగా పని చేస్తున్న కా. దేవరాజుకు ఏరియా కమిటీ 2005 జనవరిలో పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చింది.

ఈ క్రమంలో పోలీసు ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో డిసెంబర్ 2005లో మరోసారి అరెస్టు చేసిన పోలీసులు, తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసి కొన ఊపిరితో ఒదిలిపెట్టారు. కొన వూపిరితో ఇంటికి చేరుకున్న కా. దేవరాజు రెండు రోజులకు అమరుడయ్యాడు. కా. దేవరాజు పట్టుదల, అంకితభావం, వర్గ కసి ప్రజా సంఘాలకు ఆదర్శనీయం.

## కామ్రేడ్ రాజన్న

కా. రాజన్న కరీంనగర్ జిల్లా ఎల్లారెడ్డి మండలం అడవి పదిర గ్రామ విప్లవ రైతుకూలి సంఘ సభ్యుడు. పేద దళిత కుటుంబంలో పుట్టినందున చదువుకోలేకపోయాడు. దాంతో చిన్నప్పటి నుండి గ్రామంలోని ధనిక రైతులకు జీతం వుంటూ, వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబ పోషణలో తల్లిదండ్రులకు అండదండగా వుండేవాడు. తల్లిదండ్రులు బాల్య వివాహం చేసినందున చిన్న వయసులోనే ఒక బిడ్డకు తండ్రి అయ్యాడు.

క్రమంగా దళం సంబంధాల్లోకి వచ్చి గ్రామ విప్లవ రైతుకూలీ సంఘంలో చేరాడు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో మిలిటెంట్‌గా పాల్గొనేవాడు.

2005 మార్చిలో మానాల హత్యాకాండలో నాయకత్వంతో పాటు 10 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. దీంతో గ్రామాల్లోని పెత్తందార్ల, పోలీసు ఏజెంట్ల ఆగడాలు మితిమీరి పోయాయి. ప్రజలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ఆ క్రమంలో కా. రాజన్నతో పాటు మరికొంత మంది సంఘ సభ్యులు కలిసి ప్రజా వ్యతిరేకీ, పోలీసు ఇన్‌ఫార్మర్ నాగభూషణంను హతం చేసి అరాచకుల, లంపెన్‌ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. తదనంతరం పోలీసులకు దొరకకుండా తప్పుకొని తిరుగుతున్న క్రమంలో ఒకచోట పోలీసులు వెంటపడగా మోకాలికి

*(మిగతాది 6వ పేజీలో.....)*

# కల్లోల వ్యవస్థ పర్యవసానమే హైదరాబాద్ బాంబు పేలుళ్ళు

ఆగస్టు 25న హైదరాబాద్‌లో జంట బాంబు పేలుళ్ళు, అంతకు 100 రోజుల ముందు మక్కామసీదులో బాంబు పేలుళ్ళు జరిగాయి. ఈ మధ్య కాలంలో హైదరాబాద్, బాంబు పేలుళ్లతో అంతర్జాతీయ ఉగ్రవాదానికి అడ్డాగా మారుతున్నదని వార్తలకెక్కుతున్నది. ఏ లక్ష్యం కోసం ఎవరు చేసినా మక్కామసీదు పేలుళ్ళుగానీ, జంట బాంబు పేలుళ్ళు గానీ, అమాయక ప్రజలపై ఎక్కుపెట్టడం తీవ్రంగా ఖండించవలసిన దుశ్చర్య. ఇటువంటి మారణకాండ వల్ల దీనికి పాల్పడిన వాళ్ళు సాధించేది శూన్యం. అయితే రెండు సంఘటనల్లో ముస్లిం తీవ్రవాదులున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం కూడా ఇందులో విదేశీ కుట్ర ఉన్నదని ప్రకటించింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లకు చెందిన ఉగ్రవాదులు ఈ మారణ హోమానికి కారణమని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించాడు.

హైదరాబాద్‌లోనే కాదు దేశంలో ఎక్కడ ఇటువంటి బాంబు పేలుడు జరిగినా ముస్లింలను కారకులుగా అనుమానించడం, అనుమానించే పరిస్థితులు పాలకవర్గాలు సృష్టించడం పరిపాటిగా మారింది. ముందు ఇదే అనుమానంతో పరిశోధనలు మొదలవుతాయి. ఇదే హైదరాబాద్‌లో 2005లో దసరా పండుగనాడు టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో జరిగిన బాంబు పేలుడుకు కూడా ఇదే కారణాన్ని సృష్టించారు. కానీ, దాని వెనుక దశాబ్దాలుగా నగరంలో పాతుకుపోయి, తమ బదిలీలను అడ్డుకోవాలనుకున్న పోలీసు ఉన్నతాధికారుల స్వప్రయోజనాలున్నాయని, అందుకు పోలీసులు టెర్రరిస్టుల అవతారం కూడా ఎత్తగలరని ఆ సంఘటనలో బహిరంగంకాని నిజం చెబుతుంది. మాలెగావ్ పేలుళ్ళ పాపం మతోన్మాద భజరంగ్‌దళ్‌దేనని బయటపడింది. టెర్రరిస్టులతో సంబంధాలున్నాయనే పేరుతో పాతనగరంలోని పేద, మధ్యతరగతి ముస్లిం యువకులను చీటికి మాటికి అరెస్టులు చేసి, చిత్రహింసలు పెట్టటం పోలీసులకు పరిపాటైంది. మొన్నటి సంఘటన సందర్భంగా కూడా మదర్సాల మీద, ముస్లింల సంస్థల మీద సోదాలు జరిపి, అరెస్టులు సాగించారు.

బాంబు పేలుళ్ళ సంఘటన పట్ల వివిధ రాజకీయ పార్టీలు స్పందిస్తూ, ప్రభుత్వ విధానాలూ వాటి పర్యవసానాలను వదిలిపెట్టి నిఘా వైఫల్యాన్నే ఎత్తి చూపాయి. ఇక బి.జె.పి దీన్ని అవకాశంగా తీసుకుని ముస్లిం మైనారిటీల రిజర్వేషన్ల మీద, మైనారిటీలకు కల్పిస్తున్న సౌకర్యాల మీద అక్కసు వెళ్లగక్కింది. 'పోటా' చట్టం ఉన్నప్పుడు తమ హయాంలో జరిగిన ఇటువంటి సంఘటనలను మరిచిపోయి అద్వానీ పోటా చట్టం తీసుకురావాలని తన ఫాసిస్టు స్వభావాన్ని బయటపెట్టుకున్నాడు. కాంగ్రెస్, బి.జె.పిలు దీన్ని పరస్పర నిందారోపణలకు ఉపయోగించుకున్నాయి. సాధారణ ప్రజల ప్రాణాలకు వీళ్ళ దృష్టిలో ఏమాత్రం విలువ లేదనేది ఆయా పార్టీల వైఖరులను బట్టి స్పష్టంగానే అర్థమవుతున్నది. బాంబు పేలుళ్ళలో 42 ప్రాణాలు బలయ్యాయి. కానీ, ప్రభుత్వాల విధానాల వల్ల బలైపోతున్న ప్రాణాలెన్ని? వేలాది రైతుల ఆత్మహత్యలు, నేత కార్మికులు తమకు తామే విధించుకుంటున్న ఉరి శిక్షలు..... ఇవన్నీ నిశ్శబ్ద మరణాలు. మక్కామసీదు బాంబు పేలుళ్ళ తర్వాత ముదిగొండ కాల్పుల్లో ప్రభుత్వం స్వయంగా తీసిన ప్రాణాలెన్ని? వాకపల్లి అత్యాచారాల తర్వాత అంతకు ముందు జరిగిన అనేకానేక సంఘటనల తర్వాత ఈ రాష్ట్రంలో సామాన్య ప్రజల మాన, ప్రాణాలకు విలువ వుందనగలమా?

ఇక మన కళ్ళ ముందే జరుగుతున్న మరొక దుర్మార్గం ఎక్స్‌గ్రేషియా ప్రకటనలు. ఎక్కడ ఎవరు మరణించినా ప్రభుత్వ ప్రతినిధులు పరిహారాలు ప్రకటించడం, ఎవరో ఒక మంత్రి వాటిని అందజేయడం, వాటికి ప్రాచుర్యం కల్పించడం ఇదంతా ఒక తంతుగా మారింది. ఇదే ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడుగా వున్నప్పుడు రైతుల ఆత్మహత్యల విషయంలో "మీరు పురుగుల మందు తాగండి, కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇస్తా" అని టి.డి.పి నాయకులకూ, చంద్రబాబుకూ పదే పదే సవాల్ విసిరాడు. అదే మాట ఇప్పుడు రాజశేఖర్ రెడ్డి ముఖం పట్టుకుని ప్రజలు అడగాలి.

ప్రజాస్వామ్యం, సంక్షేమం, సమ న్యాయం కల్పించలేని వ్యవస్థలో దోపిడీ, అణచివేతల పర్యవసానాలు ఇలాగే పరిణమిస్తాయి. అవి కల్పించలేని ప్రభుత్వాలు, పాలకవర్గాలు విదేశీ శక్తుల పైనో, అంతర్జాతీయ శక్తులపైనో నెపాన్ని తోసివేసి, నిస్సహాయత ప్రకటించి ప్రజల్ని సమాధాన పరచజూస్తున్నాయి. పాలకవర్గాల వైఫల్యాలకు నిఘా సామర్థ్యం పరిష్కారం కాజాలదు. రాజకీయ ప్రయోజనాల కోసం రామ జన్మభూమిని తెరిపించింది కాంగ్రెస్ అయితే, అందులో మందిర నిర్మాణానికి విధ్వంసాన్ని కొనసాగించింది బి.జె.పి. రెండూ కలిసి 1990 దశకంలో దేశంలో అనేక అశాంతులకు కారణమయ్యాయి. వాస్తవంగా ఆలోచిస్తే, నేటి దుష్పరిణామాలకు బాధ్యత - తిలా పాపం తలా పిడికెడు. ప్రజా వ్యతిరేక అభివృద్ధి విధానాలు గానీ, విదేశాంగ విధానాలు గానీ రానున్న రోజులలో మరింత అసంతృప్తిని రాజేసే అవకాశం వున్నది. వ్యవస్థలో సమూలమైన మార్పు రానంతకాలం గుజరాత్ మారణకాండలూ, కాశ్మీరు కల్లోలాలు ఏదో రూపంలో వెంటాడుతూనే వుంటాయి.

★

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

# ఎ.ఒ.బి పోరాట వార్తలు

### విశాఖ రూరల్ ఎస్.పి మురళి అవినీతికి వ్యతిరేకంగా....

విశాఖ రూరల్ ఎస్.పి జె.జె.మురళిని 2007, మే నెలలో అవినీతి, అక్రమార్జనల ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఎ.సి.బి) అరెస్టు చేసి జైలుకు పంపింది. ఈ విషయాన్ని ఆధారం చేసుకొని మొత్తం పోలీస్ వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతిపై ఎ.ఒ.బి ఎస్.జడ్.సి ఒక కరపత్రం వేసి ప్రచారం చేసింది.

ప్రపంచబ్యాంకు ఆదేశాలమేరకు అమలవుతున్న నూతన ఆర్థిక విధానాల వల్ల దేశంలో అవినీతి విపరీతంగా పెరిగిపోతోందనీ, అందులో భాగంగా పోలీసు వ్యవస్థలో సహితం అవినీతి అక్రమార్జనలు పెరిగిపోతున్నాయనీ, మురళిది మొదటి కేసు ఏమీ కాదనీ, గతంలో అరవిందరావు(ఐ.పి.ఎస్) కలప కుంభకోణంలో భాగం పంచుకున్నాడనీ, మాజీ డి.జి.పి స్వరణ్‌జిత్ సేన్ భార్య చిన్న పిల్లలను విదేశాలకు అమ్మి, కోట్లు గడించిదని ఈ కరపత్రంలో ఎస్.జడ్.సి పేర్కొన్నది.

అంతేకాదు మాజీ నక్సలైట్లను చేరదీసి వాళ్లకు ఆయుధాలు ఇచ్చి మాఫియా ముఠాలుగా తయారు చేసి, భూ ఆ క్రమాలకు పాల్పడుతూ కోట్లు గడిస్తున్న పోలీసులు ఎంతో మంది వున్నారనీ పేర్కొన్నది.

జె.జె.మురళి విశాఖ జిల్లాకు ఎస్.పిగా వచ్చినప్పటి నుండీ మావోయిస్టు ఉద్యమంపై తీవ్రమైన అణచివేత చర్యలకు పాల్పడ్డాడనీ, కామ్రేడ్స్ చంద్రమౌళి, గౌతమ్, కరుణ, సంతు మొదలయినవారు బయటే దొరికితే వారిని క్రూరంగా హత్య చేసి ఎన్‌కౌంటర్ కట్టుకథలు అల్లాడనీ, అంతేగాక ఈ అవినీతిపరుడు ఎందరో ఆదివాసీ యువకులకు డబ్బులిచ్చి, రకరకాల ప్రలోభాలకు లోను చేసి అవినీతిపరులుగా మార్చుతూ, వారిని విప్లవోద్యమానికి వ్యతిరేకంగా నిలబెడుతున్నాడని పేర్కొన్నది. జె.జె.మురళి మావోయిస్టు ఉద్యమంపై రకరకాల ఆరోపణలతో బురద జల్లాడనీ, కానీ వాస్తవంలో తానే పీకల లోతుగా అవినీతిలో కూరుకున్నాడని విమర్శించింది.

చివరిగా, అధికార వ్యవస్థ మీద ప్రజలు రోజు రోజుకూ భ్రమలు కోల్పోతున్న సమయంలో ఆ భ్రమలను నిలబెట్టడానికి ఎ.సి.బి చురుగ్గా పని చేస్తున్నట్టు నటిస్తూ కొందరు అవినీతిపరులను అరెస్టు చేస్తున్నదనీ, అయితే ఈ అరెస్టులన్నీ పాలక వ్యవస్థలోని రాజకీయ నాయకులా, ఉన్నతాధికారుల మధ్య వుండే వైరుధ్యాల వల్లనే జరుగుతున్నాయని వివరిస్తూ ఇటువంటి అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చింది.

## ఈస్ట్ డివిజన్

### ఇన్‌ఫార్మర్ వెంకటరావు ఖతం

ఈస్ట్ డివిజన్‌లోని గూడెం మండలం బొడ్డుమానుపాకల గ్రామానికి చెందిన వెంకటరావు చాలా కాలంగా పోలీసులతో సంబంధాలను కొనసాగిస్తూ, పోలీసుల వాహనాల మీద తిరుగుతూ రహస్యంగా హోంగార్డ్ ఉద్యోగం చేస్తూ జీతం తీసుకుంటూ తన గ్రామంలో ఉంటున్నాడు. అనేకసార్లు హెచ్చరికలు చేసినప్పటికీ అతను మారలేదు. దానితో పి.ఎల్.జి.ఎ జనవరి 31, 2007న వెంకటరావును పట్టుకుని ఇంటరాగేషన్ చేయగా అతడు తాను చేసిన కార్యకలాపాలను, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను చెప్పాడు. అలాగే ఇప్పటి వరకు పోలీసులకు ఏడుసార్లు సమాచారం ఇచ్చి, కొన్ని ఎన్‌కౌంటర్స్‌కు కారకుడయి డబ్బులు తీసుకున్న విషయాన్ని చెప్పాడు. ఈ విషయాలన్నీ గ్రామ ప్రజల ముందుపెట్టి ఫిబ్రవరి 2, 2007న ఆ ద్రోహిని ఖతం చేయటం జరిగింది.

### ప్రభుత్వ, పోలీసు సంస్కరణలపై సభ

పంచాయితీ కేంద్రమయిన బూదరాళ్ల గ్రామంలో ముట్టడం పెద్దబ్బాయి (గ్రామ పెత్తందారు) వెలుగు సంస్థ, నవ నిర్మాణ సమితి సంస్థలలో చురుగ్గా పని చేస్తూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. వెలుగు సంస్థలో ఉంటూ ప్రభుత్వం, పోలీసు పథకాల్లో భాగంగా ఆదివాసీ యువతీ యువకులను హోంగార్డ్స్ గాను, గిరిజన బెటాలియన్‌లో పోలీసులుగా మార్చుకోవటానికి ఏరియాలో నిరుద్యోగ, చదువుకున్న ఆదివాసీ యువకుల డేటాను సేకరించి ఇస్తూ పోలీసులకు సహకరిస్తున్నాడు.

జనవరి 13, 2007న బూదరాళ్లలో ఈ విషయంలో అతన్ని హెచ్చరించడం కోసమూ, సంస్కరణల బూటకత్వాన్ని ప్రజలకు అర్థం చేయించటం కోసం దళం మీటింగ్ నిర్వహించింది. దీనికి మూకుడుపల్లి, దడవగొయ్యి, సింగారం గ్రామాల నుండి సంఘనాయకులు, మిలీషియా (మహిళలు-పురుషులు) వచ్చారు. ఇటువంటి కార్యక్రమాలు మానుకోకపోతే అతనిపై చర్య తీసుకుంటామని హెచ్చరించింది.

అలాగే అదే గ్రామం నుండి పోలీసుల ప్రలోభాలకు గురై, డబ్బు ఆశతో కంప్యూటర్ ట్రైనింగ్, బట్టల దుకాణంలో ఉద్యోగం, ఉపాధి పేరుతో కొంత మంది యువకులు విశాఖకు వెళ్లి పని చేస్తున్నారు. ఇందులోని ముగ్గురు యువకులను ఈ సభకు పిలిచి మాట్లాడ్డంతో వాళ్ల తమ తప్పుని ఒప్పుకుని ఇక నుండి అటువంటి ఉద్యోగాలు మానుకొని గ్రామాల్లోనే పని చేసుకుని జీవిస్తామని ప్రజలకు హామీ పత్రాన్ని రాసి ఇచ్చారు.

### ధాన్యం గిట్టుబాటు ధరల పోరాటం

రేవుల కోట పాకెట్‌లో ప్రధానంగా ప్రజలు మినుములు, ఉలవలు పండిస్తున్నారు. దీన్ని పలకజీడిలో షావుకార్లే కొనుగోలు చేస్తుంటారు. ప్రతీ సంవత్సరం ప్రజలు సభ జరిపి షావుకార్లను రేటు డిమాండ్ చేసిన తర్వాతనే కొనుగోలు చేయటం ఉంటుంది. ఈ సంవత్సరం కూడా ప్రజలు రేటు డిమాండ్ చేసినప్పటికీ షావుకార్లు రేటు పడిపోయిందని, ప్రజల డిమాండ్ ప్రకారం కొనలేమని చెబుతూ ఒక్కో గ్రామంలో ఒక్కో రకంగా ధర ఇచ్చి మినుములు, ఉలవలు కొనుగోలు చేస్తున్నారు.

దీంతో ఫిబ్రవరి 25న, పాకెట్‌లోని 8 గ్రామాలకు చెందిన సుమారు 70 మంది ప్రజలు షావుకార్లను పిలిచి ప్రజా సభను నిర్వహించారు. ముందుగా ప్రజలు నిర్ణయించిన రేట్లను అపరాల (చిరుధాన్యాలు) గిట్టుబాటు ధర సాధన కమిటీ షావుకార్ల ముందు పెట్టగా, వాళ్లు అంత రేటుకు (మినుములు -120, ఉలవలు-40) కొనలేమని అన్నారు. అయినా ప్రజలందరూ ఇంతకంటే తక్కువ ధరకు అయితే అమ్మమని, గిట్టుబాటు ధర ఇచ్చినవాళ్లకే అమ్ముతామని గట్టిగా నిలబడటంతో షావుకార్లు చివరకు ప్రజలు డిమాండ్ చేసిన ధరకే కొంటామని ఒప్పుకున్నారు.

## ఎం.పి.టి.సి సభ్యుడి అవినీతిని నిలదీసిన ప్రజలు

పలకజీడి గ్రామానికి చెందిన బొడ్డయ్య గతంలో ఈదులబండ గ్రామంలో విద్యావాలంటీర్‌గా పని చేసేవాడు. అయితే ఏ ఒక్క రోజు బడిలో పాఠాలు చెప్పకపోగా, స్కూలు పిల్లలకు వచ్చే మధ్యాహ్న భోజన పథకం తాలూకు బియ్యం, డబ్బు మొత్తం తినేశాడు. ఈ విషయం ఈదులబండ గ్రామస్తులు గతంలో నిలదీశారు, పార్టీ నుండి కూడా అతడ్ని హెచ్చరించినప్పటికీ అతడు ఏమాత్రం పట్టించుకోకపోగా ఎం.పి.టి.సి సభ్యుడిగా ఎన్నికల్లో నిలబడి గెలిచాడు. గతంలో ఇతడు పోలీసుల జీప్ ట్రైనింగ్‌కు వెళ్లటంతో పలకజీడి గ్రామంలోనే సభ నిర్వహించి మానుకోవాలని దళం హెచ్చరించింది. ఈ విషయాలన్నింటినీ ఫిబ్రవరి 25న రేవులకోట పాకెట్ ప్రజల ముందు పెట్టటంతో ప్రజలందరూ నిలదీశారు. ఎం.పి.టి.సిగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని లేదంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. దానితో అతను రాజీనామా చేస్తానని, ఈదుల బండ పాఠశాల పిల్లలకు ఇవ్వాల్సిన బియ్యం, డబ్బును ఇస్తానని, ఇక నుండి ఎటువంటి రాజకీయాల జోలికి వెళ్లకుండా గ్రామంలో వ్యవసాయం చేసుకుని బతుకుతానని ప్రజల ముందు ఒప్పుకొని హామీ పత్రం రాసి ఇచ్చాడు.

## మండలాధ్యక్షుడి ఇంటిపై దాడి

కామ్రేడ్స్ బి.కె, కరుణలకు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా పెదవలసలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మండలాధ్యక్షుడు రాజుపడాల్ ఇంటిపై పి.ఎల్.జి.ఎ దాడిచేసి అతడి ఇంట్లోని సామాన్లు ధ్వంసం చేసి బూటకపు ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులు, నిర్బంధానికి బాధ్యత వహించి రాజీనామా చేయాలని హెచ్చరించింది.

## ఇన్‌ఫార్మర్ ధనుర్జయ్ ఖతం

మండల కేంద్రం అయిన గూడెం గ్రామంలోని బురుడి ధనుర్జయ్ తాపీ మేస్త్రీగా పని చేస్తూ చుట్టుపక్కల గ్రామాలకు వెళుతుంటాడు. వెలుగు సంస్థలో కార్యకర్తగా పని చేస్తూ పోలీసులతో గత కొంతకాలంగా సంబంధాలు కొనసాగిస్తూ వారి ప్రోద్బలంతో డబ్బు ఆశతో ఇన్‌ఫార్మర్‌గా మారాడు. తాపీ మేస్త్రీ, వెలుగు కార్యకర్త, బంగారు కాసులు కొనేవాడిలాగా రక రకాల వేషాలతో ఏరియాలోకి వచ్చి ఇక్కడి పెత్తందార్లు, మునసబులతో పరిచయాలు ఏర్పర్చుకుని, మరి కొంత మందిని ఇన్‌ఫార్మర్లుగా తయారు చేస్తూ పార్టీ కదలికలను, సమాచారాన్ని సేకరించి పోలీసులకు చేరవేస్తున్నాడు. అతడిని పట్టుకొని పి.ఎల్.జి.ఎ విచారించగా తను ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తూ చేసిన కార్యకలాపాలను, తీసుకున్న డబ్బుల వివరాలను చెప్పాడు. ఇతడిని అక్కడి గ్రామాల ప్రజల ముందు పెట్టి ఫిబ్రవరి 3, 2007న ఖతం చేయటం జరిగింది.

# మల్కాన్‌గిరి జిల్లా

## విజయవంతమైన మే 21 బంద్

పోలీసు నిర్బంధానికి నిరసనగా మే 21న చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఇందులో భాగంగా కలిమెల, పొడియా, మోటు, బలిమెల ఏరియాల్లో బంద్ విజయవంతం అయింది. వాహనాల రాకపోకలు బంద్ చేయడం కోసం రోడ్లపై చెట్లను నరికివేసారు, బ్యానర్లు కట్టి, పోస్టర్లు వేసి బంద్‌ను ప్రచారం చేసారు.

## బ్రాంది షాపు ధ్వంసం

పై బంద్ పిలుపులో భాగంగా బెజ్జంగివాడ పంచాయితీ గ్రామంలో ఒక బ్రాంది షాపును పి.ఎల్.జి.ఎ దగ్ధం చేసింది. ఈ బ్రాంది షాపు యజమాని ఆదివాసులకు ఇష్టం వచ్చిన ధరకు అమ్ముతూ అధిక లాభాలు పొందడమే కాకుండా, పోలీసులతో సంబంధం కలిగి వుంటూ, సానుభూతిపరుల గురించి సమాచారం ఇచ్చేవాడు. దానితో పి.ఎల్.జి.ఎ సభ్యులు, 50 మంది ప్రజలూ కల్సి వెళ్లి ఈ బ్రాంది షాపుపై దాడి చేసి దాన్ని ధ్వంసం చేసి బ్రాంది షాపు నడపవద్దని పోలీసులతో సంబంధం పెట్టుకోవద్దని యజమానిని హెచ్చరించారు. ఆ తర్వాత మీటింగ్ పెట్టి సారా మానండి, ఆరోగ్యాలు కాపాడుకోండి అని ప్రచారం చేశారు.

## ఎస్.ఆర్ కంపెనీ బిల్డింగ్ పేల్చివేత

పై బంద్ సందర్భంగా నంబర్ 14 పంచాయితీ వల్లిగూడ గ్రామంలోని బైలడిల్లా ఇనుప ఖనిజం సప్లై కోసం ఏర్పాటు చేసిన పైపులైన్‌ను కంట్రోల్ చేయడం కోసం ఏర్పాటుచేసిన కంప్యూటర్ బిల్డింగ్‌ను పప్పులూర్ దళం నాయకత్వంలో ప్రజలు పేల్చివేసారు. దీన్ని పేల్చివేయడం వల్ల సామ్రాజ్యవాదుల ప్రయోజనం కోసం ఏర్పాటుచేసిన పైపులైను పనులు జరుగకుండా ఆటంకం ఏర్పడింది.

## తునికాకు గోడౌన్ దహనం

తునికాకు రేటును పెంచడానికి నిరాకరించినందుకు జూన్ 5వ తేదీన సీక్‌పల్లి పంచాయితీ ఎం.వి 17 క్యాంపులోని తునికాకు గోడౌన్లపై దళం 55 మంది మిలీషియాతో కల్సి దాడి చేసింది. ఆ తర్వాత 8 బిల్డింగులలోని తునికాకును దహనం చేశారు. ఈ చర్య వల్ల దాదాపు కోటిన్నర లక్షల నష్టం వాటిల్లింది. ఈ చర్యను పోస్టర్లు వేసి ప్రచారం చేశారు.

## లాండ్ టెలిఫోన్ లైన్ ధ్వంసం

కలిమెల పొట్టేరు పోలీసుస్టేషన్ల మధ్యన గల లాండ్ టెలిఫోన్ లైన్‌ను 17 మందితో కూడిన మిలీషియా దళం ధ్వంసం చేసింది. ఈ సందర్భంగా భూమిలోని ఫోన్ లైన్ తవ్వి తీసి ధ్వంసం చేసారు.

## సి.ఆర్.పి.ఎఫ్ పోలీసులపై దాడి

ఎం.వి 79 సంతలో కూంబింగ్ చేస్తున్న పోలీసులపై ఏప్రిల్ 29న 12 మంది పి.ఎల్.జి.ఎ సభ్యులు దాడి చేసి ఒక ఎస్.ఐని చంపి, 5 గురు సి.ఆర్.పి.ఎఫ్ వాళ్లను గాయపర్చి ఒక ఎ.కె, ఒక ఇన్‌సాస్, 4 బులెట్ ప్రూఫ్ జాకెట్స్ స్వాధీనం చేసుకొన్నారు. అయితే రిట్రీట్ అయ్యే క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఈ చర్యలో పాల్గొన్న కా. హరి, కా. రత్న అమరులైనారు. సంతలో జరిగిన దాడి వల్ల శత్రువు తీవ్ర భయాందోళనకు గురయ్యాడు. రెండు కిలోమీటర్ల దూరంలో వున్న పోలీసు స్టేషన్‌లోని పోలీసులు గందరగోళంకు గురై తమపైనే దాడి చేశారని ఫైరింగ్ చేశారు.

## ఒ.ఎస్.ఎ.పి సుబేదార్‌పై దాడి

జూన్ 7వ తేదీన సంతలో 4 గురి యాక్షన్ టీం సుబేదార్‌పై దాడి చేసి గాయపర్చారు. ఈ సుబేదారు ఎన్నో రోజులుగా స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడుతున్నాడు, ప్రజల్ని భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నాడు. మావోయిస్టులను అణచివేయడం కోసం పోలీసు బలగాలను ఏరియాలో తిప్పుతున్నాడు. ఏరియాలో ఇన్‌ఫార్మర్స్‌ను తయారు చేస్తున్నాడు. దీనితో యాక్షన్ టీం ఇతన్ని శిక్షించింది. ప్రజలు ఈ సుబేదార్‌ను చంపివుండాలని అభిప్రాయపడ్డారు. అయితే సంతలో జరిగిన ఈ సంఘటన పోలీసుల్లో భయాందోళనకు గురి చేసింది.

## క్వారీ క్రషర్‌పై దాడి చేసి అమ్మోనియం నైట్రేట్ స్వాధీనం

మే 7వ తారీకున మల్కన్‌గిరి దగ్గరలోని సలాన్‌గూడ గ్రామంలో క్రషర్‌పై దాడి చేసి వేయి డిటనేటర్స్, ఫ్యూజ్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో ఐదుగురు దళ సభ్యులు పాల్గొన్నారు.

మే 8వ తేదీన పోగురు పంచాయితీ కుర్సువాడ గ్రామంలో క్రషర్‌పై దళం 120 మంది మిలీషియాతో దాడి చేసి 13 బస్తాల అమ్మోనియం నైట్రేట్ టెలికాపర్ 20, ఎక్స్‌ప్లోజర్ -1 స్వాధీనం చేసుకున్నారు.

## రెండు రోడ్డు రోలర్స్ ధ్వంసం

చిత్రకొండ నుండి పప్పులూరుకు రోడ్డు నిర్మిస్తున్నారు. ఎన్నిసార్లు కాంట్రాక్టర్లకు హెచ్చరించినా రోడ్డు నిర్మాణం ఆపకపోవడంతో కప్పతొట్టి పంచాయితీ దగ్గర వున్న రెండు రోడ్డు రోలర్లను దళం, మిలీషియా కలిసి పేల్చివేశారు. జూన్ 26, 27న బంద్ విజయవంతం చేయడంలో భాగంగా ఈ విధ్వంసక కార్యక్రమాలు చేశారు.

★

### మండల కాంగ్రెస్ నేతపై పి.ఎల్.జి.ఎ చర్య

జూలై 1వ తేదీన జరిగిన కామ్రేడ్ సోమన్న బూటకపు ఎన్‌కౌంటర్‌కూ, అలాగే రాష్ట్రంలో వరసగా జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లకూ నిరసనగా జూలై 12వ తేదీన ఖమ్మం జిల్లా, కుకునూర్ మండలం, బంజరగూడెంలో రాంరెడ్డి అనే మండల కాంగ్రెస్ నాయకుడిని పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది.

రాంరెడ్డి ఈ ప్రాంతంలో క్రూరుడుగా పేరుపడిన వాడు. అనేక హత్యలతో, మహిళలపై అత్యాచారాలతో రాంరెడ్డికి సంబంధం వుంది. కాంగ్రెస్‌లో పెద్ద పెద్ద మంత్రులతో ఇతనికి సంబంధాలున్నాయి. ఎ.ఐ.సి.సి కార్యదర్శి పొంగులేటి సుధాకర్ రెడ్డి ఇతనికి బంధువు. ఇటువంటి రాజకీయ అండదండలతో 30 ఏళ్లుగా ఈ ప్రాంతంలో పెత్తనం చెలాయిస్తున్నాడు. అన్యాయాల్ని ప్రశ్నించిన ప్రజలను చిత్రహింసలు పెట్టేవాడు. హత్యలకు సైతం పాల్పడేవాడు.

ఇటువంటి క్రూరుడిని చంపటం ఈ ప్రాంతంలోని ప్రజలను ఎంతగానో ఉత్సాహపరిచింది.

ఈ చర్య ఈ ప్రాంతపు కాంగ్రెస్ నాయకుల్లో తీవ్ర భయాందోళనలను కల్గించింది. చాలా మంది తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఈ చర్య పాలకవర్గాల కాపలా కుక్కలైన పోలీసులకు మరింత పిచ్చెక్కించింది. అందుకే ఈ ఘటన జరిగిన తర్వాత చుట్టుపక్కల గ్రామాలపై రాత్రుళ్లు దాడులు చేసి పార్టీ సానుభూతిపరులను ఎత్తుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. కుటుంబ సభ్యులకు వారి ఆచూకీ సైతం చెప్పకుండా మానసిక వేదనకు గురి చేశారు. ఏరియాలో కూంబింగ్‌లను సైతం విస్తృతంగా చేపట్టారు.

**“పత్రిక అంటూ మొదలు పెట్టిన తర్వాత దానిని చైతన్య పూర్వకంగానూ, చక్కగానూ నడపాలి. ఇది పత్రికా ఉద్యోగుల, పాఠకుల ఇరువ్వురి బాధ్యత కూడా. పాఠకులు తమకు ఏది నచ్చిందో ఏది నచ్చలేదో వివరిస్తూ సూచనలు, చిన్న చిన్న ఉత్తరాలు, వ్యాసాలు పత్రికకు పంపాలి. ఇది చాలా ముఖ్యం. పత్రికను విజయవంతంగా నడపడానికి ఇదొక్కటే మార్గం.“ - మావో**

'క్రాంతి'కి 30 యేళ్ల నిండిన సందర్భంగా....

# 'క్రాంతి' బాటలో మైలు రాళ్లను నాటిన కామ్రేడ్స్ మంజీరా, దేవన్న, శ్రీనులకు వినమ్ర నివాళి

30 యేళ్ల 'క్రాంతి' ప్రయాణంలో కొందరు కామ్రేడ్స్ మైలురాళ్లను వేశారు. అందులో కామ్రేడ్ ప్రకాశ్ మాస్టారు విశేషంగా ఎన్నదగినవారు. ఆయనకు వారసులుగా నిలిచిన వారు కామ్రేడ్స్ మంజీరా, దేవన్న, శ్రీనులు.

కామ్రేడ్ మంజీరా (రవి కుమార్) 1992 నుండి 96 వరకూ క్రాంతి సంపాదకవర్గ సభ్యుడిగా పని చేశాడు. ఈ కాలంలో క్రాంతి బాధ్యులుగా ఉన్న కామ్రేడ్ ప్రకాశ్ మాస్టారు నేతృత్వంలో కా. మంజీరా పత్రికా రంగంలో ఆయనకు గర్వించతగిన వారసుడిగా ఎదిగాడు. తన సునిశితమైన విశ్లేషణ ద్వారా ఆనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ రంగంపై 'క్రాంతి' వేసిన విశేషమైన ప్రభావంలో కామ్రేడ్ మంజీరాకు సముచితమైన స్థానం వుంది. ముఖ్యంగా కామ్రేడ్ మంజీరా రివిజనిజంపై లోతైన అధ్యయనం చేసి 'క్రాంతి'లో పలు వ్యాసాలు రాశాడు. శ్రీలంక జాతి విముక్తి పోరాటాలపైన సైతం అధ్యయనం చేసి 'క్రాంతి' పాఠకులకు వ్యాసాల ద్వారా ఆ జ్ఞానాన్ని అందించాడు. కామ్రేడ్ మంజీరా కలం నుండి జాలువారిన సూటైన, సరళమైన రచనాశైలి పాఠకుల మనసుల్లో ముద్రించుకుపోయింది.



కామ్రేడ్ మంజీర

'క్రాంతి' సంపాదకవర్గం నుండి వైదొలిగిన తర్వాత 1996 చివరి నుంచీ దండకారణ్యంలో జోనల్ కమిటీ సభ్యుడిగా పని చేసి, ఆ తర్వాత 2001 నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తూ, 2006 జూన్‌లో గుంటూరు జిల్లాలో గ్రేహౌండ్స్ పోలీసుల దాడిలో కా. మంజీరా అమరుడయ్యాడు.

కా. దేవన్న (కారుమంచి ప్రసాద్) 99 నుంచి రెండు సంవత్సరాల పాటు 'క్రాంతి' సంపాదకవర్గ సభ్యుడిగా పని చేశాడు. బూర్జువా పత్రికల్లో 'వేంపెంట' సమస్యపై లోతైన విశ్లేషణాత్మక వ్యాసాలు రాయడం ద్వారా ఆనాడు ఎందరినో ఆకట్టుకున్న కామ్రేడ్ దేవన్న, 'క్రాంతి' సంపాదక వర్గ సభ్యుడై పత్రిక నాణ్యతను కొనసాగించడంలో తీవ్రమైన కృషి చేశాడు. మంచి కథకుడు కూడా అయిన దేవన్న తన రచనా సామర్థ్యంతో 'క్రాంతి'కి వన్నె తెచ్చాడు.

'క్రాంతి' నుంచి వైదొలిగిన తర్వాత ఆంధ్ర రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తూ 2003 జూన్‌లో చిత్తూరు - కడప సరిహద్దు ప్రాంతంలో గ్రేహౌండ్స్ మూకల దాడిలో కామ్రేడ్ దేవన్న అమరుడయ్యాడు.



కామ్రేడ్ శ్రీను

1995లో ప్రత్యేక జోన్‌గా ఏర్పడ్డ ఉత్తర తెలంగాణా 96 నుండి 'ప్రజా విముక్తి'ని తన రాజకీయ పత్రికగా ప్రచురించింది. 'క్రాంతి' స్ఫూర్తితో కాంతులీనిన 'ప్రజా విముక్తి' 2006లో 'క్రాంతి'లో లీనమయింది. కా. శ్రీను (సురేష్) 'ప్రజా విముక్తి' సంస్థాపక సంపాదక వర్గ సభ్యుడిగా 2001 వరకూ కొనసాగాడు. పత్రిక నడిపిన అనుభవం లేని కొత్త జోన్‌లో బాల్యారిష్టాలెన్నింటినో భరించి 'ప్రజా విముక్తి'ని పాదుకొల్పడంలో ఎనలేని కృషి చేశాడు. మంచి ఇంగ్లీష్ భాషా ప్రావీణ్యమున్న కా. శ్రీను 'ప్రజా విముక్తి' కోసం అనేక వ్యాసాలను అనువదించాడు. అలా ఉత్తర తెలంగాణా ఉద్యమ చరిత్రకు పత్రిక అనే అధ్యాయాన్ని జోడించిన కృషిలో ముఖ్యమైన భాగస్వామి అయ్యాడు.

'ప్రజా విముక్తి' నుంచి వైదొలిగిన తర్వాత వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడిగా పని చేస్తూ పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరోచితంగా పోరాడుతూ కా. శ్రీను అమరుడయ్యాడు.

ఈ కామ్రేడ్సందరూ 'క్రాంతి'కి చిరస్మరణీయులు. వారి అమరత్వానికి 'క్రాంతి' వినమ్రంగా జోహార్లర్పిస్తోంది. వారి ఆశయసాధనలో నిరంతరం ప్రజల పోరాట శ్వాసగా నిలుస్తానని ప్రతిజ్ఞ చేస్తోంది.

★